

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

డిసెంబరు 2025
వెల రూ. 20/-
పుటలు - 56

SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:56, Issue: 07
December - 2025, Price Rs.20/-.

**తిరుమలలో వైకుంఠ ఏకాదశి**
**శ్రీవారి స్వర్ణరథోత్సవం (30-12-2025)**



తిరుమల
శ్రీవారి ఆలయంలో
కృత్తికా దీపోత్సవం
(04-12-2025)





# గీతాశ్లోకార్థసారం

**శ్లో : భయాద్రణాదుపరతం మన్యంతే త్వాం మహారథాః ।**
**యేషాం చ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్ ॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-35వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** చ= మఱియు; యేషామ్= ఎవరిదృష్టిలో; త్వమ్= నీవు; బహుమతః= మిక్కిలి మాన్యుడవు; భూత్వా= అయి (ఉంటివో); లాఘవమ్= (ఇప్పుడు)చులకన; యాస్యసి= అయ్యెదవు; మహారథాః= ఆ మహారథులు; త్వామ్= నిన్ను; భయాత్= భయమువలన (భయకారణముగా); రణాత్= యుద్ధము నుండి; ఉపరతమ్= పారిపోయిన వానినిగా; మన్యంతే= తలంతురు.

**భావం:** ఈ మహారథుల దృష్టిలో ఇప్పుడు నీవు మిక్కిలి మాన్యుడవు. యుద్ధవిముఖుడవైనచో వీరి దృష్టిలో నీవు ఎంతో చులకన అయ్యెదవు. అంతేగాక నీవు పిరికివాడవై యుద్ధము నుండి పారిపోయినట్లు వీరు భావింతురు.



## 'వేవేలు మొక్కులు లోకపావని'

దేవునికి దేవికిని తెప్పలకోనేటమ్మ
వేవేలు మొక్కులు లోకపావని నీ కమ్మా

ధర్మార్థకామమోక్షతతులు నీసోబనాలు
అర్మిలి నాలుగువేదా లదె నీదరులు
నిర్మలపునీజలము నిండుసప్తసాగరాలు
కూర్మము నీలోఁతు వోకోనేరమ్మా

తగినగంగాది తీర్థములు నీకడళ్లు
జగతి దేవతలు నీజలజంతులు
గగనపుఁబుణ్యలోకాలు నీదరిమేడలు
మొగి నీచుట్టుమాఁకులు మును లోయమ్మా

వైకుంఠనగరమువాకిలే నీయాకారము
చేకొనుపుణ్యములే నీజీవభావము
యేకడను శ్రీవేంకటేశుఁడే నీవునికి
దీకొని నీతీర్థ మాడితిమి కావవమ్మా

అధ్యాత్మసంకీర్తన సంపుటం 2- సంకీర్తన 426

ఓ పుష్కరిణీ! నీగొప్పవగు పడికట్టులే ధర్మార్థకామమోక్షాలనే పురుషార్థాలు. నీ నాలుగువైపుల గల కట్టలు నాలుగువేదాలు. నీ అప్పటమైన నీరే ఏడుసముద్రాలు. ఆదివరాహస్వామి నీలోతు తెలిసినవాడు. నీ విజృంభించే అలలే గంగమున్నగు పుణ్యతీర్థాలు. దేవతాసమూహమే నీలో జీవించే జలజంతువులు. నీ ఒడ్డున ఉండే భవనాలే పుణ్యభువనాలు. నీ చుట్టు నిలిచి ఉండే మ్రాకులే యోగులు. శ్రీ పతియు, శ్రీమతియు తెప్పలదేలుచుండ నొప్పెడు ఓ పుష్కరిణీ! నీవు లోకాలను పావనం చేసే దానవు. పుణ్యసముదాయమే నీ జీవనము. నీదు రూపమే ఆ వైకుంఠపురానికి వాకిలి గదా తల్లీ!

వ్యాఖ్యాత - కీ.శే.విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు



ఆప్తవాక్యం

# ఏకం శాస్త్రం దేవకీపుత్రగీతం

– బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

'భారతీయసంస్కృతి'లో భగవద్గీత స్థానం చాలా ప్రధానమైనది. ఈ మహాగ్రంథం 'మహాభారతం'లో ఒక భాగం మాత్రమే అయినప్పటికీ సర్వగ్రంథాల సారం. అందుకే దానికి అంత ప్రత్యేకత వచ్చింది.

'యస్య నిశ్వసితం వేదాః', 'ఏతత్ సర్వం జనార్దనాత్'– భగవంతుని ప్రాణశక్తిగా, శ్వాస(ఊపిరులు)గా ఉన్నవి వేదములు. అవే భగవంతుని నుండి వచ్చాయి గనుక అవి కూడా భగవద్గీతలే. మరి ఈ భగవద్గీతకు ఇంత ప్రాధాన్యం ఇస్తూ మార్గశిర ఏకాదశిని గీతాజయంతిగా చేయడంలో ఆంతర్యం ఏమిటి? అంటే మొత్తం వీటన్నింటి సారం మనకు ఈ భగవద్గీత అందిస్తున్నది.

అసలు పురాణ సంప్రదాయంలో... అవధూతగీత, అష్టావక్రగీత, హంసగీతవంటి గీతలు చాలా ఉన్నాయి. భారతంలోనే మనకు కనబడే... ఎన్నో గీతలు కాక ఇతర పురాణాలలో కూడా *శివగీత, గణేశగీత, సూర్యగీత, భగవతీగీత...* ఇలాంటివి గోచరిస్తూ ఉన్నాయి. ఇన్ని గీతలు ఉన్నప్పటికీ ఈ భగవద్గీతను తలమానికంగా మనం భావిస్తూ ఉన్నాం. అన్ని గీతలలో చెప్పబడిన అంశం కూడా ఒకటే. *"బ్రహ్మవిద్య దేని యందు చెప్పబడుతుందో దానిని గీత అనాలి"*– ఇదే నిర్వచనం.

వేదం ప్రకారంగా వచ్చిన రకరకాల మార్గములేవైతే ఉన్నాయో అన్ని మార్గములనూ సమన్వయిస్తుంది భగవద్గీత. కర్మ, ధ్యాన, జ్ఞాన, ఉపాసన– ఇలా విభిన్నములైన యోగములన్నీ కూడా భగవద్గీతలో సమన్వయింపబడతాయి. యోగం అంటేనే భగవంతుని చేరుకునే ఉపాయము అని అర్థం. వీటి ద్వారా తెలియబడే వాడే యోగేశ్వరుడు.

*యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః।*
*తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ॥*

– అని భగవద్గీతను అంతా ప్రత్యక్షసాక్షిగా చూసిన సంజయుడు చేసిన తీర్మానం. 'యోగేశ్వరుడైన కృష్ణుడు, ధనుస్సు ధరించిన అర్జునుడు ఎక్కడ ఉంటారో... అక్కడ సంపద, ఐశ్వర్యము, విజయము అన్నీ ఉంటాయి. ఈ చెప్పడంలో ఉన్న ఆంతర్యాన్ని పరిశీలించాలి. యోగేశ్వరుడైన కృష్ణుడు, ధనుర్ధారి యైన అర్జునుడు. అంటే– **అన్ని ఉపాయాలూ ఎవరిని చేర్చుతున్నాయో ఆ గమ్యం కృష్ణుడు, అది చేరుకోవడానికి ప్రయత్నించే సాధకుడు అర్జునుడు. అందుకే.. సిద్ధి కృష్ణుడు అయితే, సాధన అర్జునుడు అవుతున్నాడు.**

**తన ధర్మాన్ని ఆచరించేటప్పుడు దానికి కావలసిన శక్తి అంతా పరమేశ్వరుని నుండి లభిస్తున్నది అనే స్పృహ ఉండాలి. 'పరమేశ్వరునికే అర్పిస్తున్నాను' అనే భక్తిభావం ఉండాలి. ఈ రెండిటితో ధర్మాన్ని ఆచరిస్తే అది జ్ఞానాన్ని, మోక్షాన్ని ఇస్తుంది.** దీనినంతా–

**యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్।**
**స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విన్దతి మానవః॥**

**(18వ అధ్యాయం)**

–'ఎవరివలన ఈ సృష్టి స్థితిలయలు జరుగుతున్నాయో, ఎవరి వలన ఈ ప్రపంచం అంతా నడుపబడుతున్నదో, ఎవడు ఈ ప్రపంచానికి ఆధారభూతమై ఉన్నాడో ఆ పరమాత్మను వారు వారి కర్మలతో ఆరాధించి సిద్ధిని పొందుతారు' భగవద్గీత సారాంశం అంతా ఇదే అని పరమాత్మ చెప్పాడు.



తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 56 డిసెంబరు, 2025 సంచిక : 07



**వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।**
**వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి॥**

గౌరవ సంపాదకులు
శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-సంపాదకులు,
ప్రధాన సంపాదకులు (ఎఫ్.ఏ.సి.)
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉప సంపాదకురాలు
డా॥ అల్లాడి సంధ్య, ఎం.ఏ.తెలుగు, ఎం.ఏ.సంస్కృతం, ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

ముద్రాపకులు
శ్రీ ఆర్.వి.విజయకుమార్, బి.ఏ., బి.ఎడ్.,
ఉపకార్యనిర్వహణాధికారి, (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
ప్రధానసంపాదకులు-0877-2264363
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- chiefeditortpt@gmail.com; ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.

0877 2277777 / 2233333

## ఈ నెలలో....

| | | |
|---|---|---|
| ఏకం శాస్త్రం దేవకీపుత్రగీతం | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 04 |
| 'తిరుప్పావై' వైశిష్ట్యం | డా॥ పరవస్తు కమల | 07 |
| సందేహాలు-సమాధానాలు | డా॥ రేవూరు అనంతపద్మనాభరావు | 10 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 11 |
| గీతారహస్యం | శ్రీమతి ఆర్.శోభాదేవి | 12 |
| గాయకసార్వభౌముడు 'తిరుప్పాణాళ్వారు' | శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు | 13 |
| పరమపుణ్యధామమూ.. ఉత్తరద్వారదర్శనము | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 15 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 17 |
| శ్రీహనుమద్వ్రత వైభవము | డా॥ లంక వేంకట సుబ్రహ్మణ్యేశ్వర శర్మ | 18 |
| అష్టసిద్ధులు వాటి ప్రభావం | శ్రీమతి కౌతా నిర్మల | 22 |
| పూర్ణపురుషుడు | శ్రీ మాడుగుల రామకృష్ణ | 24 |
| తిరుతొలైవిల్లి మంగళం (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| శ్రీ అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయం | డా॥ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు | 31 |
| తొండరడిప్పొడిఆళ్వార్ (విప్రనారాయణులు) | డా॥పి.టి.జి.రంగరామానుజాచార్యులు | 33 |
| గోవిందం పరమానందం | షణ్ముఖప్రియ నండూరి | 36 |
| సీతాస్వయంవరం | శ్రీ వై.సుబ్రహ్మణ్యం | 38 |
| కృత్సమదమహర్షి | శ్రీమతి భమిడిపాటి బాలా త్రిపురసుందరి | 39 |
| అభయహస్తం | శ్రీమతి రాగిచెట్టు మంగలాబాయి | 41 |
| మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు | ఆంగ్లమూలం- శ్రీలక్ష్మీనరసింహన్ శ్రీధర్<br>తెలుగు - శ్రీదేవీ మురళీధర్ | 42 |
| హనుమ ద్వారా మనం నేర్చుకోవాల్సినవి | శ్రీ సురేశ్ కుమార్ రెడ్డి | 43 |
| భగవద్గీత-యువత | డా॥ కె.అరవిందరావ్ | 45 |
| 'సత్సంగ' ఉద్దేశ్యం | శ్రీ మణికంఠసాయి | 47 |
| తిరుమంగై ఆళ్వార్ (చిత్రకథ) | కథ: శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు: శ్రీ కె.ద్వారకనాథ్ | 48 |
| లోభిని యాచించగూడదు (వేమన శతకం) | కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు | 50 |
| సామర్థ్యం లేని వాని ఇంట్లో సంపద నిలవదు (భాస్కర శతకం) | శ్రీ పి.వి.కే.ప్రసాదరావు | 50 |
| క్విజ్ | | 51 |
| బాలవినోదం | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| శ్రీపదకేళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |

ముఖచిత్రం : తిరుమలలో వైకుంఠఏకాదశి, స్వర్ణరథోత్సవం
వెనుకచిత్రం: శ్రీగోదాదేవి, శ్రీగోవిందరాజస్వామి ఆలయం, తిరుపతి



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# "వైకుంఠద్వారదర్శనం" ముక్తిదాయకం

శేషాచలే యన్మాహాత్మ్యం మన్యక్షేత్రే న తత్ క్వచిత్।
తద్గత శ్రీనివాసస్య మహిమా నాన్యగః శుభః॥

శేషాచలం ప్రపంచ ప్రసిద్ధి పొందిన పుణ్యస్థలం. ఈ దివ్యక్షేత్రానికి ఉన్న మహిమ ఇతర క్షేత్రాలకు దేనికీ లేనే లేదు. ఈ దివ్యస్థలంలో కొలువైవున్న శ్రీవేంకటేశ్వరుని వంటి మహా మహిమాన్వితుడైన దేవుడు ఇంకెక్కడా కానరాడు. అలాంటి దేవదేవుడు కొలువైవున్న బంగారుమేడ 'ఆనందనిలయాన్ని' వీక్షించడం, అందలి శ్రీనివాసుని నిలువెత్తు దివ్యమంగళవిగ్రహాన్ని కన్నులారా దర్శించడం పూర్వజన్మ సుకృతం.

కలియుగ భూలోక వైకుంఠమైన తిరుమలక్షేత్రంలో ఏడాది పొడవునా **నిత్యోత్సవాలు, వారోత్సవాలు, పక్షోత్సవాలు, మాసోత్సవాలు, సంవత్సరోత్సవాలు** జరుగుతూనే ఉంటాయి.

**"మాసానాం మార్గశీర్షోఽహం"**– నెలలన్నింటిలోనూ 'మార్గశిరం' తలమానికం. ఈ మాసం శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతికరం. ఈ నెలలో చేసే పూజలతోపాటు, ఉపవాసాలు సమస్త శుభాలను చేకూరుస్తుంది. ఈ మాసంలోనే శ్రీమద్భగవద్గీత అవతరించడం, వైకుంఠఏకాదశి, హనుమద్వ్రతం రావడం, పన్నిద్దరాళ్వార్లలో ఒకరైన తిరుమంగైఆళ్వార్ల శాత్తుమొర, అట్లే తిరుప్పాణాళ్వార్, తొండరడిప్పొడిఆళ్వార్ల వర్షతిరునక్షత్రాలు రావడం ముదావహం.

సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించడంతో **'ధనుర్మాసం'** ప్రారంభమవుతుంది. ధనుర్మాసం శ్రీమహావిష్ణువు ఆరాధనకు విశేషమైన మాసం. పెరియాళ్వార్ల మానస పుత్రికారత్నం 'గోదాదేవి' (ఆండాళ్) భూదేవి అవతారం. ఆమె ఆచరించిన వ్రతమే **'ధనుర్మాసవ్రతం'**. ఈ వ్రతాన్నే **'తిరుప్పావై'** అంటారు. ఆండాళ్ తల్లి తన తోటి చెలులతో కలసి కృష్ణకీర్తన, కృష్ణధ్యానంతో ఆయనలో లీనమయ్యే లక్ష్యంతో సాగించిన 30 పాశురాల గీతికావ్రతమిది. ఈ మాసంలో గోదాదేవి కీర్తించిన తిరుప్పావై పాశురములతో తిరుమల స్వామివారిని మేల్కొలుపుతారు.

**శ్రీవారి సన్నిధిలో 'వైకుంఠ ఏకాదశి'–**

ముఖ్యంగా మార్గశిరమాసంలో వచ్చే శుద్ధఏకాదశి పరమపవిత్రమైన దినం. దీనినే **'వైకుంఠ ఏకాదశి'** అంటారు. వైకుంఠ ఏకాదశి నాడు సుప్రభాత సమయంలో శ్రీవారి గర్భాలయానికి దగ్గరగా ఆనుకొని ఉన్న "ముక్కోటి ప్రదక్షిణమార్గం" తెరవబడుతుంది. ఈ ముక్కోటి ప్రదక్షిణ మార్గంలో ప్రవేశించే భాగ్యం భక్తులకు ఏడాదిలో పది రోజులు తిరుమల తిరుపతి దేవస్థానములు కల్పిస్తోంది. వైకుంఠ ప్రదక్షిణంలో ప్రవేశించిన భక్తులకు పూర్వసంచిత పాపకర్మలు నశిస్తాయి. ఇష్టార్థాలన్నీ నెరవేరుతాయి. ఇదే రోజున శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీమలయప్పస్వామి బంగారుతేరుపై తిరుమాడవీథుల్లో భక్తులకు దర్శనమిచ్చే దృశ్యాన్ని వర్ణించడం అక్షరాలకు అందదు. దర్శించి తరించాలి అంతే!

ఇక మానవవ్యక్తిత్వవికాసానికి ప్రతీక **'భగవద్గీత'**. సాక్షాత్తు శ్రీకృష్ణుని అమృతవాక్కులైన 'గీత' మార్గశిర శుద్ధఏకాదశినాడే ఆవిష్కృతమైంది. ఈ ఏకాదశినాడు 'గీతాపారాయణం' చేయాలి, చేయించాలి.

ఈ మాసంలోనే ఆస్తికులకు సన్మార్గాన్ని చూపించి, తరించిన భాగవతోత్తములైన తిరుమంగై, తిరుప్పాణ్, తొండరడిప్పొడిఆళ్వార్ల శాత్తుమొర, వర్షతిరునక్షత్రాలు రావడం, వారిని స్మరించడం మన బాధ్యత.

ఈ విధంగా **'మార్గశిరం'**లో సంభవించే పండుగలు, పర్వదినాల వైశిష్ట్యాన్ని, ప్రాశస్త్యాన్ని గ్రహించి, అనువైన వాటిని సాధనచేసి ఆచరిద్దాం. తరిద్దాం.

**"సర్వే జనాః సుఖినో భవన్తు"**

16 డిసెంబరు నుండి ధనుర్మాసం ప్రారంభ సందర్భంగా..

# ‘తిరుప్పావై’ వైశిష్ట్యం

– డా॥ పరవస్తు కమల

గోదాదేవి రచించిన ధనుర్మాసవ్రత సంకల్పమైన **‘తిరుప్పావై’** గ్రంథంలో ముప్పై పాశురాలు ఉన్నాయి. పరమాత్మతత్త్వాన్ని ప్రతీకలుగా తెలియజెప్పే ఈ గ్రంథం రూపంలో చిన్నదైనా, తత్త్వంలో అనంతమైనది. భగవద్గీత బోధించే కర్మ, జ్ఞాన, భక్తియోగ తత్త్వాలను ప్రదర్శిస్తూ, పరమాత్మ సమస్త విభూతులనూ తెలియజెప్పడమే కాదు, జీవి ఏ యోగాలను ఆచరిస్తే ఎట్లా మోక్షాన్ని పొందవచ్చునో కూడ తెలియజెప్తున్నది తిరుప్పావైగ్రంథం.

నియమనిష్ఠలతో తిరుప్పావై వ్రతాన్ని ఆచరిస్తే మానవులు సుఖ, సంతోషాలను, సంపదలు పొంది ఆనందిస్తారు. మానవుడి లక్ష్యాన్ని, ఆ లక్ష్యాన్ని అందుకోవడానికి కావలసిన శక్తిసామర్థ్యాలు ఎట్లా పొందాలో మధురమైన వాక్కులతో, ఆకర్షణీయంగా అందించింది గోదాదేవి.

శ్రీఆండాళ్‌తల్లిసంకల్పం కలాన్ని ముందుకు నడిపిస్తున్నది. ఒక్కో పాశురానికీ, సంక్షిప్తరూపంలో, సమస్తజీవకోటిని తరింపజేయాలనుకొని, తన పిల్లలకు సంపూర్ణజ్ఞానం అందించడానికి సంకల్పించింది. ఆచరణ పూర్వకంగా, జీవితాన్ని ధన్యం చేసుకోవాలంటే ఆ తల్లి ఔదార్యాన్ని, సంకల్పాన్ని తెలిపి మాధుర్యామృతాన్ని తనివితీరా ఆస్వాదించి ఆనందాన్ని స్వయంగా పొందవలసిందే. ఇదే తిరుప్పావై తత్త్వం.

‘మార్గళిత్తింగళ్’ అనే పాశురంతో మొదలవుతుంది. దీని భావం “ఇది మార్గశీర్షమాసం. వెన్నెల నిండిన శుభ దినం. (సంపూర్ణచంద్రకళలు ప్రకాశించే రోజు) సంపదలతో నిండిన వ్రేపల్లెలో నివసించే, విలక్షణమైన ఆభరణాలతో



ప్రకాశించే ఓ పడుచులారా! మార్గశీర్షస్నానం చేయాలని ఇష్టమున్నవాళ్ళందరూ రండి! నందగోపుడి కుమారుడు ఎవరో కాదు సుమా! నారాయణుడే. కనుల సౌందర్యంతో ఒప్పే యశోదమ్మ బాలసింహం, నీలమేఘ శ్యాముడు, ఎర్రతామరల వంటి కనులుగల్గి సూర్యప్రకాశాన్నీ, చంద్రుని ఆహ్లాదాన్నీ ఇవ్వగల్గిన నారాయణుడు అతడే. వ్రతంచేసి అర్థించామా! మనకు ‘పర’ అనే వాద్యాన్ని ఇచ్చి ఆనందింపజేస్తాడు. మనంచేసే ఈ శుభాన్ని కూర్చే వ్రతాన్ని చూసి లోకులందరూ ఆనందిస్తారు. వారినందర్నీ ఆనందింపజేసే వ్రతమిది కనుక మీరందరూ వచ్చి ఇందులో చేరండి!’

అంటూ మొదటి పాశురంలోనే ఈ వ్రతం ఎందుకు, ఎప్పుడు చేస్తున్నామో, ఏం కోరి చేస్తున్నామో, ఎవరిని కోరబోతున్నామో, ఆ వ్యక్తి ఎట్లాంటివాడో, అతడందించే ప్రతిఫలం ఏమిటో, ఈ కర్మను చూచి ఎవరు ఆనందిస్తారో తెలియజెప్తున్నది గోదాదేవి.

## నెల ప్రత్యేకత

మొదట గోపికలు ఎంచుకున్న కాలం మార్గశీర్షమాసం. ఇదే ధనుర్మాసంగా పిలువబడుతున్నది. 'మార్గం' అంటే దారి, బాట, అన్వేషణ అని కూడ అర్థాలు. శీర్ష మంటే తల శరీరావయవాల్లో శ్రేష్ఠమైనది తల. మానవుడు జీవనపథాన్ని ఎంచుకోవడానికి ఉత్తమమైన కాలమిది. ఒకపని చేయడానికి శుభసమయాన్ని చూస్తారు. ఈ పని మామూలు పని కాదు. మానవుడు జ్ఞానాన్వేషణకు ఎంచుకునే సమయం కూడ శుభసూచకం కావాలి. కనుక జ్ఞానతత్త్వాన్ని అన్వేషించే పథంలోకి వెళ్ళే కాలం మార్గశీర్షమాసం. అంతేకాదు ధనుస్సు ప్రణవంగా చెప్పబడుతున్నది. శరీరమే ఒక ధనుస్సుగా, ఆ ధనుస్సు లక్ష్యం పరమాత్మను చేరడం. అందుకోసం మనస్సనే బాణాన్ని ఆత్మలక్ష్యం వైపు గురి చూడాలి అంటున్నవి భగవద్గీత, ఉపనిషత్తులు. మార్గశీర్షమాసం జ్ఞానస్వరూపుడైన పరమాత్మను సంకేతించే కాలం. ధనుస్సు ప్రణవానికి ప్రతీక. శరీరం ధనుస్సుకు ప్రతీక. శరీరాన్ని జాగృతం చేసే కాలం ఇది.

## వ్రతతత్త్వం

ఈ వ్రతం ఎట్లాంటిది? తెల్లవారు జామున లేచి స్నానం చేయాలి. ఆ తర్వాత పరమాత్మను స్మరించాలి. ప్రతి రోజు స్నానం చేస్తారు కదా! ఈ స్నానాకెందుకింత ప్రాముఖ్యత? ఇదేం స్నానం! ఇది భక్తిజలస్నానం. పరమాత్మ మీద ఉండే భక్తి అనే జలంలో తడిసి, (ఆర్ద్రమై) చేసే ఈ స్నానం వ్రత నియమాల్లో మొదటిది. అంతేకాదు జలం బ్రహ్మపదార్థంగా చెప్పబడుతున్నది. వ్రతస్నానం భక్తిజలస్నానానికి సంకేతం.

## వ్రతానికి ఎంచుకున్న మనుషులు

మార్గశీర్షవ్రతానికి ఎంచుకున్న విలక్షణమైన ఆభరణాలతో ప్రకాశించే కన్నెపిల్లలు నిర్మలమైన మనసుతో ప్రకాశిస్తారు. నిర్మలంగా ప్రకాశించే హృదయాలకు ఆభరణాలు ప్రతీకలు. అట్లాంటి ఆభరణాలు ధరించి, స్వతంత్ర భావాలు మాత్రమేగల కన్నెపిల్లలు ఈ వ్రతానికి అర్హులు. మానవుడు నిర్మల హృదయాన్ని కలిగి, పరమాత్మ ఆధీనంలో ఉన్నానని భావిస్తే, ఆ జ్ఞానాన్ని పొందడానికి అర్హుడౌతాడు అని చెప్పడమే ఈ లక్షణాలు తెలియజెప్పడం. ఆత్మసౌందర్యంతో వెలిగే గోపికలాగా ఊహించుకొని వ్రతం చేసింది గోదాదేవి.

## ఎంచుకున్న స్థలం

శ్రీవిల్లిపుత్తూరునే ద్వాపరయుగంలోని వ్రేపల్లెగా భావించి వ్రతం చేసింది గోదాదేవి. ఏమిటో ఆ పల్లె గొప్పదనం! పాడి పంటలు, సంపదలతో నిండి ఉన్నది. అక్కడి వరిచేలు పచ్చగా పండి, చేలల్లో కలువలు విరబూసి హంసలు తిరుగాడుతుంటాయి. పశువుల మందలు లెక్కలేనన్ని ఉంటాయి. గోవులన్నీ శ్రీకృష్ణుని వేణుగానం విని ఆ ప్రణవ నాదంతో పవిత్రమై అమృతంవంటి పాలను కడవల నిండా వర్షిస్తుంటాయి. వర్షాలు క్రమంతప్పక కురుస్తాయి. గోపికలందరు అతిశ్రద్ధగా శ్రీకృష్ణుని కిష్టమైన వెన్న తీసే కార్యక్రమాన్ని ఆచరిస్తారు. శ్రీవిష్ణుచిత్తుల వారివంటి ఆళ్వారు భగవద్భక్తితో తులసీవనంలో వటపత్రశాయిని (శ్రీకృష్ణుని) తులసిమాలలతో అలంకరించి ఆరాధిస్తుంటాడు. ఇదే ఆ పల్లెకున్న ఐశ్వర్యం. అట్లాంటి ప్రదేశంలోనే లక్ష్మి అంశతో గోదాదేవి జన్మించింది. శ్రీవిల్లిపుత్తూరును గోదాదేవి వ్రేపల్లెగా ఊహించుకొని చెలియలందర్నీ గోపికలని తలచుకునే కారణ మిదే! కనుక గోవులు వేదాలకు, వేదజ్ఞానానికి; వెన్న పరమాత్మ తత్త్వానికి; వంగిన వరిచేలు సాత్త్వికచింతనలో పరిపూర్ణుడైన జీవికీ; హంసలు ఆచార్యులకూ; విచ్చిన కలువలు, తామరలు, జీవాత్మ హృదయకమలాలకు ప్రతీకలు. అగాధమైన, కరుణా హృదయం కల్గిన పరమాత్మ స్వరూపానికి యమునానది ప్రతీకం. అందుకే అక్కడ పెరిగాడు శ్రీకృష్ణుడు. శ్రీమహావిష్ణువు యొక్క రథాలకు జ్ఞానశరీరంగా జన్మించిన భక్తుడు శ్రీవిష్ణుచిత్తుడు, భక్తి సువాసనలు వెదజల్లే తులసీవనంలో శ్రీగోదాదేవిని పెంచాడు.

## ఎవర్ని కోరి వ్రతం చేస్తున్నారు? ఆ వ్యక్తి ఎట్లాంటి వాడు?

గోపికలందరూ ఎవర్ని కోరి వ్రతం చేస్తున్నారు? అంటే శ్రీకృష్ణుని కోరి చేస్తున్నారు. గోపికలు చేయబోయే వ్రతం శ్రీకృష్ణుడి కోసం. శ్రీకృష్ణుడు వెన్నదొంగ. అల్లరివాడు. అంతేనా! కాదు. నీలమేఘ శ్యాముడు, ఎర్రతామరలను పోలే కన్నులున్న వాడు. సూర్యునివంటి ప్రకాశాన్ని, చంద్రునివంటి చల్లదనాన్ని, వెన్నెలను ఇవ్వగలిగిన, దివ్యమైన ముఖారవిందం కలవాడు.

రంగేమో నల్లటి మేఘంవంటి రంగు. నల్లటి మేఘం చల్లని పవనాలను కలిగి అమృతాన్ని వర్షిస్తుంది.

చంద్రుడికే అమృతాన్నిచ్చి, ఆనందింపజేసే పరమాత్మ మానవుల మనసుకెందుకు ఆనందాన్నివ్వడు?

'చంద్రమా మనసో జాతః చక్షోః సూర్యో అజాయత'– అంటున్నది పురుషసూక్తం, విరాట్పురుషుని కనులే సూర్యుడు. మనసే చంద్రుడు. పరమాత్మ కనులకు సూర్యుడు, మనసుకు చంద్రుడు ప్రతీకలు. తాను కళ్ళు తెరిచి నిద్రలేపితేగానీ లేవని తామస నిద్రపోతుంటారు జీవులు. కనుక గోపికలు చేసే వ్రతం ఎవరి కోసం? స్వయంగా 'పరమాత్మ' కోసమే.

## ఆ వ్యక్తి అందించే ఫలమేమిటి?

ఆ వ్యక్తి గోపికలకు 'పర' అనే వాద్యాన్ని ఇస్తాడట. ఆయనే నారాయణుడు. 'పర' అంటే వాద్యం, మోక్షం. సూర్య చంద్రుల్లో తానుండి ప్రకాశింపజేసేవాడు. అదే నారాయణ తత్త్వం. నారములు అంటే జీవులు, నిత్యపదార్థాలు. వాటిలో నివాసాన్ని ఏర్పరచుకున్న పరమాత్మ అతడే నారాయణుడు. ఈ నారాయణుడు 'పర'ను ఇస్తాడు. ఎప్పుడు? శ్రీతత్త్వం ఆయనను చైతన్యవంతం చేయాలి. కనుక శ్రీదేవి అంశయైన గోదాదేవి స్వయంగా మనం కోరితే (భక్తి, నిష్ఠలతో వ్రతం చేస్తే) అతడు తప్పక మనకు 'పర'ను ఇస్తాడు అంటున్నది. గొల్లలు ఉపయోగించే, శబ్దించే వాయిద్యమే 'పర', శబ్దం 'ఓంకార' నాదం. ఆ నాదతత్త్వాన్ని అందించేవాడు పరమాత్మ. గోపికలకు, గోదా దేవికి కావాల్సింది ఆ 'పర' మాత్రమే. అదే ప్రణవ స్వరూపమైన 'పర'. వెదురును వేణువుగా ప్రణవనాదాన్ని పలికించే ఆ కృష్ణపరమాత్మకే దీన్ని ఇవ్వగల శక్తి ఉంది.



శూన్యమైన శరీరానికి వెదురు కర్ర ప్రతీక. అందులో పలికే మధుర జీవరాగమే పరమాత్మ పలికించే వేణునాదం. పరమాత్మ తాకితే వెదురు వేణువౌతుంది. కనుక ఆ ఫలాన్నిచ్చే వ్యక్తి స్వయంగా శ్రీమన్నారాయణుడే. 'పర' వాద్యం ప్రణవానికి, ఓంకారానికి, జ్ఞానానికి ప్రతీకం.

## ఈ వ్రతం వల్ల కలిగే ఆనందం

ఈ వ్రతం వల్ల గోపికలకు, గోదాదేవికి కలిగే ఆనందం ఏమిటో? 'మనం చేసే వ్రతాన్ని చూచి లోకాల్లోని జనమంతా పొగుడుతూ ఆనందిస్తారు. ఆ విధంగా మనం వ్రతంచేయాలి కనుక అందరూ కూడ ఈ వ్రతంలో వచ్చి చేరండి సుమా!' అంటూ పిలుస్తున్నది గోదాదేవి. తండ్రి ప్రేమను పొందడానికి నేను ఉపాయం చేస్తాను రండి! అని పిల్లలకు చెప్తున్నది. అందుకు క్షేత్రాన్ని ఎన్నుకున్నది. అదే శ్రీవిల్లిపుత్తూరు. చెలులందర్నీ గోపికలుగా భావించుకున్నది.

## కోరికలన్నిటిని వదలి వ్రతం చేయండి.

ఈ ఆత్మజ్ఞానం కోసం సాత్త్విక, భక్తిస్నానం చేయరండి. నిష్కామకర్మ కోరండి. ఈ కర్మ మీ కోసం కాదు అంటున్నది గోదాదేవి.

'విహాయ కామాన్ యస్సర్వాన్'... కోరికలన్నిటిని వదలి లోకక్షేమం కోసం మాత్రమే వ్రతం చేయరండి. అప్పుడు 'పర'ను పొందవచ్చు. మోహంలో మునుగక, ఆత్మజ్ఞానాన్ని పొందాలి. పరమాత్మను పొందే స్థితి అదే అని గోదాదేవి అంతరంగా 'పర' అనే పేరుతో సంకేతించి చెబుతున్నది. పౌరాణిక కథలనే గాకుండా తాత్త్విక జ్ఞానాన్ని అంతరంగా బోధిస్తూ మానవులకు జాగృతం చేసి నిష్కామ కర్మయోగాన్ని చేయమంటున్నది గోదాదేవి 'తిరుప్పావై' ద్వారా.

*"ఆండాళ్ తిరువడిగళే శరణమ్"*



# సందేహాలు సమాధానాలు

-డా॥ రేవూరు అనంతపద్మనాభరావు, 98665 86805

**ప్ర పాతబడిన దేవుడి చిత్రపటాలను ఏమి చేయాలి? ఇంట్లో ఉంచుకోవచ్చా?**

**- ఆర్.వి.రామయ్య, తిరుపతి.**

**జ)** దేవుడి గదిలో నిత్యం పూజలందుకొనే చిత్రపటాలు పాడైతే వాటిని నిర్లక్ష్యంగా పారవేస్తారు. ఏ దేవాలయం మూలనో, రోడ్డు పక్కన చెట్ల ముందో పడవేస్తారు. మనకు అవసరం లేని దేవుడి చిత్రపటాలను అగ్నికి ఆహుతి ఇవ్వడం ఒక పద్ధతి. అగ్ని సర్వభక్షకుడు. అన్ని వేళలా పునీతుడు. పవిత్రాగ్నిలో సమర్పించడం దోషం కాదని పండితులు చెబుతారు. లేదా ప్రవాహ జలంలో చెరువులు, నదులలో నిమజ్జనం చేయాలి. అలా చేసేటప్పుడు–

*'గచ్ఛ గచ్ఛ సురశ్రేష్ఠ! స్వస్థానం పరమేశ్వర!'* అనే మంత్రం స్మరించాలి. అది నిమజ్జనంవంటి కర్తవ్యం. మీ మీ ఆచారాలను బట్టి నడుచుకోవడం శ్రేష్ఠం.

**ప్ర దీపారాధన ఎందుకు చేయాలి? ఎలా చేయాలి?**

**- శ్రీమతి లక్ష్మి, హైదరాబాదు.**

**జ)** 'దీపం జ్యోతి పరబ్రహ్మ, దీపం జ్యోతి మహేశ్వర
దీపేన సాధ్యతే సర్వం, సంధ్యాదీపం నమోஉస్తు తే'

అంటూ దీపారాధన చేసి సకలదేవతలను పూజిస్తాము. దీపారాధన సకలశ్రేష్ఠం. సకల శుభప్రదాయిని. జీవితంలో వెలుగులను నింపుతుంది. దీపంలో ఉన్న నూనె మనలోని దుర్గుణాలకు సంకేతం. వత్తి అజ్ఞానానికి ప్రతీక. భక్తిభావనతో మనలోని దీపాన్ని వెలిగిస్తే అది మనలోని అజ్ఞానాన్ని దహిస్తుంది. అజ్ఞాన తిమిరాలను తరిమే శక్తి దీపానికుంది. జ్యోతి ప్రజ్వలన అన్నికార్యాలకు ముందు నిర్వహిస్తారు.

**ప్ర పూజామందిరం ఇంట్లో ఏ దిశలో ఉండాలి?**

**- శ్రీనివాస్, ఒంగోలు.**

**జ)** వాస్తుశాస్త్రానుసారం ఇంట్లో ఈశాన్యభాగంలో పూజా మందిరం ఏర్పరచుకోవడం సకలశుభప్రదం. అది ఇంటి వాతావరణాన్ని యజమానికి అనుకూలం చేస్తుంది. పూజా మందిర నిర్మాణం, దానికి సరియైన రంగులు, విగ్రహాలను సరియైన దిక్కుగా అమర్చడం అత్యంత ముఖ్యం. ఒకవేళ ఈశాన్యం కుదరకపోతే ఉత్తరం లేదా తూర్పుభాగం ఎంచుకోవచ్చు. దక్షిణదిక్కు అసలు పనికి రాదు. విగ్రహాలను గోడకు దూరంగా ఉంచాలి. ఒక విగ్రహాన్ని మరొక విగ్రహంతో కుక్కినట్లు ఉంచరాదు. పూజాగది తలుపులు ఉత్తరం లేదా తూర్పు ముఖంగా ఉండాలి.

**ప్ర త్రికరణశుద్ధిగా పనులు చేయాలంటారు? అంటే ఏమిటి?**

**- కేశవరావు, తిరుపతి.**

**జ)** మనసా వాచా కర్మణా చేసే పనులను త్రికరణ శుద్ధి అంటారు. ఆలోచనలలో పవిత్రత, మానసికప్రవృత్తిని గమనించడం ముఖ్యం. మాటలలో పవిత్రత, చేసే పనులలో వాటి సమన్వయం శ్రేష్ఠం. చేసే కర్మలలో (పనులలో) పవిత్రత, భౌతిక కార్యాలకూ, ఆలోచనలకు, మాటలకు సమన్వయం త్రికరణ శుద్ధి. మనోస్థైర్యం ఈ మూడింటి సమన్వయానికి ఎంతైనా అవసరం. మహర్షులు తెలిపిన రాచబాట ఇది.

**ప్ర ఆత్మప్రదక్షిణ ఏ విధంగా చేయాలి? దాని పరమార్థమేమి?**

**- డా॥ కుటుంబరావు, హైదరాబాదు.**

**జ)** ఆత్మప్రదక్షిణలో నిలుచున్నచోటే మనం మూడుసార్లు సవ్యదిశలో (కుడివైపు) మూడుసార్లు తిరగాలి. ఇందులో మూడు అంశాలు ప్రతీకాత్మకంగా ఉన్న విషయం గమనించాలి. ఒకటి–మన గురించి మనం తెలుసుకోవడం. రెండు–దైవము, మనము వేరుకాదనే సత్యాన్ని గుర్తుకు తెచ్చుకోవడం. మూడు–మనం కూడా ఆ భగవంతునితో మమేకం కావడం. సృష్టిలో సూర్యుడి చుట్టూ భూమి తిరుగుతుంది. భూమిచుట్టూ చంద్రుడి ప్రదక్షిణ కొనసాగుతుంది. అదే రీతిలో దేహశక్తి కంటే ఆత్మశక్తి గొప్పది. ఆ ఆత్మ ఉనికిని తెలుసుకోవడానికే ఆత్మప్రదక్షిణ. ప్రారబ్ధ, సంచిత, ఆగామి– అనే మూడు కర్మల నుంచి మనల్ని మనం రక్షించుకోవడానికే ఆత్మప్రదక్షిణ పరమార్థం.

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం– ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000



## గతసంచిక తరువాయి..

ఆ ఆవు మెల్లగా వల్మీకం దగ్గర ఆగింది. పుట్టలో నుండి రక్తం స్రవించడం, గోవు కదలిక అక్కడ నిలవడం దగ్గరే గొల్లవాడు నేలపడి ఉండడాన్ని చూచి రాజుకు ఆ వార్త లందించారు. ఇవన్నీ విన్న రాజు హుటాహుటిగా పరివారంతో పల్లకి ఎక్కి వేంకటాద్రి చేరుకున్నాడు. అక్కడి దృశ్యాలు చూచి వణికిపోయాడు. పుట్టనుండి రక్తం ఎగిరిపడడమేటి? గొల్లవాడు ప్రాణం కోల్పోయి నేల పడడమేమిటి? ఆవు కళ్ళ నీళ్లెట్టు కోవడమేమిటి అని తనను తాను తర్కించుకున్నాడు. సరిగ్గా ఆ సమయంలోనే పుట్టనుండి శంఖచక్రధారి కన్నీళ్ళెట్టుకొంటూ గద్గదకంఠంతో బయటకు వచ్చి–

"రాజా! నేను పుట్టలో దాక్కొని ఉంటే ఈ గొల్లవాడు వచ్చి నాకు రోజూ పాలిచ్చి నా ఆకలిని తీర్చే ఆవుపై తన గొడ్డలి వేటు వేయడానికి సిద్ధమయితే నేనే అడ్డుపడ్డాను. చివరకు నా తలకు దెబ్బ. తాను చేసిన ఘోరపాపం కారణంగానే గొల్ల చచ్చాడు.

రాజా! దిక్కులేక, తల్లిదండ్రులు లేక, ఆలుబిడ్డలు లేక, బంధువులు లేక పేదవాడైన నన్ను, పుట్టలో దాగిన నన్ను రక్షిస్తున్న గోమాతను చంపడానికి సిద్ధమైనవాడు నీ వాడు. పాపఫలం అతణ్ణి కాటేస్తే దోషఫలం నీవు అనుభవించ వలసిందే! నీవు నీచదశలో పిశాచ రూపమెత్తు" అని శాపమిచ్చాడు.

ఆ శాపంతో రాజు కిందపడ్డాడు మూర్ఛపోయాడు. కాసేపట్లో తెప్పరిల్లిన లీలామానుష విగ్రహుడైన స్వామిని చూచి,

'దేవా! తెలిసి తెలిసి నీకు ఇబ్బంది కలిగించలేదు. భయంకరమైన శాపం నాకిచ్చావు. నన్ను కష్టాలలో పడేశావు. నేను పిశాచ జన్మమెత్తాలా! హరి హరి! కాసంత దయచూపు. ఈ శాపం తొలగే ఉపాయం దయతో అనుగ్రహించు' అని దైన్యాతిదైన్యంగా వేడుకున్నాడు.

అప్పుడా స్వామి– 'నా శాపానికి తిరుగులేదు. శాపాన్ని ఉపసంహరించలేను. అయినా నిన్ను చూస్తుంటే జాలివేస్తున్నది. పైశాచికగతి కారణంగా బాధ అయినా కలియుగాంతం దాకా పైశాచికజన్మ తప్పదు. నీవే భూలోకంలో ఆకాశరాజుగా జన్మిస్తావు. నీ సుత అయిన పద్మావతిని నాకిచ్చి పెళ్ళి జరిపించు అవ్వేళ కిరీటాన్ని నాకు తొడుగు.

ఆ కిరీటం ఎలాంటిదో విను. 100 బారువుల బరువు కలది. వెలలేని మణులు పొదగబడినది. ప్రతి శుక్రవారం అలాంటి కిరీటాన్ని ఆరు గడియల కాలం నేను ధరిస్తాను. ఆ సమయంలో నా కళ్ళ నుండి కన్నీరు స్రవిస్తుంది. ఆ ఆరు గడియల కాలం నీకు అనంత అవ్యాజ సుఖానుభవం కలుగుతుందని, ఆనతిచ్చాడు. ఆ పై శాపగ్రస్తుడైన చోళరాజు తన పట్టణానికి వెళ్ళిపోయాడు.

(ఇంకా ఉంది)



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన ।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥

# గీతారహస్యం

– శ్రీమతి ఆర్.శోభాదేవి, 85001 20960

**డిసెంబరు 01న గీతాజయంతి సందర్భంగా...**

**భగవద్గీత సందేశం-** కర్తవ్యనిర్వహణలో ఫలాపేక్ష లేకుండా నిష్కామకర్మ చేయడం; భగవంతుని శరణాగతి పొందడం; ఆత్మతత్త్వాన్ని, జీవనగమ్యాన్నీ అర్థం చేసుకోవడం. మనిషి తన మనస్సును నియంత్రించుకోవడం; తనను తాను రక్షించుకోవాలి. జీవితం యొక్క నిజమైన ప్రయోజనం ఆనందాన్ని పొందడమే. దానికి భగవంతుని తత్త్వం, జీవన గమ్యం తెలుసుకోవాలి. మనిషి తన బుద్ధిని ఉపయోగించి, మనస్సును తన ఆధీనంలో ఉంచుకోవాలి. బుద్ధి మిత్రుడైనపుడు, మనస్సు శత్రువు కాకుండా రక్షిస్తుంది. కర్తవ్యనిర్వహణలో నిష్కామకర్మతో ఫలితాలను ఆశించకుండా కేవలం తన కర్తవ్యాన్ని నిర్వహించడమే ముఖ్యమని గీతాచార్యుడు బోధించాడు. మనసుని నియంత్రించుకొని, తన విధులను ప్రశాంతమనస్కుడై నిర్వహించాలి.

శరీరం నశ్వరమైనది. కానీ, ఆత్మ శాశ్వతం. ఈ ఆత్మ భగవంతునిలో భాగం. ఆత్మయొక్క సర్వోన్నతలక్ష్యం భగవంతుని శరణాగతి పొందడమని గీత గుర్తు చేస్తోంది. ధర్మమార్గంలో నడవడం, సత్యాచరణ, మంచిని చేయడం గీత ముఖ్యబోధనలు.

**గీతప్రాముఖ్యం-** భగవద్గీత వేదాల సారాన్నీ, హిందూధర్మ పునాదులను తెలియజేసే మహాగ్రంథం. ఇది వేదాలు, ఉపనిషత్తులు, యోగసూత్రాలను తెలిపే సిద్ధాంతగ్రంథం. ఇందులో భగవత్ తత్త్వం, ఆత్మతత్త్వం, జీవనగమ్యం, లక్ష్య సాధన విధానాలు వివరంగా వివరించబడ్డాయి. గీతాసందేశం వేదసందేశం–"ఆనందంగా ఉండటం, పరోపకారం" జీవిత ప్రయోజనం. మనిషిగా మన ధర్మం పాటించాలి. బాధ, భయం వదిలిపెట్టి ఎవరిసొంత బాధ్యతలు వారు నిర్వర్తించాలి. ప్రత్యక్షంగా గాని, పరోక్షంగాని ఎలాంటి మోసం చేయకూడదు.

కృష్ణార్జునుల సంవాదమే భగవద్గీత. 18 అధ్యాయాలలో 700 శ్లోకాలలో శ్రీకృష్ణపరమాత్మ అనేకానేక విషయములను అర్జునుని ద్వారా లోకాని కందించాడు. ప్రధానాంశాలివి.

**కర్మయోగం –** ఏమీ ఆశించకుండా కర్మ చేయడం.

**భక్తియోగం –** ఏమీ ఆశించకుండా దేవతల, దేవాలయాల సేవ చేయడం.

**జ్ఞానయోగం –** జ్ఞానాన్ని పొందడం, ఏమీ ఆశించకుండా ఆ జ్ఞానాన్ని ఇతరులకు పంచడం.

**రాజయోగం (క్రియాయోగం) –** ఏమీ ఆశించకుండా ధ్యానం చేయడం.

**కర్మషట్కము, భక్తిషట్కము, జ్ఞానషట్కము–** అని గీతలో మూడు ప్రధానభాగాలు.

వ్యాసభారతంలోని భీష్మపర్వంలో 25వ అధ్యాయం మొదలు 42వ అధ్యాయం వరకు 18 అధ్యాయాలు భగవద్గీతగా ప్రసిద్ధం. దీనిని 'గీతోపనిషత్' అని కూడా పిలుస్తారు.

సర్వోపనిషదో గావః దోగ్ధా గోపాలనందనః।
పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్॥

శ్రీకృష్ణుడనే గోపాలకుడు ఉపనిషత్తులనే గోవుల నుండి అర్జునుడనే దూడను నిమిత్తంగా చేసి గీతామృతాన్ని పిదికాడు. బుద్ధిమంతులందరూ ఈ గీతామృతాన్ని పానంచేసి తరించవచ్చు.

॥ ఓం శ్రీకృష్ణాయ నమః ॥



డిసెంబరు 5న తిరుప్పాణాళ్వారు
వర్షతిరునక్షత్రం సందర్భంగా..

# గాయకసార్వభౌముడు 'తిరుప్పాణాళ్వారు'

- శ్రీ వైద్యంవేంకటేశ్వరాచార్యులు



శ్రీలోకసారంగమహామునీంద్ర
స్కంధాధిరూఢం కలయామి నిత్యమ్।
కలంకహీనం కమనీయభక్తం
కవీశ్వరం గాయకసార్వభౌమమ్॥

భావం- శ్రీలోకసారంగమహామునీంద్రుల భుజస్కంధాలపై అధిష్ఠించినట్టివాడూ, నిష్కలంకుడూ, మంచిభక్తికలవాడూ, కవీశ్వరుడూ గాయకసార్వభౌముడూ అయిన శ్రీపాణయోగికి/ తిరుప్పాణాళ్వారులకు నమస్కారం.

శ్రీహరి శ్రీవత్సం అంశతో తిరుప్పాణాళ్వారులు అవతరించారు. వీరిది వీణాముద్ర. దుర్మతినామ సంవత్సర కార్తిక పూర్ణిమ, వృశ్చికమాసంలో రోహిణీ నక్షత్రం బుధవారం నాడు శ్రీపాణయోగి జన్మించారు. వీరి జీవితకాలం 80 సంవత్సరాలని పెద్దలమాట. వీరికి విష్వక్సేనులవారు పంచ సంస్కారాలు చేశారు.

శ్రీరంగానికి సమీపాన ఉండే నిచుళాపురం (తిరువర యూర్) తిరుప్పాణాళ్వారు జన్మస్థలం. వీరు శ్రీమన్నారాయణుని శ్రీవత్సం అంశాన వరిచేనులో వరివెన్నులో పుట్టారు. వీరు జ్ఞానవైరాగ్యసంపన్న జన్మసంసిద్ధవైష్ణవులు.

కవీశ్వరునిగా, గాయకసార్వభౌమునిగా కీర్తించబడ్డారు. వీణ మీటుతూ తాళాలను తాటిస్తూ తన్మయత్వం చెంది నిరంతరం తన కవితాగానాలతో శ్రీరంగనాథులవారిని భజించిన ధన్యజీవి తిరుప్పాణాళ్వారు.

శ్రీరంగనాథులవారు ఉభయకావేరుల మధ్యన విరాజిల్లారు. తిరుప్పాణులవారు తనపాదాలను పవిత్ర రంగభూమికి తాకించరాదనే అర్చకుల నియమంవలన కావేరి దక్షిణతీరంనుంచే శ్రీరంగనాథులవారి దివ్యమందిరానికి ఎదురుగా తాళాన్వితంగా వీణాగానంతో తన్మయుడై భగవంతుని భజిస్తుంటాడు.

శ్రీరంగనాథులవారి అర్చకులయిన లోకసారంగముని పెరుమాళ్ల కైంకర్యార్థం కావేరినుంచి కలశంతో తీర్థం తెస్తుంటాడు. అలాంటి ఒక సందర్భాన తిరుప్పాణాళ్వారు యథారీతిగా భగవద్భజనపరవశుడై బాహ్యవిషయాలను ఎరుగని పరిస్థితిలో ఉంటాడు. లోకసారంగముని వెంట ఉండే శిష్యులు "దారికి అడ్డుతొలగిపో!" అంటూ తిరుప్పాణులవారిని రాళ్ళతో కొడతారు. దెబ్బలు తగిలిన తిరుప్పాణులవారు తనదారిన తాను వెళ్లిపోతారు. అర్చకులు శ్రీరంగనాథులవారి ఆలయానికి వెళ్లగా పెరుమాళ్లముఖం దెబ్బలు తగిలిన గాయాలతో రక్తం కారుతూ ఉన్నట్లు కనిపిస్తుంది. ఈ విషయం ఆ ప్రాంతపు ప్రజలకీ ప్రభువుకీ తెలుస్తుంది. వారు "శ్రీరంగనాథులవారికి ఏదో దోషం జరిగినందువల్ల ఇలా అయి ఉంటుంది. తప్పు జరిగి

ఉంటే క్షమించాలి” అని ప్రార్థిస్తారు. వారి ప్రార్థనకు శ్రీరంగ నాయకి స్పందించి శ్రీరంగనాథుల వారితో “తిరుప్పాణులను రక్షించి మీ సన్నిధికి చేర్చుకోవాలి” అని చెప్తుంది.

శ్రీరంగనాథులవారు లోకసారంగమునికి స్వప్నంలో కన్పించి తిరుప్పాణాళ్వారులవారిని తమ సన్నిధికి రప్పించవలసిందని ఆజ్ఞాపిస్తారు, అర్చకుడు తిరుప్పాణులవారి దగ్గరకు వెళ్లి శ్రీరంగనాథులవారి సన్నిధానానికి రావలసిందని అభ్యర్థిస్తాడు.

తిరుప్పాణులవారు తాను పవిత్ర శ్రీరంగభూమిని పాదాలతో తాకరాదనే నియమం కలవాడిననీ విన్నవిస్తాడు. తిరుప్పాణులను తీసుకొని వెళ్లకపోతే భగవదాజ్ఞను ధిక్కరించినట్లవుతుంది. కనుక, లోకసారంగముని, అటు భగవదాజ్ఞను ఇటు తిరుప్పాణులవారి నియమాన్ని ఉల్లంఘించరాదని ఉపాయాన్ని అన్వేషిస్తాడు. చివరకు తిరుప్పాణాళ్వారును తన భుజాలపై మోసుకుని శ్రీరంగనాథులవారి సన్నిధానానికి చేరుకుంటాడు. లోకసారంగముని వాహనంగా శ్రీరంగనాథుల వారి సన్నిధికి వెళ్లడం వలన తిరుప్పాణులకు “మునివాహన” అనే పేరు కలుగుతుంది.



తిరుప్పాణులవారు శ్రీరంగనాథులవారి దివ్య మంగళవిగ్రహాన్ని సందర్శిస్తారు. ఆనందపారవశ్యంతో ప్రతిస్పందిస్తారు. ఫలితంగా ఆయనలో పెల్లుబికిన భావసుధాఝరులు **‘అమలనాదిపిరాన్’** అనే ద్రావిడ దివ్యప్రబంధంగా (10 పాశురాలలో) అనుగ్రహించబడింది.

భగవంతుని వర్ణించేటప్పుడు మొదట పాదాలను, ఆ తర్వాత వరుసగా శిరోభాగపర్యంతం వర్ణించడం సంప్రదాయం. ఈ సంప్రదాయం ‘అమలనాదిపిరాన్’లో భాసించింది. శ్రీరంగనాథులవారి సౌందర్యం ఒక దివ్యమంగళప్రవాహం. ఆ ప్రవాహాన మునకలు వేయాలంటే భగవానుని శ్రీచరణ కమలాలే తీర్థఘట్టాలు (గంగ విష్ణుపాదోద్భవ కదా!) ఈ గుట్టు తిరుప్పాణాళ్వారులవారికి బాగా తెలుసు.

తిరుప్పాణులవారు భక్తిజ్ఞానంలో శ్రీరంగనాథుల వారిని వశం చేసుకొని పెరుమాళ్ల పాదమూలాన్ని చేరారు.

తిరుప్పాణాళ్వారు అమలనాదిపిరాన్లో మంగళాశాసనం చేసిన దివ్యతిరుపతులు – **1)తిరువరంగం, 2)తిరువెంగడం, 3)పరమపదం.**

తిరుప్పాణాళ్వారు శ్రీవేంకటాచలమందు వేంచేసి ఉన్న స్వామివారిని అమలనాదిపిరాన్లో ప్రశంసించారు. మచ్చునకు ఒక పాశురభావం– తిరుమలలో మగ కోతులు ఒక కొమ్మనుంచి మరొక కొమ్మకు దుముకుతూ ఎగురుతూ క్రీడిస్తుంటాయి. ఆ దృశ్యాన్ని చూచేవారికి కనులపండువే, తమిళభాషకు ఉత్తరపు ఎల్ల (సరిహద్దు) అయినట్టి, మహోన్నత శిఖరాలతో అలరారేది శ్రీవేంకటాచలం, నా మనస్సులో ఉండే జీవుడు వేంకటాచలాధిపతి మీద శ్రీరంగనాథునిమీద లగ్నమై ఉన్నాడు. ఆహా! ఏమి ఆశ్చర్యం.

***తిరుప్పాణాళ్వార్ దివ్య తిరువడిగళే శరణం.***



తిరుప్పాణాళ్వార్ మరొకపేరు ‘మునివాహనుడు’

# పరమపుణ్యధామము.. ఉత్తరద్వారదర్శనము

30 డిసెంబరున వైకుంఠ ఏకాదశి సందర్భంగా..

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152

శ్లో॥ సత్యం సత్యం పునస్సత్యం న దేవో వేంకటేశ్వరాత్
బ్రహ్మాండే నాస్తి యత్కించిత్ న భూతం న భవిష్యతి.
- భవిష్యోత్తర పురాణం

"సత్యంగా చెబుతున్న మాట! ఒకసారి కాదు. మళ్లీ మళ్లీ చెబుతున్న సత్యమైన మాట ఇది! ఏమిటా సత్యం? అంటే ఈ బ్రహ్మాండాల్లో ఎక్కడా అటు భూతకాలంలోను ఇటు భవిష్యత్తులోను శ్రీవేంకటేశ్వరునివంటి దేవుడు లేడు. లేనే లేడు. కనపడడు కూడా" అని.

అలాంటి ఆనందనిలయుని దర్శనంకోసం ఇంటి నుంచి బయలుదేరడం, ఏడుకొండల్లో విహరించడం, బంగారుమేడ ఆనందనిలయాన్ని వీక్షించడం, ఆనందనిలయుని నిలువెత్తు దివ్యమంగళవిగ్రహాన్ని కన్నులారా దర్శించడం... ఇలా వీటన్నింటి వల్ల దివ్యానుభూతులతో ఒక ఆనందాన్ని పరమానందాన్ని పొందడం అద్భుతం పరమాద్భుతం! అయితే-

'అందరూ ఒక ఎత్తు, అగస్త్యుడొక ఎత్తు' అన్నట్లు ఇన్నిన్ని ఆనందాల్ని నిరంతరం పంచుతూ. భక్తులను మైమర పిస్తున్న తిరుమలక్షేత్రాన్ని ఏడాది పొడవునా దర్శించడం ఒక ఎత్తు! కాగా...

ప్రత్యేకంగా ధనుర్మాసంలో ఒక నెలరోజుల్లో, ఏ ఒక్క రోజైనా తిరుమలక్షేత్రాన్ని సందర్శించే భాగ్యం కలగడం, ఆనంద నిలయుణ్ణి దర్శించి వింత వింత అనుభూతుల్ని ఆనందాన్ని పొందే అదృష్టం కలగడం మాత్రం, మరో ఎత్తు! అందులోను ధనుర్మాసంలో వచ్చే **'వైకుంఠఏకాదశి'**పండుగనాడు కలియుగ వైకుంఠంలో విహరించడంవల్ల, సందర్శించడంవల్ల భక్తుని మనస్సు ఆనందాల పంటలు పండే పూదోట అవుతుంది.

## వెంకన్న సన్నిధిలో 'వైకుంఠఏకాదశి'

ధనుర్మాసంలో శుక్లపక్షంలో వచ్చే ఏకాదశిని **'వైకుంఠ ఏకాదశి'** అంటారు. తిరుమలక్షేత్రంలో వైకుంఠఏకాదశి, ఆ మరునాడు వైకుంఠద్వాదశి ఇలా ఇది రెండు రోజుల పండుగగా ఎన్నో విశిష్ట సేవలతో నిర్వహింపబడుతుంది.

## వైకుంఠద్వారం తెరవబడుతుంది

వైకుంఠఏకాదశికి ముందురోజు అనగా దశమినాటి రాత్రి ఏకాంత సేవానంతరం బంగారు వాకిళ్లు మూసివేస్తారు. పిదప తెల్లవారుజామున వైకుంఠఏకాదశినాడు సుప్రభాతం మొదలుకొని పదిరోజులపాటు శ్రీవారి గర్భాలయానికి దగ్గరగా ఆనుకొని ఉన్న **"ముక్కోటి ప్రదక్షిణ మార్గం"** తెరవబడుతుంది. ఈ ప్రదక్షిణ మార్గానికి ఉన్న ద్వారాలను **వైకుంఠద్వారాలనీ, ఉత్తరద్వారాలనీ** అంటారు. ఈ మార్గాన్ని **'వైకుంఠప్రదక్షిణ మార్గం'** అనీ అంటారు. ఈ మార్గం విద్యుద్దీపాలతో, సుగంధ, సుమనోహరమైన పూలమాలలతో అలంకరింపబడి ఉంటుంది.

## స్వర్ణరథోత్సవం

వైకుంఠఏకాదశినాడు సప్తగిరీశునికి మరో విశేష ఉత్సవం జరుగుతుంది. అదే స్వర్ణరథోత్సవం!



వైకుంఠఏకాదశినాడు ఉదయం 8 గంటలవేళ కలియుగవైకుంఠనాథుడైన కొండలరాయడు శ్రీదేవీ భూదేవేరులతో కలిసి బంగారుతేరుపై పురవీథుల్లో దర్శనమిస్తారు. వైకుంఠఏకాదశినాటి స్వర్ణరథోత్సవంలో పయనిస్తున్న అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుణ్ణి దర్శిస్తేచాలు భక్తుల మనోరథాలు తప్పక తీరతాయి. భక్తుల గోవిందఘోషల మధ్య జరిగే తిరుమల గోవిందుని స్వర్ణరథోత్సవదృశ్యాన్ని వర్ణించడం అక్షరాలకు అందదు. దర్శించి అనుభవించాలి. అంతే!

## శ్రీస్వామిపుష్కరిణీతీర్థ ముక్కోటి ఉత్సవం

వైకుంఠఏకాదశి మరునాడు 'వైకుంఠద్వాదశి'. వీటినే "ముక్కోటి ఏకాదశి", "ముక్కోటి ద్వాదశి" అంటారు. వైకుంఠ ఏకాదశి మరునాడు వైకుంఠద్వాదశినాడు "శ్రీస్వామిపుష్కరిణీ తీర్థముక్కోటి ఉత్సవం" జరుగుతుంది.

ధనుర్మాసే సితే పక్షే ద్వాదశ్యా మరుణోదయే
ఆయాతి సర్వతీర్థాని స్వామిపుష్కరణీ జలే।
తత్ర స్నాత్వా నరః సద్యోముక్తిమేతి న సంశయః
యస్య జన్మ సహస్రేషు పుణ్య మేవార్జితం పురా॥

ధనుర్మాసంలో వైకుంఠద్వాదశినాటి అరుణోదయ వేళలో ముక్కోటి తీర్థాలు "శ్రీస్వామి పుష్కరిణి"లో మునకలిడుతాయి. శుభప్రదమైన ఆ వేళలో స్నానం చేసే మహాభాగ్యం అందరికీ కలుగనే కలగదట! ఎవరైతే వేలజన్మల్లో పుణ్యాన్ని ఆర్జించుకొని ఉంటారో, వారికి మాత్రమే తిరుమల శ్రీవారి కోనేట్లో స్నానం చేసే భాగ్యం కలుగుతుంది. అలాంటి వారికి సద్యోముక్తి కలుగుతుంది. అంటే వారు శరీరంతో ఉన్నా, జీవన్ముక్తిని పొందుతారని సారాంశం. ఇందులో ఎలాంటి సందేహం అక్కర్లేదని స్కాందపురాణాంతర్గత వేంకటాచల మాహాత్మ్యం స్పష్టం చేస్తోంది.

## శ్రీవారి చక్రస్నానం

ఇలాంటి శ్రీస్వామిపుష్కరిణీ తీర్థముక్కోటి శుభఘడియల్లో, అంటే వైకుంఠద్వాదశినాటి అరుణోదయవేళలో శ్రీసూర్యభగవానుడు ఉదయిస్తుండగా తిరుమల శ్రీవారిఆలయం నుండి శ్రీసుదర్శనభగవానుని ఉత్సవమూర్తి ఊరేగింపుగా వెళతారు. మహాప్రదక్షిణంమార్గంలో దర్శనమిస్తూ ఊరేగింపుగా శ్రీసుదర్శనభగవానుడు 'శ్రీస్వామి పుష్కరిణి'కి చేరుకొంటారు. అక్కడ ముందుగా శ్రీసుదర్శనచక్రత్తాళ్వారుకు అర్చన అభిషేకాలు పూర్తి అయినతర్వాత శ్రీస్వామిపుష్కరిణిలో అర్చక స్వాములు మంగళస్నానం చేయిస్తారు. దీన్నే "చక్రస్నానం" అంటారు. వైకుంఠద్వాదశినాటి సూర్యోదయవేళలో శ్రీస్వామి పుష్కరిణీ తీర్థముక్కోటి శుభఘడియల్లో ముక్కోటితీర్థాలు మునిగేవేళ శ్రీవేంకటేశభగవానుని దివ్యాయుధమైన శ్రీసుదర్శనునికి జరిగే చక్రస్నానసమయంలో వేలాదిమంది భక్తులు కోనేట్లో పవిత్రస్నానాలు చేస్తూ పునీతులవుతారు. ఇది మహాద్భుత ఘట్టం. ఇది సిద్ధించిన భక్తుని అదృష్టం ఏమని చెప్పగలం! ఎంతని చెప్పగలం!!

ఎందుకంటే!

స్వామిపుష్కరిణీస్నానం సద్గురోః పాదసేవనం
ఏకాదశీవ్రతం చాపి త్రయ మత్యంత దుర్లభమ్

స్వామిపుష్కరిణిలో స్నానం చెయ్యడం, సద్గురువు పాదసేవ దొరకడం, ఏకాదశీవ్రతం ఆచరించడం అనే మూడు పవిత్రకార్యాల్లో, ఒక్కటంటే ఒక్కటైనా కలగడం ఎంతో అదృష్టం.

ధనుర్మాసం, అందులో వైకుంఠఏకాదశి, ద్వాదశి పండుగవేళల్లో, శ్రీస్వామిపుష్కరిణీస్నానం చేసి శ్రీవారిని దర్శించే భాగ్యం కలగడం ఎంతటి వారికో మాత్రమే కలుగుతుంది.

## ముల్లోకాల తీర్థస్నానఫలం

చిరంజీవి అయిన మార్కండేయమహర్షి పూర్వం బ్రహ్మదేవుణ్ణి గూర్చి తపస్సుచేశాడు. సమస్తలోకాల్లోని అన్ని తీర్థాల్లో స్నానం చేసేట్లుగా వరం ఇమ్మని అడిగాడు. అది అసాధ్యం! ఎన్నెన్ని లోకాలు ఉన్నాయో నాకే తెలియదు. ఈ బ్రహ్మాండాలు అనంతం. అందువల్ల నీవు వేంకటాచలంలోని "శ్రీస్వామి పుష్కరిణి"లో ధనుర్మాసంలో వైకుంఠఏకాదశి, ద్వాదశిరోజున సూర్యోదయవేళలో స్నానం చేస్తే చాలు. అన్ని తీర్థాలస్నాన ఫలితం సిద్ధిస్తుంది. ఎందుకంటే సమస్తతీర్థాలు తమ పాపాన్ని పోగొట్టుకోవడం కోసం ధనుర్మాసంలో వైకుంఠద్వాదశి, శ్రీస్వామిపుష్కరిణీతీర్థ ముక్కోటినాటి అరుణోదయవేళలో ఆ కోనేట్లో మునకలు పెడతాయి. అట్లా నీ కోరిక నెరవేరుతుంది అని వరమిచ్చాడు బ్రహ్మదేవుడు. ఇలా ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి, ద్వాదశీ పండుగ రోజుల్లో కలియుగ వైకుంఠమైన తిరుమలను దర్శించి ధన్యులమవుదాం.

*ఓం నమో వేంకటేశాయ!*

ధారావాహిక

# తిరుమల సమయాచారములు

(తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)

**తెనుగు అనువాదకులు:**
**కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు,**
**కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు**

*(గత సంచిక తరువాయి భాగం...)*

మునుపు తొండైమాన్ చక్రవర్తికి సాక్షాత్కారము కలిగించిన పరిషద్వేంకటేశ్వరునకు వారి దర్శనస్థలమునందు ఒక మండపము కట్టించి స్వామివారి శ్రీచరణములను అనంత గరుడ విష్వక్సేనాది పరిషత్తుతోడ ప్రతిష్ఠ చేయించి, వారు మిక్కిలి దూరము కానందున (కొంచెము దూరమగుటచేత) అపక్వపదార్థములనే నివేదించునట్లుగ కట్టడిచేసి శ్రీవేంకటరమణ స్వామి దేవాలయమున ఆళ్వారులు, భగవద్రామానుజులు, శ్రీగోదాదేవి-వీరులకు శ్రీనక్షత్రమహోత్సవములను (జన్మదినోత్స వములను) శ్రీభగవద్రామానుజుల సన్నిధియందే జరుపుటకును, సంపెంగ ప్రదక్షిణము శ్రీవీథులందు దక్షిణమువైపుగా ఆగ్నేయ మూల మొదలుగా శిలాశాసనము వ్రాయించియు, ఇంకను ఎన్నో ధర్మకార్యములు జరిపించియు, తిరుపతిలో శ్రీగోవింద రాజస్వామి దేవాలయమునకు వెలుపలగా భగవద్రామానుజుల వారికి గోపుర ప్రాకారములతోడ ఒక మండపమును నిర్మింప జేసి, శ్రీభగవద్రామానుజుల మూలవిరాట్టును గూడ ప్రతిష్ఠ చేయించి లోపల విజయము చేసియున్న భగవద్రామానుజుల ఉత్సవవిగ్రహమును మూలవిగ్రహ సన్నిధికి విజయము చేయించినారు.

శ్రీగోవిందరాజస్వామి సన్నిధికి అలంకారమై వర్ష వాతాతపనివారకమై స్వామివారికి ఆస్థానయోగ్యమై, దక్షిణోత్తర దిఙ్ముఖముగా ద్వారపాలక మండపమునకు తూర్పుగా విశాల మైనట్టి ఒక గరుడ మండపమును నిర్మింపజేసినారు-

**విష్ణో ర్ధామాంతరే విష్ణో ర్మూర్త్యంతర ఉపస్థితే,**
**తస్య పూజాం ప్రకుర్వీత సంధ్యయో ర్నాన్యదాచరేత్.**

(విష్ణ్వాలయమందు వేరొక విష్ణుమూర్తి విగ్రహమున్నచో దానికి సాయంప్రాతస్సంధ్యలందు పూజ సలుపవలెను; వేరేదియు చేయరాదు.)

అనెడు వైఖానస వచనానుసారముగ మునుపుండిన శ్రీఅనంతభగవానునకై ఏర్పడిన బలిపీఠ (గరుడ) ధ్వజస్తంభము లను కొనివచ్చి చేర్చి సాయంప్రాతఃకాలమందు ఆరాధన మాత్రము జరుగులాగున ఏర్పాటుచేసి బల్యర్చనోత్సవాదులు వలదనియు, శ్రీవృషభమాస తిరునాళ్లయందును శ్రీమిథునమాస తిరునాళ్లయందును సాయంప్రాతఃకాలములందు గోవిందరాజ స్వామితోబాటు శ్రీభగవద్రామానుజులను తిరువీథులందు ఊరేగించుటకును శ్రీభగవద్రామానుజుల ఆశ్రమానుగుణముగ తిరువీథియందు కావిరంగుగొడుగులను పట్టుటకును, ఉత్సవాంతర కాలములందు గోవిందరాజస్వామితోడ శ్రీభగవద్రా మానుజులు శ్రీగోదాదేవియు విజయము చేయుటకును, వారికి ముందుగా శ్రీభగవద్రామానుజులు నియమించిన రీతిగ శ్రీవృషభ మాసోత్సవమున ఆళ్వారు తిరునక్షత్రము వచ్చును కావున, వారు భగవద్రామానుజులతోడ తిరువీథియందు ఊరేగునట్లును, వారికి ముందుగా శ్రీవైష్ణవులు ఇయల్గోష్ఠి అనుసంధించునట్లును, ఇయల్గోష్ఠినడుమ ఏకాంగి శ్రీవైష్ణవులు చేతులు కలుపుకొని బంతులుదీరి 'ఇయల్' అనుసంధించు నట్లును, ఆళ్వారులతోడ ప్రబంధగాయకులు (అరైయర్) కరములందు తాళములతోడ సేవించుచు వచ్చునట్లుగ (కందాడై రామానుజ అయ్యంగారు) ఏర్పాటు కావించింది.

శ్రీశైలపూర్ణుల, అనంతార్యుల వంశస్థులైన బ్రహ్మ జ్ఞానులు ఆచార్యస్థానము నిర్వహించినట్లు పూర్ణాధికారముగల ఇరువురు ఇయల్గోష్ఠికి ఇరుపార్శ్వములందును బంతితోడ చేతులు కలుపక సేవించుచు వచ్చునట్లును ఆ బంతులకు ముందుగా ఉత్తమాశ్రములు (సన్న్యాసులు, జియ్యరులు) త్రిదండమండితహస్తులై అనుసంధించునట్లును, ఇంకను మధ్య కాలమున లోపించిన ఎన్నో వైష్ణవధర్మముల నుద్ధరించి యనుష్ఠింపజేసినారు. ధీరోదారమనోహరాంగసుందరరాజగు శ్రీగోవిందరాజస్వామికి ఉభయదేవుల (శ్రీభూదేవుల) చేరికలో ఉన్నతస్థానము కావలెనని తమ నామధేయముతోడ రామానుజ చరణాలయమని ఎల్లప్పుడును విజయము చేసియుండుటకై ఒకదివ్యసింహాసనము చేయించి అందులో ప్రత్యహము విజయము చేయించెను.

*(ఇంకా ఉంది)*

డిసెంబరు 03న హనుమద్వ్రత సందర్భంగా...



# శ్రీహనుమద్వ్రత వైభవము

– డా॥లంక వేంకట సుబ్రహ్మణ్యేశ్వర శర్మ, 99513 74024

## హనుమంతుని షోడశోపచార విధానము

(1)సంకల్పము (2)కలశారాధన (3)గణపతికి షోడశోపచారపూజ (4)పంచలోక పాలకపూజ (5)నవగ్రహపూజ (6)దిక్పాలకపూజ (7)పంపానది పూజ (8)హనుమత్పూజ.

హనుమంతునికి షోడశోపచారములు సమర్పించిన తరువాత వ్రతకథను చదువుకొని, ఆ అక్షతలలో కొంత భాగము హనుమంతునికి సమర్పించి, వ్రతమును చేసుకున్న వారందరనూ వారి శిరస్సుల మీద చల్లుకొనవలయును. హనుమంతునికి ఇష్టమైన పదార్థములను నైవేద్యముగా పెట్టవలయును. తరువాత హనుమంతునికి పునఃపూజచేసి, మహా నైవేద్యము పెట్టవలయును.

శ్లో॥ యస్య స్మృత్యా చ .... పరిపూర్ణం తదస్తు తే ॥

అసాధ్యసాధక! స్వామిన్ అసాధ్యం తవ కిం? వద।
రామదూత! దయాసింధో! మత్కార్యం సాధయ ప్రభో!

అని చదువుతూ వ్రతఫలమును హనుమంతునికి సమర్పించవలెను.

## శ్రీపరాశరసంహిత

హనుమద్వ్రతము పరాశరసంహితలో చెప్పబడినది. ఈ హనుమద్వ్రతమును శ్రీపరాశరముని మైత్రేయునికి చెప్పాడు. ఈ వ్రతమును మార్గశిరశుద్ధ త్రయోదశియందు చేయవలయును.

శ్లో॥ మార్గశీర్షే త్రయోదశ్యాం-శుక్లాయాం జనకాత్మజా ।
దృష్ట్వా దేవీ జగన్మాతా-మహావీరేణ ధీమతా ॥

"ఆంజనేయా ! ఈ లంకయందు దుష్టులగు రాక్షసస్త్రీల నడుమ ఆపత్సముద్రముననున్న నాకు ప్రాణదానముచేసి. రాముని క్షేమవార్త తెలిపి నన్ను సంతోషపరచితివి. కావున, ఈ మార్గశిర శుద్ధత్రయోదశి రోజున ఎవరు హనుమద్వ్రతం ఆచరింతురో అట్టివారు కష్టములనుండి విముక్తులై నీయనుగ్రహమునకు పాత్రులగుదురు అని సీతాదేవి శాసించెను. ఆ కారణమున మార్గశిర శుద్ధత్రయోదశి హనుమద్వ్రతం ఆచరించుటకు మహా పర్వకాలమైనది. హనుమద్వ్రతము అతి ప్రాచీనమైనది. "వ్రతానాముత్తమం వ్రతమ్" అని పెద్దలచే నిర్ణయింపబడినది గావున, అన్ని వ్రతములలోను ఉత్తమోత్తమ మైనది. ఈ వ్రతమునకు సాటియగు వ్రతము మరొక్కటి లేదు. సమస్తదేవతలచేత నాచరింపబడి లోకప్రసిద్ధమైనది. ఈ వ్రతము మార్గశిరశుద్ధ త్రయోదశియందుగాని, హనుమజ్జనన దివసమగు వైశాఖకృష్ణ దశమియందుగాని, బాలాంజనేయుడు సూర్యుని కబళించి ఇంద్రుని వజ్రాయుధప్రహారణమున మూర్ఛనంది సర్వదేవతలచే వరములు పొందిన వైశాఖ బహుళ అమావాస్యయందుగాని, మాఘాది పంచమాసముల యందలి శుక్లపక్ష శనివారములందుగాని, మృగశిర నక్షత్రమందుగాని, శ్రావణపూర్ణిమయందుగాని, కార్తికశుక్ల ద్వాదశి యందుగాని చేయవలయును. ఈ వ్రతము హనుమంతుడు విహరించు పంపానదీతీరమందు చేసిన కోటిరెట్లు ఫలము సంభవించును. కల్పోక్తవిధిగ వ్రతమాచరించి త్రయోదశ గ్రంథులు (పదమూడు ముడులు) గల పచ్చని పట్టుతోరమును

ధరించి, ఈ వ్రతము పదమూడు సంవత్సరములు ఆచరింప వలయును. వ్రతాదియందు గాని, మధ్యయందుగాని, అంత మందుగాని ఉద్యాపనము చేయవలయును. అందరూ ఈ వ్రతమాచరించవచ్చును. భక్తిగల చిత్తముతో హనుమద్వ్రత మాచరించినవారలకు ఆంజనేయమూర్తి సకల సంకటములను తొలగించి, సర్వాభీష్టముల నొసగుటలో నెట్టి సందేహములేదు.

## హనుమద్వ్రత కథ

పాండురాజు తనయులగు ధర్మజ, భీమ, అర్జున, నకుల, సహదేవులు దుష్టదుర్యోధనుడు కల్పించిన మాయా ద్యూతములో సర్వస్వమును ఓడిపోయిరి. తుదకు పంద్రెండు సంవత్సరములు అరణ్యవాసము, ఒక వత్సరము అజ్ఞాతవాసము చేయవలసి వచ్చెను. ద్రౌపదీ సహితముగ పాండవులు అరణ్యమున కేగి ద్వైతవనములో నివసించుచుండిరి.

ఆ సమయమున భారతవంశకర్త, భారతగ్రంథకర్త, వేదవ్యాసభగవానుడు శిష్యసహితముగ ద్వైతవనమందున్న పాండవుల దగ్గరకు వచ్చెను. ధర్మజుడు సోదరులతో, ద్రౌపదితో వ్యాసునకు ఎదురువెళ్లి సాష్టాంగవందన మాచరించి, ఉచితాసనాసీనుని జేసి, అర్ఘ్యపాద్యాదులతో పూజించిరి. వారి సేవలకు వ్యాసమహర్షి సంతోషభరితుడై ధర్మజునితో "నాయనా! యుధిష్ఠిరా! నీవును, భీమార్జున నకుల సహదేవులును, ద్రౌపదియు కుశలముగ నుంటిరికదా?" అని అడిగెను.

ధర్మరాజు విచారముతో "మహానుభావా! సకల భోగములనుభవించవలసియుండి జూదమున సర్వమును ఓడి పోయి తుదకు ఆరణ్యవాసము చేయుచు కష్టములనుభవించు చున్న మాకు కుశలమెక్కడిది?" అని దీనముగా తన బాధలను చెప్పుకొనెను.

ధర్మజుని మాటలు విన్న వ్యాసభగవానుడు "యుధిష్ఠిరా! నీవు ఈ వనవాసక్లేశమునుండి విముక్తుడవై శీఘ్రముగ రాజ్యాభిషిక్తుడవగుటకు గొప్ప మహిమగల వ్రత రాజము కలదు. దానిని చెప్పెదను.

శ్లో॥ శృణు రాజేంద్ర తన్నామ-హనుమద్వ్రతమద్భుతం ।
ఉచ్చారణాదేవ తస్య-కార్యసిద్ధిర్న సంశయః ।
దుష్టగ్రహోచ్చాటనం చ మహాజ్వరనివారణమ్ ॥

"ధర్మరాజా! శ్రద్ధగా వినుము. అది శ్రీహనుమద్వ్రతము. శ్రీహనుమత్ నామ ఉచ్చారణవలన సకల భూత ప్రేత పిశాచములున్నూ, సర్వవిషమజ్వరములున్నూ నశించును. సమస్తకార్యములు సత్వరముగా నెరవేరగలవు.

పూర్వము ద్రౌపదీదేవి శ్రీకృష్ణపరమాత్మను అడుగగా ఈ హనుమద్వ్రత మహిమను చెప్పెను. ద్రౌపదియు భక్తితో విధ్యుక్తముగ హనుమద్వ్రతము ఆచరించి తోరమును కంఠ మందు ధరించెను. ఈ వ్రత మహిమవలన మీకు సకల సంపదలు కలిగినవి.

ఒకరోజు అర్జునుడు ద్రౌపది కంఠమందున్న తోరమును జూచి "ఈ తోరమును ధరించుటకు కారణమేమి?" అని అడిగెను. అందులకు ద్రౌపది" "నాథా! ఇది హనుమద్వ్రత తోరము. ఈ వ్రతమహిమను నా సోదరుడు శ్రీకృష్ణుడు నాకు ఉపదేశించెను. అందువలన నేను ఆ వ్రతమాచరించి తోరమును ధరించితిని. హనుమంతుని దయవలన మనకు సకల సంపదలు కలిగినవి." అని చెప్పెను.

ఆమె మాటలకు ఐశ్వర్యముచే గర్వితుడైన అర్జునుడు కోపముతో-

శ్లో॥ ధ్వజే మమ నిబద్ధోఽయం- వానరో నిరతం మయా।
కిం దాస్యతి మమ బ్రూహి- వటుర్వ్యాశనో మృగః॥

"ద్రౌపదీ! నా రథమందలి టెక్కెముపైన బంధింప బడియున్న వనచరుడగు హనుమంతుడు నీకేమి ఇవ్వగలడు? ఆ కృష్ణుడు పరిహాసముగ ఈ వ్రతమును చెప్పెను. ఇది యథార్థము కాదు. నా దాసుడైన హనుమంతుని పూజింపుమని నీకెట్లు చెప్పెను? ఇట్టి దుర్బోధనలు విని నా అనుమతి లేక వ్రతమాచరించిన నీవు పతివ్రత వెట్లగుదువు? తత్‌క్షణమే ఆ వ్రతతోరమును, ఆ వ్రతమును విసర్జింపుము." అని శాసించెను. ద్రౌపది మహాపతివ్రత కావున భర్తమాటలను ఉల్లంఘింపలేక ఉద్యాపనము చేయకయే తోరమును విసర్జించెను. ఆ కారణమున మీ సకలసంపత్తులు నశించినవి. త్రయోదశ గ్రంథులు (పదమూడు ముడులు) గల తోరమును విసర్జించి నందున మీరు పదమూడు సంవత్సరములు అరణ్యవాసము చేయవలసివచ్చెను. హనుమద్వ్రత త్యాగఫలమే మీ కష్టములకు కారణము" అని పూర్వగాథనంతయు వ్యాసమహర్షి చెప్పగా, ద్రౌపది "ఇది సత్యమే" అని పలికెను.

పిమ్మట వ్యాసభగవానుడు హనుమద్వ్రతమహిమను గురించిన ఒక గాథ ఇట్లు చెప్పెను. "పాండవులారా! పూర్వము

హనుమంతుడు శ్రీరామసుగ్రీవులకు మైత్రిగూర్చిన సమయమున హనుమ శ్రీరాముడితో ఇట్లు చెప్పెను.

"రామచంద్ర ప్రభూ! నేను వైశాఖ బహుళదశమి శనివారమున జన్మించితిని. అమావాస్యరోజు ఆకలిబాధవలన ఉదయించు సూర్యుని జూచి ఫలమను భ్రాంతితో కబళించితిని. దేవేంద్రుడు నాపై కులిశాయుధమును వేసెను. ఆ ఆయుధ ప్రహరణమున నేను మూర్ఛనొందగ, సర్వవ్యాపకుడగు వాయు దేవుడు మేరుపర్వతగుహలోనికి నన్ను తీసుకొనిపోయి, వాయువును స్తంభింపజేసెను. వాయుచలనము లేనందున లోకములు చీకాకుచెందినవి. అప్పుడు దేవతలందరు వాయు దేవుని వద్దకువచ్చి నాకు అనేక వరములనిచ్చిరి. ఆ సమయమున బ్రహ్మదేవుడు నన్ను జూచి "మారుతీ! నిన్ను గురించి హనుమద్వ్రతమును భక్తిశ్రద్ధలతో ఎవ్వరు ఆచరిస్తారో వారు సకల కష్టములు తొలగి సర్వకార్యసిద్ధిని, సుఖమును పొందగలరు".

సుగ్రీవుడును, విభీషణుడును ఈ వ్రతమాచరించి ఆంజనేయుని కృపవలన ఇష్ట కామ్యార్థ సిద్ధిని పొందిరి. హమమద్వ్రతము చేసిన వారియందు హనుమంతుని అను గ్రహము తప్పక కలుగును. కావున, నీవు శీఘ్రముగ హనుమద్వ్రతం ఆచరించినచో వెంటనే రాజ్యమును పొంది సకల సుఖము లను అనుభవింపగలవు." అని వ్యాసమహర్షి చెప్పెను.




పిమ్మట ధర్మరాజు వ్యాసభగవానుని సమక్షమున పత్నీసహితుడై విధ్యుక్తముగ వ్రతమాచరించి, ఉద్యాపనము కూడ చేసెను. ఆ వ్రతమహిమవలన హనుమంతుని సంపూర్ణానుగ్రహము పొంది, ఒక్క సంవత్సరమునకే యుద్ధంలో విజయము సాధించి, పట్టాభిషిక్తుడై సకలైశ్వర్యము లనుభవించుచు సుఖముగ రాజ్యపాలనము చేసెను.

శ్లో॥ ఆంజనేయః పూజితశ్చేత్
పూజితా స్సర్వదేవతాః ।
హనుమ న్మహిమాశక్యో
బ్రహ్మణాఽపి న వర్ణితుమ్ ॥

శ్లో॥ కే వా న పూజయన్తీహ
ప్రత్యక్షవరదాయకమ్ ।
అర్చయన్తి హనూమంతం
బ్రహ్మ విష్ణు శివాపి ॥

శ్లో॥ హనుమ త్సదృశం దైవం
నాస్తి నాస్త్యేవ భూతలే ।
తస్మిన్ సంపూజితే భాను-
ర్బ్రహ్మ గౌరీ మహేశ్వరః ॥

శ్లో॥ శ్రీజానకీపతి స్సాక్షా-
దాది నారాయణః ప్రభుః ।
ఈశ శ్శక్రాది లోకేశాః
కుమారో గణనాయకః ॥

శ్లో॥ బ్రహ్మర్షయో వసిష్ఠాద్యాస్సనకాద్యాశ్చ యోగినః ।
పితరో వసవో రుద్రాః పూజితాస్స్యుర్న సంశయః ॥

సకలదేవతా స్వరూపుడగు హనుమంతుని పూజించిన సర్వదేవతలను పూజించిన వారగుదురు. హనుమంతుని మహిమను వర్ణించుటకు బ్రహ్మాదులకైనను శక్యముకాదు. శ్రీహనుమత్పూజవలన సత్వరమే సకలాభీష్టములు సిద్ధించును. హనుమంతుని పూజించనివారు ఈ ప్రపంచమున ఎవ్వరూ లేరు. బ్రహ్మయును, విష్ణువును, మహేశ్వరుడును సకలార్థ ప్రదాయకుడగు శ్రీహనుమంతుని పూజించుచున్నారు. హనుమంతునితో సమానమగు దైవము ఈ భూతలమున లేనేలేడు. హనుమంతుని పూజించినందున సూర్యుడు, బ్రహ్మదేవుడు, ఉమామహేశ్వరులను, సాక్షాత్ నారాయణస్వరూపుడగు శ్రీరామ చంద్రుడను, ఇంద్రాది దిక్పాలకులను, కుమార స్వామియు, గణాధిపతియు, బ్రహ్మర్షులైన వసిష్ఠాదులను, యోగీశ్వరులగు సనకాదులను, పితృదేవతలను, అష్టవసువులను. ఏకాదశ రుద్రులను పూజింపబడినవారే అగుదురు.

శ్లో॥ యస్తు గేహే హనూమంతం-భక్త్యా నిత్యం ప్రపూజయేత్ ।
తద్గృహే తత్ప్రభావేన- నిత్యం లక్ష్మీరచంచలా ॥

శ్లో॥ దీర్ఘ మాయుర్లభేత్తైష- సర్వతో విజయో భవేత్ ।
మార్యాది భూత సంక్షోభ-స్తదేశే నైవ జాయతే ॥
(సుదర్శనసంహిత)

ఎవని గృహమందు నిత్యము హనుమంతుడు భక్తితో పూజింపబడుచుండునో ఆ ఇంటియందు లక్ష్మీదేవి స్థిర నివాసముగా ఉండును. హనుమంతుని పూజించిన వానికి దీర్ఘాయుర్దాయము కలుగును. సర్వకార్యములందును సర్వతోముఖ విజయము గాంచుచుండును. మార్యాది భూతములవలన భయము కలుగదు.

పాపభూయిష్టమగు ఈ కలియుగమందు పుట్టిన మానవులకు సకలాభీష్టములు నెరవేర్చునది హనుమత్ పూజయే. సర్వలోకాలలో భక్తులైన వారందరూ హనుమంతుని పూజింపవచ్చును. సకలజన సంరక్షణకై రామాజ్ఞనంది, భక్తసంరక్షణ దీక్షాకంకణధారియై చిరంజీవిగనున్న పరదైవతము హనుమంతుడు.

## అధ్యయనోత్సవాలు - తిరుమల

(2025, డిసెంబరు 19 నుండి 2026, జనవరి 12 వరకు)

| రోజు | పగల్‌పత్తు ఉత్సవం-పాశురాలు | ఆళ్వారుల పేరు |
|---|---|---|
| 01. | "ఇయఱ్పా" తొడక్కం | పొయ్‌గై, పూద, పేయ్, తిరుమళిశై, శఠకోపన్ |
| 02. | "తిరుప్పల్లాండు" తొడక్కం | పెరియాళ్వార్ |
| 03. | "శెన్నియోంగు"తొడక్కం | పెరియాళ్వార్ |
| 04. | "విణ్ణీలమేలాప్పు" | ఆండాళ్ నాచ్చియార్ |
| 05. | "ఊనేఱు శెల్వత్తు" | కులశేఖరాళ్వార్ |
| 06. | "వాడినేన్ వాడి" | తిరుమంగై ఆళ్వార్ |
| 07. | "వాడమరుదిడైపోగి" | తిరుమంగై ఆళ్వార్ |
| 08. | "పండైన్నాత్తైయుమ్" | తిరుమంగై ఆళ్వార్5-7 |
| 09. | "తెల్లియార్ దేవర్క్కుం" | తిరుమంగై ఆళ్వార్8-2 |
| 10. | "కాదిల్ కడిప్పిట్టు" | తిరుమంగై ఆళ్వార్ (10-7) |
| 11. | చిన్నశాత్తుమొఱ "తిరునెడుందాండగమ్" | తిరుమంగై ఆళ్వార్ |
| | రాపత్తు ఉత్సవం - పాశురాలు | |
| 12 | "తిరువాయ్‌మొళి" ముదల్‌పత్తు | నమ్మాళ్వార్లు |
| 13 | "తిరువాయ్‌మొళి" రెండవపత్తు | " |
| 14 | "తిరువాయ్‌మొళి" మూడవపత్తు | " |
| 15 | "తిరువాయ్‌మొళి" నాల్గవపత్తు | " |
| 16 | "తిరువాయ్‌మొళి" ఐదవపత్తు | " |
| 17 | "తిరువాయ్‌మొళి" ఆరవపత్తు | " |
| 18 | "తిరువాయ్‌మొళి" ఏడవపత్తు | " |
| 19 | "తిరువాయ్‌మొళి" ఎనిమిదవపత్తు | " |
| 20 | "తిరువాయ్‌మొళి" తొమ్మిదవపత్తు | " |
| 21. | "తిరువాయ్‌మొళి" పత్తాంపత్తు పెద్దశాత్తుమొఱ | " |
| 22. | 'కణ్ణినుణ్ శిరుత్తాంబు' | మధురకవి ఆళ్వారు |
| 23. | 'ఇరామానుశనూత్తందాది' 'ఉపదేశరత్తినమాలై' | అముదనార్, వరవరముని |
| 24. | వరాహస్వామి సన్నిధిలో అధ్యయనోత్సవం (ఏకాంతం) | |
| 25. | తణ్ణీర్‌అముదు ఉత్సవం (తిరుమలనంబి వంశీయులు) (అధ్యయనోత్సవ సమాప్తి) | |

# అష్టసిద్ధులు వాటి ప్రభావం

– శ్రీమతి కౌతా నిర్మల

అష్టసిద్ధులు అంటే ఎనిమిది సిద్ధులు. అవి **1)అణిమ 2)మహిమ 3) గరిమ 4)లఘిమ 5)ప్రాప్తి 6)ప్రాకామ్య 7)ఈశత్వ 8)వశిత్వ.** ఈ అష్టసిద్ధులను పురాణపురుషులు ప్రదర్శించినట్లుగా పురాణాల్లో చెప్పబడినాయి. ఈ అష్టసిద్ధుల ప్రభావం గురించి పురాణాల్లో స్పష్టంగా వివరించబడింది.

**1)అణిమ–** ఈ సిద్ధి ప్రసక్తి రామాయణంలో ఉంది. హనుమంతుడు సీతాదేవిని అన్వేషిస్తూ, లంకలో ప్రవేశించే సమయాన చిన్నవాడిగా మారటానికి ఈ సిద్ధిని ప్రదర్శించాడు. ఈ సిద్ధితో తమ ఆకారాన్ని సూక్ష్మంగా మారుస్తారు.

**2)మహిమ–** మహిమసిద్ధిని కూడా హనుమంతుడు రామాయణంలో ప్రదర్శించాడు. సముద్రాన్ని ఉల్లంఘించే సమయంలో, సురస పెద్దగా నోరు తెరచినప్పుడు అణిమ సిద్ధితో సూక్ష్మరూపంలో ఆమెనోట్లోకి ప్రవేశించాడు. ఆ తర్వాత పెద్దవాడి రూపాన్ని ధరించాడు. ఈ విధంగా, అణిమ మహిమ సిద్ధులను ఉపయోగించాడు. మహిమ సిద్ధి వల్ల అతిపెద్ద రూపాన్ని పొందగలుగుతారు. వామనావతారంలో శ్రీమహావిష్ణువు బలిచక్రవర్తి తనకు ప్రసాదించిన మూడడుగుల నేల వరాన్ని పొందటానికి మహిమసిద్ధి ద్వారా తన రూపాన్ని బాగా పెంచి, రెండడుగుల నేలతో భూమిని, ఆకాశాన్ని ఆక్రమించాడు. మూడోపాదాన్ని బలిచక్రవర్తి శిరస్సు మీద ఉంచి ఆ పాదాన్ని నొక్కి పెట్టి, ఆ చక్రవర్తిని పాతాళానికి అణగదొక్కినట్లుగా పురాణ కథనం.

**3)గరిమ–** గరిమసిద్ధి లభించడం వల్ల వారు కోరుకున్నంత బరువును పొందగలుగుతారు. గరిమసిద్ధితో బాలకృష్ణుడు బరువును పెంచుకున్నాడు. తృణావర్తుడు అనే రాక్షసుడు, సుడిగాలి రూపంలో కృష్ణుడిని ఎత్తుకుపోవడానికి ప్రయత్నించినప్పుడు, ఆ అసురుని భుజాల మీద కూర్చుని, అతను మోయలేనంతగా తన బరువును పెంచి, అటు పిమ్మట ఆ రాక్షసుని సంహరించాడు. ఒకసారి భీముడు సౌగంధికా పుష్పాలను తెచ్చేందుకు బయల్దేరాడు. ఆ మార్గంలో హనుమంతుడు అతనికి కనిపించాడు. తన శౌర్యం, బలం గురించి భీమునిలో ఏర్పడిన గర్వాన్ని అణచాలని, ఆంజనేయుడు భావించాడు. అతని మార్గానికి తన వాలాన్ని అడ్డుపెట్టి, ఆ వాలం బరువును అమితంగా పెంచేశాడు. అది గరిమ సిద్ధి మహిమ. ఆ వాలాన్ని పక్కకు పెట్టి, తన మార్గాన తను వెళ్లమని భీమునికి చెప్పాడు. హనుమ. బరువుగా ఉన్న మారుతివాలాన్ని ఎత్తలేకపోయి, తలదించుకున్నాడు భీముడు. భీమునికి ఆ విధంగా గర్వభంగం చేశాడు హనుమంతుడు.

**4)లఘిమ–** లఘిమసిద్ధి అంటే తేలికగా అయిపోవడం. ఆకాశగమనాన్ని ఈ లఘిమాశక్తి అంటారు. లఘిమాసిద్ధి ప్రదర్శన రామాయణంలో, భాగవతంలో కనిపిస్తుంది.

**5)ప్రాప్తి–** ప్రాప్తిసిద్ధి అంటే ఇంద్రియాల అధిష్ఠానదేవతలను దర్శించగలుగుతారు. వారి అనుగ్రహంతో ఏదైనా పొందగలుగుతారు.

**6)ప్రాకామ్య–** ప్రాప్తిసిద్ధి ద్వారా తాము కోరుకున్న వాటిని దర్శించగలగటమే కాక, వాటిని అనుభవించగలిగే సామర్థ్యాన్ని ప్రాకామ్యద్వారా పొందుతారు.

**7)ఈశత్వ–** జ్ఞానవీర్యాదుల ప్రకోపశక్తి లభిస్తుంది. సృష్టిపైన ఆధిపత్యాన్ని పొందగలుగుతారు.

**8)వశిత్వ–** ఈ సిద్ధితో పంచభూతాలను వశం చేసుకోగలుగుతారు. యోగశాస్త్రంలో ఎనిమిది సంఖ్యను మాయకు సంకేతంగా చెబుతారు. భగవద్గీతలో అష్టవిధాలైన మాయల

ప్రసక్తి ఉంది. పంచభూతాలు, మనస్సు, బుద్ధి, అహంకారం కలిస్తే ఎనిమిది అవుతాయి. మన శరీరమే మాయకు సంబంధించినదిగా గుర్తించాలి.

సిద్ధులు లభించగానే, వాటి ప్రభావం వల్ల వారి బుద్ధులు మారిపోతాయి. విచక్షణాజ్ఞానాన్ని విస్మరిస్తారు. అహంకార పీడితులవుతారు. నిగ్రహం నశిస్తుంది. దుర్బుద్ధి ఏర్పడుతుంది. అందువల్లనే మహాయోగులు, అష్టసిద్ధులు, మోక్ష మార్గాన పయనించేవారిని పెడతోవ పట్టించే ప్రమాదశక్తులని తెలిపారు. అష్టసిద్ధుల ప్రదర్శనను గురించి ఒక కథ ఉంది, పురాణాల్లో.

హిమాలయ పర్వతాల్లోని మంచుగుహలో జీవానందుడు, సత్యానందుడు అనే మహర్షులు తపస్సు చేశారు. వారి తపోఫలితంగా వారికి అష్టసిద్ధులు ప్రాప్తించాయి. జీవానందుడు తనకు లభించిన అష్టసిద్ధులతో పరమానందం చెందాడు. వాటిని ప్రదర్శించి, అందరినీ ఆకర్షించాడు. అనేకమంది శిష్యులను చేర్చుకుని ఒక ఆశ్రమంలో నివసించసాగాడు.

అందరూ తనను పొగుడుతూండటంతో, తనను తానే భగవంతుని స్వరూపునిగా ఊహించుకుంటూ, పూజలు చేయించుకుంటూ, సేవలు పొందసాగాడు. అతడు విచక్షణను, ధర్మాన్ని విస్మరించి, విలాసంగా జీవించసాగాడు. ఒకసారి మహారాణి ఆ ఆశ్రమానికి వచ్చింది. ఆయన శిష్యులలో ఒకడు మహారాణిగారి మెడలోని అమూల్యమైన, అమితవిలువైన హారాన్ని దొంగతనం చేశాడు. రాజభటులు తనిఖీ చేయడంతో ఆ హారం ఆశ్రమంలోనే జీవానందుని సమీపంలోనే దొరికింది. జీవానందుడికి, అతని శిష్యులకు శిక్షపడి కటకటాలలో బందీలుగా జీవించసాగారు.




సత్యానందుడు తనకు లభించిన అష్టసిద్ధులను శివార్పణం కావించి, తన తపస్సును ఆ గుహలోనే కొనసాగించాడు. ఆ గుహలో హిమలింగం దివ్యతేజస్సుతో అలరారుతూంటే సత్యానందుడు, ఆ లింగాన్ని పూజిస్తూ ఎంతో ప్రశాంతంగా, ఆనందంగా, ఏ కోరికలు లేకుండా కాలం గడపసాగాడు. ఆ గుహ ఎంతో సువాసనలు వెదజల్లుతూ పరిమళ భరితంగా ఉంది.

శిక్షాకాలం ముగిసిన తర్వాత జీవానందుడు తిరిగి హిమాలయాలకు వెళ్లాడు. అక్కడ గుహలో సత్యానందుడిని చూసి, "అష్టసిద్ధులు పొందినప్పటి నుంచీ నువ్వు ఇక్కడే ఉన్నావా? ఆ సిద్ధులను ఉపయోగించుకోలేదా?' అని అడిగాడు, జీవానందుడు. నాకు లభించిన అష్టసిద్ధుల ప్రలోభానికి నేను లొంగలేదు. వాటిని ఈశ్వరునికి అర్పించి, ఇక్కడ మంచుతో ఏర్పడిన శివలింగాన్ని పూజిస్తూ, నిశ్చింతగా కాలాన్ని గడుపు తున్నాను" అని చెప్పాడు సత్యానందుడు. సత్యానందుని ప్రశాంత జీవితాన్ని చూసిన జీవానందుడు తన చర్యలకు పశ్చాత్తాపం చెంది, సత్యానందమహర్షికి నమస్కరించి, అతడిని తన గురువుగా స్వీకరించి, తపస్సు చేయటానికి ఉపక్రమించాడు.

# పూర్ణపురుషుడు

– శ్రీ మాడుగుల రామకృష్ణ

భగవంతుడు అన్ని ప్రాణులలో క్షేత్రజ్ఞుడిగా ఉన్నాడు. ఆయన సర్వశక్తిమంతుడు. జగత్తు అంతా ఆయన మాయే. దానికి వశుడై ఉన్న జీవుడు 'నేనే చేస్తున్నాను, అంతా నాదే, అన్నీ నాకే తెలుసు' అనే అజ్ఞానపాశాలతో బంధితుడవుతున్నాడు. అరిషడ్వర్గాల ఊబిలో కూరుకుపోతున్నాడు. అందుకే మనిషి సంపూర్ణుడు కాలేకపోతున్నాడు. అజ్ఞానాంధకారంలో చిక్కుకుని జ్ఞానసముపార్జన కోసం ప్రయత్నించలేకపోతున్నాడు.

భగవంతుడు పూర్ణపురుషుడు. మనిషిగా జన్మించి, తనేమిటో, తన తత్త్వమేమిటో లోకానికి స్పష్టంగా విశదపరిచాడు. బ్రహ్మ సృష్టిలోని చాకచక్యం అంతా కృష్ణుడి రూపంలో సంపూర్ణంగా కనిపిస్తుంది. అందుకే అందరూ చేసే పనులు ఆపేసి మరీ చెంతకుచేరి ఆయన్నే చూస్తూ ఉండి పోయేవారు. త్రిగుణాత్మకమైన ప్రకృతికి, ముల్లోకాలకు ఆయనే అధిపతి. స్వయంప్రకాశుడు, ఆనందస్వరూపుడు. ఇక వినయంలో కృష్ణుడికి సాటి ఎవరూ లేరు. కంసవధ అనంతరం దేవకీ వసుదేవులకు నమస్కరించి 'ఇన్నేళ్లుగా మీ పాదసేవాభాగ్యాన్ని పొందలేకపోయాను. క్షమించి అనుగ్రహించండి' అని వేడుకున్నాడు. కృష్ణుడి వల్లనే ఉగ్రసేనుడు మహారాజయ్యాడు. అయినా ఆయన ముందు చేతులు కట్టుకుని నిలబడి గౌరవంగా మాట్లాడేవాడు. 'మహారాజా!' అని తనను చూడవచ్చిన బంధువులు, పెద్దలకు తలవంచి నమస్కరించేవాడు.

దయామయుడైన శ్రీకృష్ణుడు పెంచిన తల్లి యశోదకు ఏ పుణ్యలోకాలను ప్రసాదించాడో, తనను మట్టు పెట్టాలని వచ్చిన పూతనని కూడా అవే పుణ్యలోకాలకు పంపాడు. తన పట్ల శత్రుభావం గల రాక్షసులు కూడా తన భక్తులే అని భావించి మరణానికి ముందు వారికి తన పూర్ణదర్శనభాగ్యాన్ని అనుగ్రహించాడు. కృష్ణుడు ఏకసంథాగ్రాహి. సాందీపని మహర్షి ఆశ్రమంలో వేదాన్ని అధ్యయనం చేశాడు. మరణించిన గురుపుత్రుణ్ణి పంచజనుడు అనే రాక్షసుడి ఉదరం నుంచి బయటకు రప్పించి గురుదక్షిణ ఇచ్చాడు. పరమాత్మ గృహస్థ ధర్మాన్ని పాటించి అష్టదేవేరులను ఆనందపరిచాడు. సచ్చిదానందమైన జ్ఞానంతో నిష్ఠ కలవాడై ద్వారకను సమర్థంగా పాలించాడు. లోకంలో జ్ఞానమార్గాన్ని నిలబెట్టాడు. అపూర్వ గీతావాణిని అందించాడు.

కోరికలు లేకుండా, కర్మలు అంటకుండా ఉండే స్వామి కర్మలు చేస్తున్నట్లు కనిపించాడు. కాలమృత్యుస్వరూపుడైనా శత్రువులకు భయపడి ద్వారకాద్వీపంలో తలదాచుకున్నట్లు నాటకమాడాడు. ఒక వంక 'జగత్తును నడిపించేది నేనే' నంటూనే మరో వంక 'నిమిత్తమాత్రుణ్ని, నాకేమీ తెలియద'ని అనేవాడు. ఆయనపై పరిపూర్ణ విశ్వాసం ఉంటే గానీ ఆ తత్త్వం అర్థం కాదు. పరమ భక్తి కలిగినవారు నిత్యమూ భగవత్ సాన్నిధ్యాన్నే కోరుకుంటారు. వారి దృష్టి ఎప్పుడూ ఆయన పైనే ఉంటుంది. పాండవులు అంతటి భక్తిపరులు కాబట్టే వారికి రాజ్యం దక్కింది. ఇలాంటి పరాభక్తిని సాధన చేస్తే దైవం తనను తానే సమర్పించుకుంటాడు. దూడ వెంట గోవులా మన వెంటే ఉంటాడు.



108 దివ్యదేశాలు

# తిరుతొలైవిల్లి మంగళం

## (నవతిరుపతులు - 5)

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

దీర్ఘాగ్రసితలోచనా తదబలా శ్రీదేవదేవో హరిః
యస్మిన్ పూర్వముఖస్సురేంద్రవరదః శ్రీతామ్రపర్ణీ తటే ।
ఆసీనశ్చ విమానమర్థిశుభదం నామ్నా చ గుప్తం మహత్
తస్మిన్ నిస్తులమంగళాఖ్యనగరే సర్వానిమాన్ భావయే॥

తిరునల్వేలి నుండి తిరుచెందూరు వెళ్ళే మార్గంలో సుమారు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో, తామ్రపర్ణి నదీ తీరంలో వెలసి ఉన్నటువంటి రెండు దివ్యదేశాలని ఒకే దివ్య దేశంగా పరిగణించబడే రెండు తిరుపతులు అనే విధంగా ఈ **తిరుతొలైవిల్లి మంగళం** అనే దివ్యదేశం అమరి ఉన్నది. ఇచ్చట రెండు తిరుపతులు వెలసి ఉన్నాయి. ఒకటి **దేవపిరాన్** అనే పేరుతో ఒక దివ్యదేశం, **శెన్దామరైకణ్ణన్** (అరవిందలోచనుడు) అనేటువంటి స్వామి వేంచేసి ఉన్నటువంటి మరొక దివ్యదేశం. ఈ రెండు తిరుపతులను చేర్చి ఒకే దివ్యదేశంగా **నమ్మాళ్వారులు** మంగళాశాసనం చేసి ఉన్నారు. (అందుకే 'ఇరట్టైతిరుపతి' అని వ్యవహరిస్తారు)

ముఖ్యంగా ఈ దివ్యదేశానికి వెళ్ళడం చాలా కష్టం. ఒక అడవిలో జనసంచారం లేనటువంటి ప్రదేశంలో ఈ రెండు కూడా అమరి ఉన్నవి. అర్చకులను పిలుచుకొని మనం దర్శనానికి వెళ్ళాల్సిన పరిస్థితి ఉన్నది. ఇందులో మొట్టమొదటి దివ్యదేశం **దేవపిరాన్** అనేటువంటి పేరుతో పిలువబడే స్వామి. ఒక ఎకరా స్థలంలో తూర్పుదిక్కును చూస్తూ రెండు ప్రాకారములతో తామ్రపర్ణినదీ తీరంలో, వరుణ తీర్థము మరియు కుముద విమానముతో మూలమూర్తి అయినటువంటి దేవపిరాన్ అంటే శ్రీనివాసుడు, శ్రీదేవి భూదేవి సమేతుడై వేంచేసి ఉండి భక్తుల్ని అనుగ్రహిస్తూ ఉన్నాడు. రెండవది ఈ దేవపిరాన్ సన్నిధికి సమీపంలో ఉత్తరదిక్కులో అద్భుతమైనటువంటి శిల్పకళానైపుణ్యంతో, రెండు ప్రాకారములతో, ప్రకృతి రామణీయకతతో, తామ్రపర్ణితీర్థం, వరుణతీర్థం మరియు కుముద విమానంతో **శెన్దామరైకణ్ణన్** (అరవిందలోచనుడు) అనేటువంటి దివ్యనామంతో తూర్పు దిక్కును చూస్తూ కూర్చొన్నటువంటి భంగిమలో మూలమూర్తి అరవిందలోచనుడు, కరుంతడంకణ్ణి అమ్మవారితో దేవదేవుడు వేంచేసి ఉండి అనుగ్రహిస్తూ ఉన్నాడు.



### స్థలపురాణం

ఆత్రేయ సుప్రభుడు అనేటువంటి మహర్షి భగవంతుణ్ణి ఉద్దేశించి, ఒక పెద్ద యజ్ఞాన్ని చేయాలని సంకల్పించి, దానికి తగినటువంటి విశాలమైనటువంటి ప్రదేశం కొరకు దేశమంతా తిరిగాడు. అలా తిరిగి తిరిగి అలసి సొలసి ఉన్న అతనిని చూచిన దేవ పిరాన్ తన దివ్యదేశానికి తీసుకొని రాగా, సుప్రభుడు దైవిక సంపత్తితో నున్న ఆ ప్రదేశాన్ని చూచి పరవశించి అచటనే యాగం చేయసంకల్పించు కొని, యాగాన్ని ప్రారంభించెను. యాగభూమిని ఎప్పుడైతే దున్ను తున్నాడో, ఆ సమయంలో ఎలాగైతే జనక మహారాజు యాగం కొరకు భూకర్షణ చేసే సందర్భంలో జగన్మాత





అయినటువంటి సీతాదేవి దొరికినదో, అలాగే సుప్రభునకు కూడా ఆ భూమి అడుగున ఒక త్రాసు మరియు ఒక ధనుస్సు కూడా దొరికింది. ఆశ్చర్యంతో చూసినటువంటి సుప్రభుడు దాని దగ్గరకు వెళ్ళి చూడగా ఆ త్రాసు ఒక అమ్మాయిగా, ధనుస్సు ఒక అబ్బాయిగా మారడం జరిగినది. వారిరువురు కూడా తమ యొక్క పూర్వజన్మ వృత్తాంతాన్ని తలచుకుని "మేమిరువురు పూర్వజన్మలో కొత్త దంపతులై ఈ చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్ని లెక్క చేయక, కామావేశంతో ఆనందాన్ని అనుభవిస్తూ ఉండగా, పైన కుబేరుడు రాగా, అతని యొక్క స్వరూపాన్ని చూచి మేము పరిహాసం చెయ్యగా, కుబేరుడు 'మీరిద్దరు కూడా ఒకరు త్రాసుగా, మరొకరు ధనుస్సుగా మారండి' అని శాపం ఇచ్చాడు. ఆ సమయంలో కుబేరుని శాపవిమోచనానికై ప్రార్థించినప్పుడు, సుప్రభుడు అనేటువంటి మహర్షి యాగం కొరకు ఎప్పుడైతే భూకర్షణ చేస్తాడో ఆ సమయంలో అతని యొక్క చేయి తగిలి, మీరిరువురూ కూడా నిజస్వరూపాన్ని పొందగలరు అని చెప్పడం చేత "మేము ఈ ప్రకారంగా అయ్యాము" అని చెప్పగా, తరువాత సుప్రభుడు అద్భుతంగా యాగాన్ని ఎంతో ఉత్సాహంగా ప్రారంభిస్తుండగా, ఆ హవిర్భాగాన్ని స్వీకరించడానికై దేవతలందరూ కూడా వచ్చి చేరారు. ఈ ప్రకారంగా తమకు హవిర్భాగాన్ని అందించినటువంటి ఆ పరమపురుషుడైనటువంటి శ్రీమన్నారాయణుణ్ణి దేవతలందరూ కూడా వేడుకొనగా, భగవంతుడు తన దివ్యమహిషితో పాటు ఈ దివ్యదేశానికి వేంచేసి వాళ్ళకు సాక్షాత్కరించాడు. ఆ ప్రకారంగా తాము అనుభవించినటువంటి భగవంతుణ్ణి వీరు అందరూ కూడా స్తోత్రం చేసి, "ఈ స్వరూపంతోనే దివ్య మహిషితో పాటు తమరు ఇక్కడే వేంచేసి భక్తులను అనుగ్రహించాలి" అని విజ్ఞాపనం చేశారు. భగవంతుడు దేవపిరాన్‌గా దివ్యమహిషితో పాటు ఈనాటికి కూడా సేవను ప్రసాదిస్తున్నాడు.

| | |
|---|---|
| **భగవంతుడు** | **: దేవపిరాన్, అరవిందలోచనుడు** |
| **అమ్మవార్లు** | **: మహాలక్ష్మి, కరుంతడంకణ్ణి** |
| **నదీ** | **: తామ్రపర్ణీ** |
| **తీర్థం** | **: వరుణతీర్థం** |
| **విమానం** | **: కుముదవిమానం** |
| **సేవ** | **: తేవపిరాన్-నిలుచున్నసేవ, అరవిందలోచనుడు-కూర్చొన్న భంగిమ** |
| **ప్రత్యక్షం** | **: ఇంద్రవరుణవాయువులకు** |
| **ఆగమం** | **: వైఖానసాగమము** |
| **మంగళాశాసనం** | **: నమ్మాళ్వార్లు తిరువాయ్‌మొళి-6-5** |

### స్థలపురాణం "అరవిందలోచనుడు" అనే పేరు ఎలా వచ్చింది?

సుప్రభమహర్షి భగవదారాధనకై ప్రతినిత్యం సమీపంలో ఉన్న కొలనులోని తామరపుష్పాలని ఎంతో చాకచక్యంగా తామరతూడుకు కూడ నొప్పి కలుగకుండా కోసి భగవంతుణ్ణి అర్చించేటటువంటి విధానాన్ని చూచి దేవదేవుడు "ఓయీ సుప్రభా! నీవెంత ఉదారుడవు. ప్రతినిత్యం నా కొరకు ఇలా వెయ్యి తామర పుష్పాలను కోసుకొని వచ్చి నన్ను అర్చిస్తున్నావే! నీ అమితమైన భక్తిని నేనెలా పొగడగలనని చెప్పగా", అందుకు సుప్రభుడు "స్వామి! ఎన్నివేల తామర పుష్పాలను సమర్పించినా అవి నీ దివ్యతిరునేత్రాలకు సరి తూగునా! అన్నియూ కూడ నీవు సృష్టించినవే కదా!" అని స్వామి దివ్యనేత్రాలను వర్ణించడం చేత భగవంతుని "అరవింద లోచనుడు" అని అనాటినుండి కీర్తించడం జరిగినదని భక్తులందరూ రెండు తిరుపతులలో వేంచేసియున్న భగవంతుల్ని దర్శించుకుంటే ఇహపరసౌఖ్యములలో విరాజిల్లుదురని పెద్దల మాట.



'తిరుతొలైవిల్లి మంగళం' దివ్యదేశాన్ని నమ్మాళ్వార్లు మంగళాశాసనం చేశారు




సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ। అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః॥ *(శ్రీమద్భగవద్గీత-18వ అధ్యాయం, 66వ శ్లోకం)*

# శ్రీమదనంతార్య విరచితా
# శ్రీగోదాచతుఃశ్లోకి

- వ్యాఖ్యాత - ఆచార్య చక్రవర్తి రంగనాథన్



అగాధ భగవద్భక్తి సింధువులైనటువంటి పన్నిద్దరాళ్వారులలో ఏకైక స్త్రీమూర్తిగా వెలుగొందుతున్నటువంటి ఒక భక్తిమంతురాలు 'గోదాదేవి' ఆండాళ్ తల్లిగా, చూడికుడుత్తనాచ్చియార్‌గా ప్రసిద్ధి గాంచినది. శ్రీవిల్లిపుత్తూరులో విష్ణుచిత్తులవారి పుత్రికగా వారి నందనోద్యానవనం తులసీవనంలో, కర్కాటకమాసంలో, పూర్వఫల్గుణీ నక్షత్రంలో అవతరించినది గోదాదేవి. ద్వాపర యుగంలో కాత్యాయనీ వ్రతాన్ని ఆచరించి, తరించినటువంటి గోపికల వలె తాను కూడా కలియుగంలో స్వామివారిని పొందడానికై 'ధనుర్మాస' వ్రతాన్ని ఆచరించి తరించినది. రోజుకు ఒక పాశురంగా భగవంతునికి పాశురపు మాలను సమర్పించుకుని 'ఆముక్తమాల్యద'గా ప్రసిద్ధి చెందింది. ఈ కలియుగంలో శ్రీవైష్ణవదివ్యదేశాలలో పదునొకండు ఆళ్వారులు రచించినటువంటి దివ్యప్రబంధాలకన్నా కూడా గోదాదేవి రచించినటువంటి అద్భుతమైన, అద్వితీయమైన, అనుపమైన 'తిరుప్పావై' అనే దివ్యప్రబంధం ప్రతిరోజూ నిత్యానుసంధానంగా పారాయణం చేయబడుచున్నది. తిరుప్పావై ప్రబంధం వేదమునకు కూడా బీజం వలె ఉన్నది. సకలపాపాల్ని పోగొడుతుంది. భగవంతుని యొక్క దివ్యపాదారవిందాన్ని మనకు దర్శింపజేస్తుంది. "ఎవరైతే ఈ లోకంలో ఉండి గోదాదేవి యొక్క తిరుప్పావై దివ్య ప్రబంధాన్ని నేర్చుకోలేదో వాళ్లు భూమికి భారంగానే ఉంటారు" అని మహనీయుల మాట.

శ్రీగోదాదేవి వైభవాన్ని శ్రీవేంకటేశ్వర స్వామి చరణరేణువు అయినటువంటి, భగవద్రామానుజుల పాదధూళి అయినటువంటి అనంతాళ్వాన్ ఈ గోదా చతుఃశ్లోకిని అనుగ్రహించారు. విశేషంగా ధనుర్మాసంలో గోదాచతుః శ్లోకిని అనుసంధానం చేసి గోదా గోవిందుల యొక్క అనుగ్రహాన్ని పొందాలని 'సప్తగిరి' మాసపత్రిక పాఠకుల కోసం అందిస్తున్నది.

నిత్యా భూషా నిగమశిరసాం నిస్సమోత్తుంగవార్తా
కాంతో యస్యాః కచవిలులితైః కాముకో మాల్యరత్నైః।
సూక్త్యా యస్యాః శ్రుతిసుభగయా సుప్రభాతా ధరిత్రీ
సైషా దేవీ సకలజననీ సించతాం మామపాంగైః॥ 1

ఆండాళ్ తల్లిగా పిలువబడేటటువంటి ఏ గోదాదేవి యొక్క అద్భుతమైన శ్రీ సూక్తి 'తిరుప్పావై' అనే దివ్యప్రబంధం వేదాంతాలకు ఎల్లప్పుడు కూడా అలంకారంగా ఉన్నదో (వేదాంతార్థాలకు అధికమైనటువంటి శోభను కలిగించినదో); ఏ గోదాదేవి తన అందమైన కురులలో ముడుచుకొని విడిచినటువంటి సుగంధ పుష్పమాలిక చేత దేవదేవుడు ఆకర్షితుడై గోదాదేవి పట్ల అధికమైన అనురాగాన్ని కలవాడయ్యాడో, శ్రవణపేయమైన ఏ దివ్య ప్రబంధం చేత ఈ భూమి ప్రబోధాన్ని పొందుతున్నదో, అటువంటి సర్వలోక జనని అయిన ఆ చూడిక్కుడుత్త నాచ్చియార్ (గోదాదేవి) తన కటాక్షాలతో ఎల్లప్పుడు కూడా తడుపుగాక, అనుగ్రహించుగాక అని ప్రార్థిస్తున్నాము.

మాతా చేత్ తులసీ పితా యది తవ శ్రీవిష్ణుచిత్తో మహాన్
భ్రాతా చేత్ యతిశేఖరః ప్రియతమః శ్రీరంగధామా యది।
జ్ఞాతార స్తనయాః త్వదుక్తిసరసస్తన్యేన సంవర్ధితాః
గోదాదేవి! కథం త్వమన్యసులభాసాధారణా శ్రీరసి॥ 2

అమ్మా గోదాదేవి! నీ జనని సాక్షాత్తు భగవంతునికి ప్రియమైన తులసి. నీ జనకుడు మహాత్ముడైన భగవంతుని ప్రియభక్తుడైన విష్ణుచిత్తుడు. నీ యొక్క సోదరుడు సాక్షాత్తు యతిశేఖరుడు. నీకు అత్యంత ప్రియతముడు శ్రీరంగధాముడైన శ్రీరంగనాథుడు, నీ పుత్రులు ఎవరు అంటే సరసమైన దివ్యప్రబంధం అనే స్తన్యాన్ని(పాలను) సేవించి వర్ధిల్లినటువంటి జ్ఞానులు. అమ్మా! నీవు అనన్య సులభవు. అలాగే అసాధారణమైన "శ్రీః" గోదాదేవిగా వెలుగొందుతున్నావు. చాలా గొప్పదానవమ్మా! అని స్తుతిస్తున్నారు.

కల్పాదౌ హరిణా స్వయం జనహితం దృష్ట్వైవ సర్వాత్మనాం
ప్రోక్తం స్వస్య చ కీర్తనం ప్రపదనం స్వస్మై ప్రసూనార్పణమ్।
సర్వేషాం ప్రకటం విధాతు మనిశం శ్రీధన్వినవ్యే పురే
జాతాం వైదిక విష్ణుచిత్తతనయాం గోదా ముదారాం స్తుమః॥ 3

కల్పం యొక్క ఆరంభంలో సకలలోకానికి కూడా ఆత్మ అయిన భగవానుడు, శ్రీహరి ఈ లోకం యొక్క హితాన్ని కోరి స్వయంగానే తన యొక్క కీర్తనను అలాగే ప్రపత్తిని అంటే శరణాగతిని, ఎల్లప్పుడు కూడా తనకు పుష్పాలను అర్పించడం మొదలయిన ఉజ్జీవన గతులన్నింటినీ కూడా ఉపదేశించాడు. అన్నింటినీ కూడా ప్రతినిత్యం ఆచరించి ప్రకటనం చేయడం కొరకు ఆ ధన్వినవ్యపురం అనే శ్రీవిల్లిపుత్తూరు లో వైదికాగ్రేసరుడైన శ్రీవిష్ణుచిత్తులవారి పుత్రికగా ఆవిర్భవించి, అత్యంత ఉదారమైన స్వభావాన్ని కలిగిన గోదాదేవిని మనసారా స్తుతిస్తున్నాం.

ఆకూతస్య పరిష్క్రియా మనుపమా మాసేచనం చక్షుషో
ఆనందస్య పరంపరా మనుగుణామారామశైలేశితుః।
తద్దోర్మధ్యకిరీటకోటిఘటిత స్వోచ్ఛిష్టకస్తూరికా
మాల్యామోదసమేధితాత్మవిభవాం గోదా ముదారాం స్తుమః॥ 4

శ్రీశేషశైలేశ్వరుడైన వేంకటనాథుడైన శ్రీనివాసుని అభీష్టం ఏదైతే ఉన్నదో, ఆ అభీష్టానికి పరిష్కారం గోదాదేవి, శ్రీనివాసుని దివ్య నేత్రాలకు సాటిలేని మేటి అయిన ఆనందాన్ని కలిగిస్తూ ఉన్నది. శ్రీనివాసుని యొక్క వక్షఃస్థలం, అలాగే అద్భుతమైనటువంటి కిరీటం యొక్క అగ్రభాగం, గోదాదేవి ముడుచుకొని విడిచినటువంటి ఆ కస్తూరికామాలికతో భూషింపబడ్డాయి. ఆ మాలిక యొక్క ఆమోదంతో *"ఏషః సర్వ గంధః, ఏషః సర్వ రసః, ఏషహ్యే వానందయాతి"* అని ఉపనిషత్తులలో కీర్తింపబడేటటువంటి భగవానుడు, ఆ భగవానునికి అద్వితీయమైనటువంటి, అపూర్వమైనటువంటి సుగంధాన్ని, ఆనందాన్ని, సంతోషాన్ని ఎల్లప్పుడూ కలిగించేటటువంటి గోదాదేవి యొక్క వైభవమనేది అభివృద్ధి పథంలో ప్రకాశిస్తున్నది. ఇట్టి దేవదేవునికి అత్యంత ప్రియతమురాలైన, భక్తురాలైన, మహనీయురాలైన ఆండాళ్ తల్లిని, గోదాదేవిని అందరం కూడా స్తుతిస్తున్నాము.

స్వోచ్ఛిష్టమాలికాబంధ గంధబంధురజిష్ణవే।
విష్ణుచిత్తతనూజాయై గోదాయై నిత్యమంగళమ్॥

// ఆండాళ్ తిరువడిగళే శరణమ్ //



30-10-2025న తిరుమలలో శ్రీవారికి జరిగిన పుష్పయాగ మహోత్సవం. ఈ కార్యక్రమంలో
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్., గారు మరియు ఇతర ఆలయాధికారులు పాల్గొన్న దృశ్యం



18-10-2025న తిరుపతి
శ్రీనివాసమంగాపురంలో శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారికి
జరిగిన పవిత్రోత్సవ చిత్రం



26-10-2025న తిరుమల పాపవినాశనం డ్యామ్ వద్ద
తి.తి.దే. ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడుగారు
ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



31-10-2025న తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ
అన్నప్రసాదం సముదాయంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి
శ్రీ అనిల్ కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్., గారు మరియు
ఇతర అధికారులు 'ఆయుధపూజ' నిర్వహిస్తున్న దృశ్యం



18-10-2025న తిరుపతిలోని తి.తి.దే. పరిపాలనా భవనం
ఎదురుగా గల తి.తి.దే. ముద్రణాలయంలో తి.తి.దే.
సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., గారు
మరియు ఇతర అధికారులు 'ఆయుధపూజ' నిర్వహిస్తున్న చిత్రం

# శ్రీ అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయం, అరగొండ

– డా॥ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు, 94919 46070

దర్శించి సేవించినంతనే శారీరక మానసిక రుగ్మతలను పోగొట్టి ఆయురారోగ్యాలను ప్రసాదించే దేవుడుగా.... కోరిందే తడవుగా కోరికలు తీర్చే కొంగుబంగారంగా భక్తులచేత పిలిపించుకొంటూ ఆరాధనలందుకొంటూ ఉన్న శ్రీఅర్ధగిరి వీరాంజనేయస్వామి కొలువుదీరిన మహిమాన్విత క్షేత్రం– **'అరగొండ'.**

చిత్తూరు జిల్లాలో తిరుపతి పట్టణానికి సుమారు 75 కిలోమీటర్ల దూరంలో 'అరగొండ' ఉంది. పూర్వం లక్ష్మణుడిని బ్రతికించేందుకు హనుమంతుడు సంజీవనీ పర్వతాన్ని తీసుకు వెళ్తూ ఉన్న సమయంలో కొంత కొండ విరిగి ఈ ప్రాంతంలో పడింది. పర్వతం సగం విరిగిపడిన ప్రాంతం కనుక అర్ధగిరి, అర్ధకొండ అనే పేర్లు ఈ ప్రాంతానికి ఏర్పడినట్లు కథనం. 'అర్ధకొండ' అనేది కాలక్రమంలో ప్రజల వాడుకలో 'అరగొండ'గా మారినట్లు స్థలపురాణం వెల్లడిస్తూ ఉంది.

**స్థలపురాణం పరిశీలిస్తే–** త్రేతాయుగంలో రామరావణుల మధ్య యుద్ధం జరుగుతూ ఉన్న సమయంలో రావణాసురుడి కుమారుడైన ఇంద్రజిత్తు చేతిలో లక్ష్మణుడు మూర్ఛబోయాడు. లక్ష్మణుడు జీవించాలంటే సంజీవనీ మూలిక అవసరం. దీనితో శ్రీరామచంద్రమూర్తి ఆదేశాలమేరకు శ్రీఆంజనేయస్వామి మూలికను తీసుకొనివచ్చేందుకు సంజీవని పర్వతం వద్దకు వెళ్ళాడు. అయితే ఆ పర్వతంపై సంజీవనీ మూలికను గుర్తించలేకపోయాడు. దీనితో ఆ పర్వతాన్నే పెకిలించి అరచేతిలో పట్టుకొని లంకకు వెళ్ళసాగాడు. ఈ సమయంలో ప్రస్తుత అరగొండ ప్రాంతానికి వచ్చేసరికి సంజీవని పర్వతంలో కొంత భాగం విరిగి కిందపడింది. లంకలో రామరావణ యుద్ధం ముగిసి శ్రీరాముడు అయోధ్యకు చేరి పట్టాభిషేకం చేసుకొన్న తరువాత కొంత కాలానికి ఆంజనేయస్వామి కొండ విరిగి పడిన ప్రాంతాన్ని చూసేందుకు వచ్చాడు. ఈ సమయంలో అక్కడ ఉన్న మహర్షులు, స్వామివారిని ఈ కొండపైన కొలువుదీరమని, ప్రజల పూజలందుకొంటూ వారి ఆయురారోగ్యాలను కాపాడుతూ ఉండమని ప్రార్థించారు. వారి ప్రార్థనలను మన్నించిన శ్రీఆంజనేయస్వామి 'అరగొండ'లో కొలువుదీరినట్లు స్థలపురాణం వెల్లడిస్తూ ఉంది.

చారిత్రకంగా పరిశీలిస్తే చోళరాజుల పాలనా కాలం నుంచి అంటే సామాన్యశకం 10, 11 శతాబ్దాల నుంచే ఈ స్వామి పూజలందుకొంటూ ఉన్నట్లు ఆధారాల వల్ల తెలుస్తోంది. అయితే ఆ కాలంనాటి నిర్మాణ కౌశల్యం కాని, శిల్పకళ కాని కనిపించదు. దీన్ని బట్టి రాజుల కంటే కూడా ప్రజలే ఈ ఆలయం పట్ల శ్రద్ధకనబరిచినట్లు చెప్పవచ్చు. ఇటీవలి కాలంలో ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దడంతో పాటు రాజగోపురాన్ని నిర్మించారు.





'అరగొండ' గ్రామానికి సుమారు ఒకటిన్నర కిలో మీటర్ల దూరంలో కొండ ఉంది, కొండపైన ఆలయం ఉంది. కొండపైకి వెళ్ళేందుకు రహదారి ఉంది. విశాలమైన ప్రాంగణంలో ఉన్న ఆలయ ప్రధాన ప్రవేశద్వారంపై గోపురం నిర్మింపబడి ఉంది. తూర్పు అభిముఖంగా ఉన్న ఆలయం ముఖమండపం, గర్భాలయాలను కలిగి ఉంది. ప్రధాన గర్భాలయంలో శ్రీవీరాంజనేయస్వామి వారు కొలువుదీరి ఉన్నారు. స్వామివారు సుమారు మూడు అడుగుల ఎత్తుతో ఒక కాలు ముందుకు ఉంచి ఒక చేతిని అభయహస్తంగా పైకి ఎత్తి, మరొక చేతితో భుజంపైన ఉన్న గదను పట్టుకొని, చేతిని నడుమువద్ద ఉంచుకొని దివ్యతేజోరూపంతో కొలువుదీరి పూజలందుకొంటూ ఉన్నాడు. ఉత్తరాయణ పుణ్యకాలంలో ప్రత్యక్ష దేవుడైన శ్రీసూర్యభగవానుడు తనశిష్యుడైన ఆంజనేయస్వామి వారిపై ఆశీస్సులు వర్షిస్తున్నట్లుగా తన కిరణాలను ప్రసరింపజేస్తూ ఉండటం విశేషం. ఉత్తరాయణమంతా సూర్యోదయం కాగానే సూర్యకిరణాలు గర్భాలయంలోని శ్రీవీరాంజనేయ స్వామివారి పాదాలపై పడి క్రమంగా నడుముభాగంపైన తర్వాత శిరస్సుపైన ప్రసరిస్తాయి. ఇదంతా ఉదయం ఏడు గంటలలోపే జరగడం విశేషం.

ఆలయానికి సమీపంలో పుష్కరిణి ఉంది. దీనికి **'సంజీవరాయ పుష్కరిణి'** అని పేరు. మిగతా క్షేత్రాల్లోలాగా కాకుండా ఈ క్షేత్రంలో స్నానానికి కాకుండా నీటిని తీర్థంగా స్వీకరించేందుకు పుష్కరిణిని ఉపయోగిస్తారు. ఈ నీటిలో ఔషధగుణాలు ఉన్నాయనీ, వీటిని సేవించడం వల్ల 1800 రకాల వ్యాధులు నయమవుతాయని చెప్పబడుతూ ఉంది. నీటి ప్రభావం వల్ల సోరియాసిస్, ఆస్త్మా, పక్షవాతం, కీళ్ళనొప్పులు వంటి అనేకరకాల వ్యాధులు, చర్మవ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతూ ఉన్నట్లు ప్రచారంలో ఉంది. దీర్ఘవ్యాధిగ్రస్తులు ఈ క్షేత్రంలోనే ఉండి పుష్కరిణి నీటిని సేవిస్తూ స్వామి వారిని దర్శించుకొంటూ ఉండటం అన్ని సమయాల్లోనూ గమనించవచ్చు. ఉండేందుకు వీలుకాని వారు క్యాన్లతో నీటిని తీసుకువెళ్తారు. క్యాన్లలో నీరు ఎంతకాలం నిలువ ఉన్నా ఏమీ కాకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.



ప్రతిరోజు పూజలు జరిగే అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామివారికి వివిధసందర్భాల్లో ఉత్సవాలు, పూజలు జరుగుతాయి. ప్రతి మంగళ, శనివారాలు స్వామివారికి విశేషపూజలు జరుగుతాయి. ప్రతినెలా పౌర్ణమినాడు స్వామివారికి విశేష అలంకరణలు చేస్తారు. వైశాఖమాసంలో హనుమజ్జయంతి సందర్భంగా విశేషపూజలను, ఉత్సవాలను నిర్వహిస్తారు. వివిధ పండుగలు, పర్వదినాల సందర్భంలో ప్రత్యేక పూజలను చేస్తారు.

అరగొండలో భక్తులకు వసతి సౌకర్యాలు లభిస్తాయి. తిరుపతినుంచి 75, కాణిపాకంనుంచి 12, చిత్తూరు–బెంగుళూరు జాతీయ రహదారిలోని బంగారుపాళ్యం నుంచి 14 కిలోమీటర్ల దూరంలో 'అరగొండ' క్షేత్రం ఉంది. అరగొండకు తిరుపతి, చిత్తూరు, కాణిపాకంనుంచి బస్సు సౌకర్యాలు ఉన్నాయి. గ్రామంనుంచి కొండపైన ఆలయానికి ఆటోలలో వెళ్ళవచ్చు.

ఆయురారోగ్యాలను ప్రసాదించే అరగొండ శ్రీవీరాంజనేయస్వామివారిని దర్శించి భక్తులు ఆధ్యాత్మికానందాన్ని పొందవచ్చు.

# తొండరడిప్పొడిఆళ్వార్
## (విప్రనారాయణులు)

- డా॥పి.టి.జి.రంగరామానుజాచార్యులు

డిసెంబరు19న తొండరడిప్పొడి ఆళ్వార్ వర్షతిరునక్షత్ర సందర్భంగా..

కోదండే జ్యేష్ఠనక్షత్రే మండంగుడిపురోద్భవమ్
చోళోర్వ్యాం వనమాలాంశం భక్తాంఘ్రిరేణుమాశ్రయే

తమిళనాడులో కుంభకోణం పట్టణానికి దాదాపు 20 కి.మీ దూరంలో 'తిరుమణ్ణంగుడి' అనే చిన్న గ్రామంలో నివసిస్తున్న దంపతులకు ఎంతోకాలంగా సంతానం లేకపోవుటచే, కర్ణాటకలోని యదుగిరిపై వేంచేసిన శ్రీయోగ నరసింహస్వామిని సేవించి, క్రిందకు దిగి మూలమూర్తియగు తిరునారాయణ స్వామిని దివ్యదర్శనం చేసుకొని భక్తితో ఆ స్వామిని ప్రార్థించిరి. వారికి కలలో శ్రీతిరునారాయణస్వామి ప్రత్యక్షమై మీకు తప్పకుండా పుత్రసంతానం కల్గుతుందని ఆశీర్వదించారు. ఆ కారణంగా స్వామివారి అనుగ్రహంతో ప్రభవనామ సం॥ మార్గశీర్షమాసం జ్యేష్ఠానక్షత్రం గురువారంనాడు భగవానుని కంఠంలో అలంకారమగు 'వైజయంతీ' అనే పేరుగల వనమాలాంశమున దివ్యతేజస్సుతో వారికి మగశిశువు జన్మించెను. మేల్కోటై దివ్య క్షేత్రంలో వేంచేసియున్న తిరునారాయణస్వామి అనుగ్రహంచేత జన్మించుటచే 'విప్రనారాయణుడ'ను పేరును పెద్దలు నిశ్చయించిరి. వీరికి *భక్తాంఘ్రిరేణు, తొండరడిప్పొడి, అంబర్తాళ్తూళి* అనే పేర్లు ఉన్నాయి. వీరికి సాక్షాత్తు విష్వక్సేనులే వచ్చి పంచసంస్కారములను చేసి మంత్రార్థాన్ని అనుగ్రహించినారు.

విప్రనారాయణుడు పరమవైష్ణవుడై భగవంతుడైన శ్రీమన్నారాయణునే ఎల్లప్పుడూ భక్తితో ధ్యానిస్తూండేవాడు. ఇంట్లోని పెద్దలు వీరికి వివాహం చేయాలనుకున్నారు. వివాహం వల్ల స్వామికి కైంకర్యభంగం అవుతుందని ఆయన అక్కడ నుండి భూలోకవైకుంఠధామమైన శ్రీరంగానికి బయల్దేరెను. అక్కడ జరిగే అనేకానేక నిత్యోత్సవాలను కళ్ళారా దర్శించి పునీతుడయ్యెను. అక్కడ జరిగే అన్ని ఉత్సవాల్లో విశేషంగా పుష్పమాలలను అందరూ సమర్పిస్తున్నారు. 'అలంకారప్రియో విష్ణుః' అనే ఆర్యోక్తిననుసరించి స్వామి అనుగ్రహానికి పుష్పమాలికలనైనా సమర్పించవచ్చని, పుష్పకైంకర్యం చేయాలని నిర్ణయించుకొని శ్రీరంగంలో కావేరీ తీరంలో నిచుళాపురమనబడే ఉఱైయూరుదగ్గర చక్కని నందనవనాన్ని ఏర్పాటుచేసి దానిలో అనేకరకములైన పుష్పవృక్షాలను నీరు పోసి పెంచి వాటి పుష్పాలను కోసి చక్కని మాలలుగా తయారుచేసి శ్రీరంగనాథునికి నిత్యం కైంకర్యం చేయ ప్రారంభించెను. ఈ ఆళ్వార్లవిషయంలో పెరియపెరుమాళ్ళకు (శ్రీరంగనాథునికి) అమితమైన ప్రేమ ఉన్నది. కనుక వారి వైభవాన్ని లోకానికి చాటి చెప్పాలని పెరుమాళ్ళు నిర్ణయించుకొని ఒక చక్కని లీలను కృపజేసెను.

ఆ ఉఱైయూర్ దివ్యదేశంలోనే దేవదేవి అనే దాసి (రాజనర్తకి) ఉండేది. ప్రతిరోజూ చోళరాజు ఆస్థానంలో నాట్యంచేసి ఈ స్వామి నందనవనం ముందునుంచీ తన గృహానికి వెళ్ళేది. ఆ నందనవనం వైభవాన్ని అచ్చటి పుష్పాల సౌగంధ్యాన్ని ఆస్వాదిస్తూ "ఆహా! ఇంత చక్కనైన పుష్పోద్యానాన్ని ఎవరు నిర్మించారో గానీ ఎలాగైనా ఈ పుష్పములను సంగ్రహించాల్సిందే" నని భావించినది. కానీ ఉద్యానవనాన్ని కాపాడే విప్రనారాయణుల సౌందర్యాన్ని చూచి ఆయనపై కూడా మోహభావావేశాన్ని పొందినది. ఎలాగైనా ఈ స్వామి సాన్నిహిత్యాన్ని, పుష్పమాలికల వైభోగాన్ని పొందాల్సిందేనని నిర్ణయించుకొని తన అక్క అలివేణికి తెలియజేయసినది. కానీ ఆమె "సోదరీ! ఆ వైష్ణవోత్తముడు ప్రాపంచికమైన విషయాలపై శ్రద్ధలేక నిత్యం ఆ శ్రీరంగనాథుని కైంకర్యంలో తన జీవితాన్ని సార్థకం చేసుకొన్న మహనీయుడు. నీ యొక్క ప్రయత్నం వ్యర్థమే" అని చెప్పగా, అపుడు దేవదేవి "అక్కా! నేను ఎలాగైనా ఆ స్వామి అనుగ్రహాన్ని పొందెదను, లేనిచో నేను నీకు జీవితాంతం దాస్యం చేయగలను, ఒకవేళ నేను గెలిచినచో నీవే నాకు యావజ్జీవం దాస్యం చేయవలెను" అని అనగా అందుకు ఆమె అంగీకరించినది.

ఆనాటి నుండీ దేవదేవి శ్రీవైష్ణవదీక్ష (పంచ సంస్కారములు)ను పొంది వేషభూషణాదులన్నీ విడచి కాషాయ వస్త్రాలను ధరించి విప్రనారాయణుని సాన్నిహిత్యాన్ని అనుగ్రహాన్ని కోరగా, ఆమె వైష్ణవస్వరూపానికీ భక్తిశ్రద్ధలకు సంతసించి ఆమెను నందనవనం సేవలో నియమించెను. కానీ స్వామి విప్రనారాయణుడు స్త్రీసంబంధం చాలా ప్రమాదకరమని భావించి ఏకరమైన మోహభావాన్నిగానీ ప్రాపంచికమైనవిషయ ఆలోచనను కానీ ఆమెముందు ప్రదర్శించలేదు. ఈవిధంగా

ఆరుమాసములు గడచిపోయినవి. కానీ విప్రనారాయణుడు దేవదేవివిషయంలో ఎంతో జాగ్రత్తతో, భగవద్భక్తిని కల్గి ఉండి ఆమెకు భక్తిమార్గాన్నే ఉపదేశించుచుండెను. చివరకు దేవదేవి తాను వచ్చిన లక్ష్యం ఆలస్యమౌతోందనీ, కాలం గడచినట్లైతే తన అక్కకు తాను బానిస కాకతప్పదని గ్రహించి చివరకు ఆ రంగని "ఓ శ్రీరంగనాథా! నీకు ఇంతకాలంగా ఒక వైష్ణవునితో కలిసి భక్తిశ్రద్ధలుగా పుష్పకైంకర్యం చేయుచున్నాను గదా ఈ భక్తురాలిని కటాక్షించవా!" అని ఎంతో ఆర్తితో భక్తితో ప్రార్థించగా ఆ మాటలను విన్న శ్రీరంగనాథుడు తన దేవేరియగు రంగనాయకితో "దేవీ! ఈనాడు దేవదేవి అను భక్తురాలితోనూ నా భక్తుడగు విప్రనారాయణునిద్వారా లోకానికొక విశేషమైన లీలను ప్రదర్శించబోవుచున్నాను తిలకించుము" అనెను.

అంతట స్వామి ఆజ్ఞతో ఒకానొక అర్ధరాత్రిసమయంలో ఉరుములు పిడుగులతో భారీవర్షము కురువ సాగినది. కుటీరంలో నిద్రించుచున్న విప్రనారాయణుడు ఆ వర్షం శబ్దానికి మేల్కొని "ఉన్నట్టుండి ఈ అకాలవర్షమేమి? అయ్యో! దేవదేవి బయట



వసారాలో వర్షానికి తడిసి బాధపడు తోందేమో? నా వద్దకు వచ్చి స్వామి రంగనాథునికి పుష్పకైంకర్యం చేయు చున్న శ్రీరంగని భక్తురాలు. ఆమెకేమి కష్టం వాటిల్లునో" అని భయపడి బయటకు వచ్చి చూడగా దేవదేవి ఆ వసారాలో అలాగే ఉండి మొత్తంగా తడిచిపోయి వర్షంలో వణుకుచూ నిలబడుటను చూచి "అయ్యో! ఎంత కష్టం వచ్చింది, నా వల్ల ఈమె బాధ పడకూడదు" అని భావించి ఆమె వద్దకువెళ్ళి "నీవు ఈ వర్షంలో కష్టపడవద్దు. నా కుటీరంలోకి త్వరగా రా!" అని ఆమెను చేయిపట్టుకొని తన ఇంటిలోని తీసుకువెళ్ళెను, అంతట ఆ వైష్ణవస్వామియొక్క స్పర్శతో భయంతో ఆయనను ఆలింగనం చేసుకొనగా, ఆ విప్రుడు కూడా స్వామి లీలకారణంచేత ఆమెను ఆలింగనం చేసుకొనెను. ఆవిధంగా చివరకు ప్రకృతిమాయచే ఆ విప్రుడు స్వామికైంకర్యాలన్నిటినీ విడచి ఆమెతోనే జీవించసాగెను. చివరకు ఆమెలేక ఉండలేని స్థితికలవాడై అన్ని విధాల వైష్ణవత్వాన్ని కూడా విడచి ఆమెకై ప్రాకులాడు స్థితికి జేరెను. ఆమె తల్లి విప్రనారాయణుని వద్ద గల ఐశ్వర్యం అంతా లాక్కొని అతనిని బయటకు పంపించివేసెను. విప్రనారా యణుడు దేవదేవిని విడిచి ఉండలేని స్థితిని చూసి శ్రీరంగనాథుడు దేవేరి యగు రంగనాయకి "స్వామీ! పాపం! నీ భక్తుడగు విప్రనారాయణునికి ప్రాకృతికకష్టాలను తొలగించి ఆ వైష్ణవోత్తముని తిరిగి నీ కైంకర్యంలో నియమించరాదా!" అని వేడుకొనగా,

స్వామి రంగనాథుడు "దేవీ! నేను ఎప్పటికీ నా భక్తునికి కష్టాలు లేకుండా చేస్తాను ఇదిగో చూడు! ఈ విశేషమైన చేష్టితముతో ఆతని బాధలను తొలగిస్తాను" అని తెల్పి తన సన్నిధిలోని ఒక బంగారు పాత్రను తీసుకొని విప్రనారాయణుని శిష్యునిరూపంలో వెళ్ళి దేవదేవి తల్లికి ఇచ్చి విప్రనారాయణుని కాపాడమని కోరగా, అది చూచి ఆనందించిన దేవదేవితల్లి విప్రనారాయణుని తిరిగి దేవదేవి చెంతకు చేర్చినది.

మరుసటిరోజు సన్నిధిలో బంగరుపాత్ర లేకపోవుటచే ఆలయంలోని అర్చకులు చోళరాజుకు తెలియజేయగా రాజు ఆగ్రహించి విచారణకై ఆదేశించెను. చివరకు దేవదేవి ఇంట్లో ఆ పాత్ర దొరుకుటచే ఆమెను, ఆమె తల్లిని, అక్కను కూడా రాజుగారివద్ద భటులు హాజరుపరచిరి. దేవదేవితల్లి ఆ పాత్రను విప్రనారాయణుని శిష్యుడిచ్చెనని తనకేమి తెలియదని తెల్పగా, విప్రనారాయణుడు రాజుగారితో నాకెవ్వరూ శిష్యులులేరని ఇదంతా ఎలా జరిగిందో ఏమీ తెలియదని చెప్పగా, అంతా వింటున్న చోళరాజు మరింత ఆగ్రహంతో విప్రనారాయణునికి దేవదేవితో సహా అందరికీ రెండు సంవత్సరాల కఠినకారాగార వాసశిక్షను, అలాగే దీనంతటికీ మూలకారణమైన విప్రనారాయణునికి 100 కొరడాదెబ్బలను అధికంగా శిక్షను అమలు జరపవలసినదిగా ఆజ్ఞాపించెను. ఆ సమయంలో భక్తాగ్రేసరుడగు విప్రనారాయణుడు ఎంతో బాధపడి తనయొక్క ప్రవర్తనకు తనను తాను అసహ్యించుకొని చివరకు జ్ఞానోదయం కల్గి, "ఛీ ఛీ ఇదంతా నేను చేసిన మహాపాపంవల్లనే జరిగినది. అయ్యో! ఒక స్త్రీ వ్యామోహంలో పడి సకలజగదాధారుడైన ఆ శ్రీరంగనాథుని నిత్యకైంకర్యాన్నే మరచిపోయానే! నాయొక్క పాపానికి నిష్కృతిలేదు. నాయొక్క విప్రత్వము వైష్ణవత్వము రెండూ భ్రష్టమైనవే, కనుక నాకు ఈ కొరడా దెబ్బలశిక్ష కావలసిందే", అనుకొని, "ఓ రాజా! మహాపాపినైన నన్ను శిక్షించి మీరు ఆ శ్రీరంగనాథుని అనుగ్రహాన్ని పొందండి" అని భక్తితో పశ్చాత్తాపంతో శ్రీరంగనాథుని ప్రార్థిస్తూ రెండుచేతులూ జోడించి నిల్చొనెను. ఇంతలో విశేషమైన ఒక మెరుపు పిడుగుపాటుతో సహా రాగా దివ్యతేజోరూపంతో శ్రీరంగనాథుని దివ్యవాక్కు వినిపించెను. "ఓ చోళరాజా! సావధానుడవై వినుము. ఇదంతా నాయొక్క లీలావిశేషమే. ఇందులో విప్రనారాయణునికి గానీ, దేవదేవికానీ ఆమె కుటుంబ సభ్యులకు గానీ ఏమాత్రం సంబంధం లేదు. వారంతా నిమిత్త మాత్రులు మాత్రమే. నేనే స్వయంగా రంగదాసుడనే పేరున నా సన్నిధిలోని బంగారుపాత్రను తీసుకెళ్ళి దేవదేవి ఇంట్లో అప్పజెప్పాను. విప్రనారాయణుడు పూర్తిగా నిర్దోషి. అలాగే దేవదేవి కూడా నిర్దోషి. ఆమె పూర్వం కృష్ణావతారకాలంలో నాకు సేవచేసిన కుబ్జస్త్రీ. ఆమె యొక్క ఆనాటి కోరిక కారణంగానే ఈనాడు ఇదంతా జరిగినది. కనుక వారందరినీ నా పక్షంగా భావించి క్షమించి వదిలివేయు" మనగా, చోళరాజు భక్తితో నేలపై పడి సాష్టాంగదండ ప్రణామమాచరించి "స్వామి వారి ఆజ్ఞ దాసునికి శిరోధార్యము"ని వినమ్రంగా స్వామికి నమస్కరించి శిక్షను ఆపివేయమని ఆదేశించెను. మరల భగవానుడు విప్రనారాయణునితో "ఓ వైష్ణవోత్తమా! ఇదంతా నాయొక్క లీలావిశేషమే. ఇందులో మీ ఇద్దరి దోషమిసుమంతైననూ లేదు మీఇద్దరను అనుగ్రహిస్తున్నాను"అనగా విప్రనారాయణుడు "స్వామీ! నీవు దయావాత్సల్యసౌలభ్య సౌశీల్యాద్యనంతకల్యాణగుణోపేతుడవు. నీ లీలలను తెలుసుకొనుటలో నేనెంతవాడను. కనుక నీ దాసులయొక్క పాదములనంటిన మట్టిరేణువులు నా శిరస్సుపై నిత్యం ధరించే భాగ్యాన్ని కల్పించుమా! ఇంతకంటే మరేది ఈ జన్మలో నాకు వద్దు" అని ప్రార్థింపగా స్వామి సంతసించి విప్రనారాయణునికి అలాగే దేవదేవికికూడా తమ జీవనాంతమునందు మోక్షమును అనుగ్రహించెను.

ఈ విప్రనారాయణునకు ఆనాటినుంచీ 'తొండర్'– భగవానుడగు శ్రీమన్నారాయణుని దాసులయొక్క, 'అడి'– పాదముల యందున్న, 'పొడి'– ఇసుకరేణువులు తన శిరస్సుపై ధరించువాడని, 'భక్తాంఘ్రిరేణు'వను బిరుదం సార్థకమైనది. అంతేగాక వీరు ఆళ్వార్లకోటిలో ఒకానొకవిశిష్ట ఆళ్వార్లవలే ప్రకాశించుచుండిరి. తొండరడిప్పొడిఆళ్వార్లచే నిత్యం శ్రీవైష్ణవ గృహాలలో ఆలయాలలో ప్రాతఃకాలంలో అనుసంధానంచేసే తిరుప్పళ్ళియెయిచ్చి అనే విలక్షణమైన పదిపాశురములను అలాగే, తిరుమాలై అనే దివ్యప్రబంధాన్ని విలక్షణంగా గానం చేయబడ్డాయి. ఈ ఆళ్వారు దాదాపు 105 సంవత్సరాలు ఈ లోకంలో జీవించారు.

తమేవ మత్వా పరవాసుదేవం రంగేశయం రాజవదర్హణీయమ్।
ప్రాబోధకీం యో కృతసూక్తిమాలాం భక్తాంఘ్రిరేణుం భగవంతమీడే॥

# గోవిందం పరమానందం

– షణ్ముఖప్రియ నండూరి,
88972 88907

శ్రీకృష్ణుడు– ఈ పేరు వినగానే మన ముఖంలో ఒక చిన్న చిరునవ్వు. కృష్ణుడంటే మనకి ఎప్పుడూ చిలిపి అల్లర్లు, వెన్న దొంగలించడం, గోపబాలులతో ఆటలు, గోపికలతో నృత్యాలు, రాణులు, రాజ్యాలు, రాజభోగాలు ఇవే గుర్తు వస్తాయి.

**కానీ, ఒక్కసారి ఆలోచించండి... ఆయన చూడని కష్టాలా?**

కారాగృహంలో పుట్టి, తల్లిదండ్రులకి దూరంగా ఎక్కడో చిన్న ఊరిలో పెరిగి, తన సొంత మేనమామ తన ప్రాణం కోసం వెంటాడుతుంటే రోజుకో రాక్షసుడి నుండి తననీ తన ఊరినీ కాపాడుకుంటూ.. కొంత వయసు రాగానే కర్తవ్య పరిపాలన కోసం తను పెరిగిన ఇల్లూ ఊరూ కూడా వదిలేసి, జరాసంధుడి బారి నుండి తన ప్రజలని కాపాడుకోవడం కోసం దూరంగా సముద్రతీరంలో వేరే రాజ్యం నిర్మించి... అరాచకాలు, అన్యాయాల నుండి పాండవులను అడుగడుగునా రక్షిస్తూ.. అంతటి పరాక్రమం ఉన్నా, ఒక దూతగా, సారథిగా మారి దగ్గరుండి యుద్ధం నడిపించి.... ఆఖరికి తను చేయని తప్పుకు తన సమస్త కులం నాశనం కావాలని గాంధారి పెట్టిన శాపాన్ని ప్రసాదంగా స్వీకరించి, ఒక నిర్మానుష్యమైన అరణ్యంలో ఒంటరిగా ప్రాణాలు వదిలాడు.

అందరికోసం అన్నీ చేసినా, ఇప్పటికీ ఆయన మీద నిందలు వేస్తూ, ఆయన లీలలను ప్రశ్నిస్తూనే ఉన్నారు పాపం!

ఇన్ని కష్టాలు పడిన కృష్ణుడిని తలుచుకుంటే, మన కున్న కష్టాలు మర్చిపోతాం. ఎందుకని? ఇన్ని విషాదాలు నిండి ఉన్నా, ఆయన జీవితం మనకి ఒక ఉత్సవంలాగా కనిపిస్తుంది. ఎందుకని? అది ఆయన జీవితంలో జరిగిన సంఘటనల వల్ల కాదు... దానికి ఆయన స్పందించిన విధానం వల్ల.

ఆయన కష్టాలు ఉన్నాయి అని ఏడుస్తూ కూర్చోలేదు, భయపడి పారిపోలేదు, కనీసం చుట్టూ ఉన్న మనుషులను, పరిస్థితులను కూడా నిందించలేదు... తన ధర్మం మాత్రం నిర్వర్తిస్తూ, అలా నవ్వుతూ నవ్వుతూ గడిపేశాడు. యుద్ధభూమి లాంటి తన జీవితాన్ని, కేవలం తన దృష్టికోణంతో ఒక క్రీడా మైదానంలా మార్చుకున్నాడు.

అంత ఆనందాన్ని చూశాక, బాధ కూడా బాధపెట్టడం మరిచిపోయి నవ్వేసిందట. అలాంటి నిరంతర పరమానంద ప్రవాహం శ్రీకృష్ణుడు. అందుకే ఆయన కథలు విన్నా, చదివినా, తలచుకున్నా మన మనసు పొంగిపోతుంది.

ఆయన భగవద్గీత ద్వారా ప్రపంచానికి గొప్ప పాఠం చెప్పాడు, కానీ సరిగ్గా గమనిస్తే ఆయన జీవితమే ఒక పెద్ద






శ్రీకృష్ణుడు 'భగవద్గీత' ద్వారా ప్రపంచానికి గొప్ప పాఠం చెప్పాడు

పాఠం. కష్టాలలో కూడా చిరునవ్వు వీడకపోవడం, కోపంలో కూడా కఠోర వచనాలు పలకకపోవడం. జీవితం సింహాసనం మీద కూర్చోపెట్టి రాజుని చేసినా, బండి మీద కూర్చోపెట్టి బంటుని చేసినా– రెండూ సమానంగా భావించి స్వీకరించడం. దొంగ అని పిలిచినా, దొర అని పిలిచినా అంతే ప్రేమతో పలకడం; మనసుకు నచ్చినది, పది మంది మెచ్చినది కాకుండా, పరిస్థితులనీ పరిణామాలనీ దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవడం; ఆవులు తోలుకుంటూ గోపాలుడిగా ఉన్నా, ప్రజలని పరిపాలించే ద్వారకాధీశుడిగా ఉన్నా... అదే సంతృప్తి, అదే సంతోషం.

ఆయనను ప్రేమించిన గోపికలనీ, ద్వేషించిన కంసుడినీ, దూషించిన శిశుపాలుడినీ, పూజించిన కుంతిదేవినీ, స్మరించిన సూరదాస్‌నీ... ఇలా తనని ఏ భావంతో చూసినా, తాను మాత్రం భేదభావాలు లేకుండా అందరినీ సమానంగా తనలోనే కలిపేసుకున్నాడు. అందుకే ప్రేమకు నిర్వచనంగా మారిపోయాడు శ్రీకృష్ణుడు. అంతటి ప్రేమమూర్తి గనుకనే ఈనాటికీ మన పిల్లల్ని ప్రేమగా “కన్నయ్యా” అని పిలుచుకుంటాం.

ఆయన లీలలే కాదు, ఆయన జీవించిన విధానం కూడా ఎంత మధురం కదా! అందుకే అన్నారేమో– “మధురాధిపతే అఖిలం మధురమ్” అని శ్రీమద్ వల్లభాచార్యుల వారు. ఆ అనంతమైన మాధుర్యాన్నే ఈనాటికీ మన అందరికీ పంచుతున్నాడు. మరి, అందుకే యుగాలు గడిచిపోయినా, ఇంకా అందరం కృష్ణమాయలోనే ఉన్నాం. అలాంటి యుగపురుషుడైన శ్రీకృష్ణుడి లీలలను మనకున్న అల్పబుద్ధితో ప్రశ్నించడం మాని, ఆయనని సదా ప్రేమతో స్మరిద్దాం... తరిద్దాం.

*గోవిందా గోవింద!!*


తిరుమల తిరుపతి దేవస్థానములు

**సప్తగిరి**

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

(తెలుగు, తమిళం, కన్నడం, హిందీ, ఆంగ్లం, సంస్కృతభాషలు)

### 'సప్తగిరి' చందాదారులుగా చేరాలంటే...

01) చందాదారులుగా చేరేవారు తమ చిరునామా, పిన్‌కోడ్, సెల్‌ఫోన్ నెంబరును, మీకు కావలసిన పత్రిక భాషను స్పష్టంగా రాసి పంపాలి.

02) 'సప్తగిరి' పత్రిక సంవత్సర చందా రూ.240/-.

03) 'సప్తగిరి' పత్రిక జీవిత చందా (12 సంవత్సరాలు మాత్రమే) రూ.2400/-

04) 'సప్తగిరి' పత్రిక ఇతర దేశాలకు సంవత్సర చందా రూ.1030/-

05) 'సప్తగిరి' పత్రిక చందాను పాఠకులు డి.డి./ ఈ.ఎం.ఓ./ ఐ.పి.ఓ./ ఆన్‌లైన్ (ttdevasthanams.ap.gov.in) ద్వారా నమోదు చేసుకోవచ్చు.

06) 'సప్తగిరి' పత్రిక చందాను పాఠకులు ఏ జాతీయబ్యాంకులోనైన “చీఫ్ ఎడిటర్, సప్తగిరి మ్యాగజైన్, టి.టి.డి., తిరుపతి” పేర డి.డి. తీసి పోస్టు ద్వారా “ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, తిరుపతి–517507” ఈ చిరునామాకు పంపవచ్చు.

### 'సప్తగిరి' సకాలంలో చేరాలంటే...

01) పాఠకులు తాము 'సప్తగిరి' చందాదారులుగా చేరినప్పుడు ఇచ్చిన చందా నెంబరును మరొక్కమారు పరిశీలించుకోగలరు.

02) ఎందుకంటే.. 'సప్తగిరి' పత్రిక ఒకవేళ అందనివారు, ఆ చందా నెంబరు కార్యాలయానికి చేరవేసి వివరాలు పొందవచ్చు.

03) 'సప్తగిరి'పత్రిక సకాలంలో చేరకపోయినా, చిరునామాలో మార్పులు ఉన్నా ఈ–మెయిల్ (chiefeditortpt@gmail.com) ఐడిని సంప్రదించాలి.

04) ఈ–మెయిల్ సౌకర్యంలేని వారు 0877–2264543, 0877– 2264359 నెంబర్లకు ఫోన్ చేసి, చందా నెంబరు చెప్పి సమస్య పరిష్కరించుకోవచ్చు.

05) నేరుగా సంప్రదించదలచినవారు ప్రధాన సంపాదక కార్యాలయ పనివేళల్లో “ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్గింగ్, తిరుపతి–517 507” చిరునామాలో సంప్రదించవచ్చు.

గృహలక్ష్మి

# సీతాస్వయంవరం

- శ్రీ వై. సుబ్రహ్మణ్యం

మనకు లభించినంత వరకు వాల్మీకిమహర్షి విరచిత శ్రీమద్రామాయణమే మొదటి రామాయణ రచన. ఆ తర్వాత అనేకమంది కవులు రామాయణాన్ని వివిధ భాషలలోకి అనువదించారు. అందులో సీతాస్వయంవర ఘట్టం ఒకటి.

వాల్మీకిమహర్షి రామాయణ ద్రష్ట. సీతారాములను ప్రత్యక్షంగా చూచినవాడు. కుశలవులకు ఆశ్రయం ఇచ్చి వారిని శ్రీరామునితో కలిపినవాడు. బ్రహ్మదేవుడు రామాయణాన్ని రచించమని వాల్మీకిమహర్షిని ఆదేశిస్తూ కథలోని ప్రతి సన్నివేశాన్ని దర్శించగలిగే యోగశక్తిని ప్రసాదిస్తాడు. ఆ ప్రభావం వల్ల మహర్షి తాను నారదుని ముఖతః విన్నదే కాకుండ రామాయణంలోని ప్రతి సన్నివేశాన్ని దర్శించగలిగాడు. యోగశక్తి ప్రభావం వలన రామాయణంలోని ప్రతి సన్నివేశం



ఆయనకు కరతలామలకం అయింది. ఈ విషయాన్ని మహర్షి బాలకాండలో తెల్పుకున్నాడు.

**రహస్యం చ ప్రకాశం చ యద్వృత్తం తస్య ధీమతః।**
**రామస్య సహ సౌమిత్రే రాక్షసానాం చ సర్వశః॥**
**(బాల-2-33)**

**వైదేహ్యా శ్చైవ యద్వృత్తం ప్రకాశం యది వా రహః।**
**తచ్చాప్యవిదితం సర్వం విదితం తే భవిష్యతి॥**
**(బాల-2-34)**

**తతః పశ్యతి ధర్మాత్మా తత్సర్వం యోగమాస్థితః।**
**పురా యత్తత్ర నిర్వృత్తం పాణావామలకం యథా॥**
**(బాల-3-6)**

విశ్వామిత్రమహర్షి తన యాగపరిరక్షణ తర్వాత జనక మహారాజును చూచుటకు రామలక్ష్మణులను తీసుకుని మిథిలకు వెళతాడు. అక్కడ జనకుడు వీరు ఎవ్వరని రామలక్ష్మణులను చూపి అడుగగ విశ్వామిత్రుడు వారి వివరములు తెల్పి, వారు శివధనుస్సు చూచుటకు ముచ్చట పడుతున్నట్లు తెలుపుతాడు.

అందుకు జనకుడు తాను ప్రకటించిన స్వయం వరమునకు ఎందరో రాకుమారులు వచ్చి వీరత్వమును ప్రదర్శించుటకుగాను శివధనుస్సును ఎక్కుపెట్టుటకు ప్రయత్నించి విఫలులైనట్లు తెలుపుతాడు.

అంతేకాక శ్రీరాముడు ధనుస్సును ఎక్కుపెట్టగలిగితే సీతను ఇచ్చి వివాహం జరిపించగలనని విశ్వామిత్రునితో పలుకుతాడు.

**యద్యస్య ధనుషో రామః కుర్యాదారోపణం మునే**
**(బాల-66-26)**

**సుతాం అయోనిజాం సీతాం దద్యాం దాశరథేరహమ్**
**(బాల-66-27)**

అయోధ్యాకాండము చివర అనసూయాదేవి కోరికపై సీతాదేవి తమ వివాహవృత్తాంతమును గురించి వివరిస్తూ ఈ విషయాన్నే ధృవీకరిస్తుంది. స్వయంవరమునకు విచ్చేసిన రాకుమారులు ఎవ్వరూ ధనుస్సును ఎక్కుపెట్టలేకపోగా కనీసం దానిని కదల్చుటకు కూడ అశక్తులై దానికి నమస్కరించి వెళ్ళిపోయినట్లు, తర్వాత చాలాకాలానికి విశ్వామిత్రునితో కలిసి తన తండ్రిని చూచుటకు వచ్చి శివధనుర్భంగము చేయగా తమ వివాహం జరిగినట్లు తెలుపుతుంది.

॥ జై శ్రీరామ్ ॥

మన మహర్షులు

# కృత్సమదమహర్షి

- శ్రీమతి భమిడిపాటి బాలా త్రిపురసుందరి

కృత్సమదమహర్షి మహాతపస్వి, అత్యంత ఘనుడు. కృత్సమద మహర్షి తండ్రి సునహోత్రుడు. అతడే వీతహవ్యుడు. ఇతడు అంగీరసమహర్షి కుటుంబానికి చెందినవాడు. ఋగ్వేదంలో రెండవ మండలం 43 శ్లోకాలలో 36 శ్లోకాలు దర్శించినవాడు,

కృత్సమదమహర్షికి ఇద్దరు సోదరులు ఉన్నారు. వాళ్ల పేర్లు కాశ్యుడు, కుశుడు. సునహోత్రుడి కొడుకు కనుక ఈయన్ని శౌనహోత్రుడు అని కూడా పిలుస్తారు. బ్రహ్మచారి, విప్రర్షి, శ్రీమంతుడు అని కూడా పేరుపొందాడు. బృహస్పతితో సమానమైన పాండిత్యం కలవాడు. కృత్సమదుని కుమారుడు కుచేతసుడు.

శ్రీమద్భాగవతములో కొన్ని చోట్ల ఈ క్రింద సూచించిన శ్లోకము ద్వారా కృత్సమద మహర్షి యొక్క ప్రస్తావన ఉంది.




కాశ్యః కుశో గృత్సమద ఇతి గృత్సమదాదభూత్।
శునకః శౌనకో యస్య బహ్వృచప్రవరో మునిః॥

**అగ్ని ద్వారా పొందిన వరాలు:**

కృత్సమదమహర్షి వేదవేదాంగాలు నేర్చుకున్నాడు. అగ్నిదేవుణ్ణి వేదమంత్రాలతో స్తోత్రం చేశాడు. అగ్నిదేవుడికి ఇష్టమైన యజ్ఞం చేశాడు.

గొప్ప భక్తుడైన కృత్సమదమహర్షి చేసిన యజ్ఞానికి అగ్ని ఆనందంతో మహర్షికి దివ్యశరీరం ఇచ్చాడు. త్రిలోకాల్లో తిరగగల శక్తి, భూమిమీద, ఆకాశంలోను, గాలిలోను మూడుచోట్ల మూడు శరీరాలు ధరించి తిరగగలిగే శక్తిని ఇచ్చాడు.

**ఇంద్రుడితో స్నేహం:**

ఇంద్రుడికి ఇద్దరు రాక్షస శత్రువులున్నారు. వాళ్ల పేర్లు ధుని, చుమురి. వాళ్లిద్దరికి ఇంద్రుణ్ణి చంపాలని కోరిక. కృత్సమదమహర్షి గొప్ప తేజస్సు కలవాడు. ఇంద్రుడి తేజస్సుతో సమానమైన తేజస్సు. ఒకసారి ఆ రాక్షసులిద్దరు ఇంద్రుణ్ణి చంపాలని అనుకున్నారు. కృత్సమదమహర్షిని చూసి ఇంద్రుడనుకుని మహర్షిని చంపడానికి వెళ్లారు,

మహర్షి ఇంద్రుడి గుణగణాలన్నీ వేదమంత్రాలతో వాళ్లకి తెలిసేలా చెప్పాడు. అదంతా విని రాక్షసులకి ఇంద్రుడంటే భయం పట్టుకుంది. ఇదంతా జరుగుతున్న సమయంలో ఇంద్రుడు అక్కడికి వచ్చాడు. తనని చంపడానికి వచ్చిన రాక్షసుల్ని, తన గురించి రాక్షసులకి వేదమంత్రాలతో చెప్పిన కృత్సమదమహర్షిని చూశాడు.

ఇంద్రుడు కృత్సమదమహర్షిని చూసి సంతోషంతో "మహర్షీ! ఇప్పటి నుంచి నువ్వు నాకు మంచి స్నేహితుడివి. నీకు ఏం కావాలన్నా ఇస్తాను, కోరుకో!" అన్నాడు.

మహర్షి "మహేంద్రా! నీ కటాక్షం వల్ల నాకు అన్ని ఐశ్వర్యాలు కలగాలి. నా మనస్సులో ఎప్పుడూ నువ్వు స్థిరంగా నిలిచి ఉండాలి. జన్మజన్మలకి నీ పాదాల మీద భక్తి ఉండేలా అనుగ్రహించు. మాఇంటికి వచ్చి నా ఆతిథ్యం స్వీకరించు" అన్నాడు.

ఇంద్రుణ్ణి వేదమంత్రాలతో స్తుతించాడు. మహేంద్రుడు, కృత్సమదమహర్షి మాట్లాడుకుంటూ ఉండగా అక్కడికి దేవగురువు బృహస్పతి వచ్చాడు. కృత్సమదుడు ఇద్దర్నీ విడివిడిగాను, ఇద్దర్నీ కలిపి స్తుతించాడు. ఇంద్రుడు, బృహస్పతి కృత్సమదమహర్షి తెలివితేటల్ని పొగిడారు.

ఒకసారి మహేంద్రుడు కృత్సమదమహర్షిని పరీక్షించాలనుకున్నాడు. పక్షిరూపంలో వచ్చి మహర్షి భుజం మీద వాలాడు. మహర్షి తన దివ్యదృష్టితో పక్షిరూపంలో వచ్చినవాడు ఇంద్రుడని గ్రహించాడు. ఇంద్రుణ్ణి పక్షీంద్రుడు అని స్తుతించాడు. ఇంద్రుడు కృత్సమదమహర్షి తనను గుర్తించాడని తెలుసుకుని నిజరూపంలో కనిపించాడు. మహర్షితో మిత్రమా! నువ్వు నిజంగా మిత్రుడవే. నువ్వు నా దగ్గరికి "ఎప్పుడేనా రావచ్చు, పోవచ్చు" అని చెప్పాడు.

ఇంద్రుడు ఒకసారి సహస్రవర్ష సత్రయాగం మొదలు పెట్టాడు. యాగం చేయించడానికి బృహస్పతిని పిలిచాడు. ఆయనకి సహాయంగా ఉండడానికి కృత్సమదమహర్షిని నియమించాడు. కృత్సమదమహర్షికి అంత గొప్ప పదవి దొరికినందుకు వశిష్ఠమహర్షికి అసూయ కలిగింది. చక్కటి ఉచ్చారణతో సామవేదం పఠిస్తూ యజ్ఞం చేయిస్తున్నాడు కృత్సమదమహర్షి.

వశిష్ఠమహర్షి కృత్సమదమహర్షిని నిందించాలనుకున్నాడు. "మహర్షీ! ఇంద్రుడు చేస్తున్న యజ్ఞానికి సామవేదాన్ని అపశ్రుతులతో ఉచ్చరిస్తున్నావు. పాపం వస్తుందని నీకు తెలియదా? మళ్లీ చెప్పు" అన్నాడు.

## వశిష్ఠుడు ఇచ్చిన శాపం:

కృత్సమదమహర్షి "అపస్వరాలు పలికితే పాపం నాదే అవుతుంది. అయినా అటువంటి పొరపాటు పనులు నేను ఎందుకు చేస్తాను. నేను సరిగానే చెప్తున్నాను" అన్నాడు.

"నేను మళ్లీ చెప్పమంటే నువ్వు చెప్పలేదు కాబట్టి నీకు వచ్చిన విద్యలన్నీ మరిచిపో. తిండి, నీరు లేకుండా అడవిలో క్రూరజంతువుగా ఉండు. అదే అడవిలో వేలవేల సంవత్సరాలు అలాగే బ్రతుకు" అని వశిష్ఠుడు కృత్సమద మహర్షిని శపించాడు.

కృత్సమదమహర్షి వెంటనే క్రూరజంతువుగా మారి ఎదురుగా ఉన్న ఈశ్వరుడి పాదాలమీద పడిపోయాడు.

## ఈశ్వరుడు ఇచ్చిన వరం:

ఈశ్వరుడు "మహర్షీ! నువ్వు చదివిన సామవేదం తప్పులు లేవు. నువ్వు వృద్ధాప్యము, రోగము, మరణము లేకుండా అన్ని దుఃఖాలకి దూరంగా చిరంజీవిగా ఉంటావు" అని వరమిచ్చాడు.

వశిష్ఠుణ్ణి పిలిచి కృత్సమదమహర్షికి క్షమాపణ చెప్పమన్నాడు పరమేశ్వరుడు. దేవతలు మహర్షి మీద పూలవాన కురిపించారు. ఇంద్రుడు మహర్షిని అభినందించాడు. వశిష్ఠుడు సిగ్గుపడి ఇకనుంచి అతడితో స్నేహంగా ఉంటానన్నాడు.

కృత్సమదమహర్షి గణపతి భక్తుడు. అందరికీ కనిపించే విధంగాను, మనస్సులోను గణపతిని పూజించి భక్తులందరిలో మొదటివాడయ్యాడు. గొప్ప భక్తుడైన కృత్సమదమహర్షి రోజుకి మూడుసార్లు విఘ్నేశ్వరుణ్ణి పూజించి తరించాడు.

### వైకుంఠపాళి
### :: 119 – సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1 బ | 2 క | ము | | 3 ధ | 4 ను | ర్మా | 5 సం |
| 6 వై | | రి | | 7 పు | | తి | | వ |
| 8 కుం | తి | | 9 నే | త్ర | ము | | 10 క | ర్త |
| ఠ | | 11 కో | | ద | | 12 మో | | ను |
| 13 ఏ | క | ప | ర్ణ | | 14 త | క్ష | కు | డు |
| కా | | ము | | 15 సా | | దా | | |
| 16 ద | య | | 17 వి | మ | లా | | 18 క | 19 దం |
| శి | | 20 ర | | వే | | 21 బా | | భు |
| | 22 క | వి | | 23 దం | త | వ | క్త్ర | డు |



# అభయహస్తం

– శ్రీమతి రాగిచెట్టు మంగలాబాయి

"యద్భావ్యం తద్భవతి' అన్న సూక్తి నిజము. మాది సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ గ్రామము. మా ఇంటి కులదేవత శ్రీరాముడు. ఇష్టదేవత శ్రీలక్ష్మీవేంకటేశ్వరుడు. ప్రతి శుక్రవారం వైభవలక్ష్మి పూజ చేస్తాను. ఆ తల్లిమీద అపార విశ్వాసం. ఆమె లేనిదే ఆయన లేడు.

కలియుగ ప్రత్యక్షదైవం సత్యాత్ముడు శ్రీవేంకటేశ్వరుడు. ఇంతకు ముందు మేము కష్టంలో ఉన్నప్పుడు ఆదుకున్నాడు. మేము హైదరాబాదులో పెళ్లికి వెళ్లాము. పెళ్లి తర్వాత బయల్దేరడానికి సాయంత్రం 4.30 అయింది. ఊరు చేరుకోవడానికి రాత్రి 11 గంటలయింది. మేము శ్రీరామమందిరం నారాయణఖేడ్ పూజారులం. పొద్దున్నే పూజచేయాలి కదా అని రాత్రిపూట కారులో బయల్దేరాము. కారులో కూర్చొని ఒంటిపైన ఉన్న సొమ్ములు జేబులో వేసుకున్నాను. అప్పుడు ఒక నగ కారులో పడిపోయింది. చూసుకోలేదు. ఇల్లు చేరాక చూసుకున్నాను. ఆదుర్దా పడ్డాను. నీవే దిక్కు ఏడుకొండలవాడా అన్నాను. రెండు, మూడుసార్లు ఇలా అన్నప్పుడు ఆయన విగ్రహమే కనులముందు వస్తున్నది. కుడిచేయి ఇలా కనబడితే "నా నగ నాకు ఇస్తున్నావా! తండ్రీ" అన్నాను.





అప్పుడు నాకు ఒక మాట జ్ఞాపకం వచ్చింది. శ్రీరాముడు సీతను వెతుకుతు జగదాంబ మారువేషంలో ఆయన ముందు వచ్చిందట. అప్పుడు శ్రీరాముడు "అమ్మా! జగదాంబ! భవాని!" నువ్వు ఎదురువచ్చావు. కాబట్టి నా సీత నాకు తప్పక కనబడతది అన్నాడట. అట్ల నీవు మళ్లీ మళ్లీ కనబడి చేయి చూపుతుంటే నా నగ నాకు దొరుకుతుందని విశ్వాసం కలుగుతోంది అనుకున్నాను.

ఫోన్ చేసి నా మరిదిని కారులో కొంచెం చూడవా అన్నాను. ఆ కారు తిరిగిపోయింది. రేపు చూస్తా అన్నాడు. ప్రొద్దున్నే చూశాడట. సొమ్ము కారులోనే ఉంది. "నాకు చేయి చూపి నా సొమ్ము నాకు ఇచ్చావు ఏడుకొండలవాడు" అన్నాను. ఎంత దయామయుడవు! ఎంత సత్యాత్ముడవు! నా సొమ్ము నాకు ముట్టజెప్పావు తండ్రీ!" అన్నాను.

తిరుమలలో ఒకసారి దారితప్పి గాబరాపడ్డాను. తండ్రీ నీవే దిక్కు అన్నాను. వెనకాల ఒకాయన వచ్చి 'ఏంటమ్మా ఎటువెళ్ళాలి?' అని అడిగాడు. రాంబగీచా నంబర్ 3కు పోవాలండీ అన్నాను. ఇక్కడే ఇదేనమ్మా అని చిరునవ్వు నవ్వాడు. టపీమని చూపాడు. ఇదేనండీ ఆ సత్రం అన్నాను. వెనుకాల తిరిగి ధన్యవాదాలు చెపుదామని చూశాను. ఆయన లేడు ఏడుకొండలవాడా! నీవే రక్షించావని అనుకున్నాను.

ధారావాహిక



# మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు


ఆంగ్ల మూలం- శ్రీ లక్ష్మీనరసింహన్ శ్రీధర్

తెలుగు- శ్రీదేవీ మురళీధర్

97388 59553


*గత సంచిక తరువాయి భాగం....*

అప్పుడు స్వామి ముదలి ఆండన్ చెవిలో ఏదో మంత్రం పఠించి, సాయంత్రం సరస్సులో తన కాలు ముంచి రమ్మని ఆదేశించారు. ముదలి ఆండన్ ఆ విధంగానే చేశాడు. మరుసటిరోజు యాత్రికులు సరస్సులోని నీటిని స్పృశించినప్పుడు వారికి ఆత్మసాక్షాత్కారం కలిగింది. భక్తులందరిలో హృదయ పరివర్తన కలిగి తమను తాము రామానుజులకు అనుచరులుగా సమర్పించుకున్నారు. ఇంతలో కొంతమంది కుతూహలంతో రామానుజులు కూర్చున్నచోట తెరను తొలగించి చూడగా వెయ్యిపడగల ఆదిశేషుడు అక్కడ ఉపస్థితుడై ఒక్కొక్కరి ప్రశ్నలకు సమాధానం చెప్పటం కనిపించింది. అంటే ఆచార్య సార్వభౌములు తమ నిజరూపంలో అక్కడ ప్రకటమైనారు.

తరువాత కొంతకాలానికి స్వామి తాము నిత్యం ధరించే తిరుమాన్ కాపు తరిగిపోతున్నదని గ్రహించి ఆందోళన చెందారు. తిరునారాయణస్వామి స్వప్నదర్శనం సాక్షాత్కరించి కళ్యాణితీర్థం వద్ద తిరుమాన్ కాపు పుష్కలంగా లభిస్తుందని తెలియజేశారు. విష్ణువర్ధనుని దీవించి అక్కడి నుంచి బయలుదేరి రామానుజులు యదుగిరికి చేరుకుంటారు.

ఆచార్యులు వేదపుష్కరిణికి వెళ్లి, చక్కగా స్నానం చేసిన తరువాత తన శ్వేతవస్త్రాలు విడిచి కొత్త కాషాయాంబరం, త్రిదండం ధరిస్తారు. ఇప్పటికీ సంప్రదాయం ప్రకారం తిరు నారాయణపురం వచ్చే ఏ యతివర్యులైనా వేదపుష్కరిణిలో స్నానం చేసి మొదట కొత్త కాషాయవస్త్రం ధరించిన తరువాతనే భగవానుని సేవించటానికి వెళతారు; అంతేగాక గురువు లేని వారెవరైనా సన్న్యాసం తీసుకోవాలనుకుంటే, వేదపుష్కరిణిలోని దత్తాత్రేయ సన్నిధికి చేరుకుంటారు. ఇప్పుడు యతిరాజుల ముఖంలో ప్రకాశవంతమైన కొత్త కాంతి ఉజ్జ్వలించింది; ఆయన కల్యాణితీర్థంలో స్నానం చేసి, తిరుమాన్ కాపు ధరిస్తారు. తిరునారాయణుడు చెప్పినట్లుగా తిరునారాయణపురంలోని ప్రతి ప్రదేశం శ్వేతదీపంలాగా తిరుమాన్ కాపుతో నిండి ఉంది. తరువాత రామానుజులు నరహరిని దర్శిస్తారు; తిరునారాయణ స్వామి కోసం వెదికితే ఆయన కనిపించడు. సెల్వనారాయణుడు కలలో వచ్చి అక్కడికి రమ్మని ఆజ్ఞాపించాడు కదా మరి కనిపించడేమి? యతిరాజులు అలసిపోయి, కల్యాణితీర్థం ఒడ్డున కూర్చుని కునుకు తీస్తారు. అప్పుడు స్వప్నదర్శనంలో భగవానుడు తులసి పొదలలో మధ్య చీమలపుట్ట కింద ఉన్నట్లు, ఆలయం శిథిలావస్థలో ఉన్నట్లు కనిపిస్తుంది. యతిరాజు వెంటనే 1000 ఘటాలలో పాలు తీసుకురమ్మని తొండ నూరుకు కబురు పంపుతారు. వెంటనే పాలు తీసుకురాగా, చీమలపుట్టలో పాలు పోయడం ప్రారంభిస్తారు. బురద కరిగిపోవడం మొదలై, క్రమంగా తిరునారాయణుడు తన ముఖమండలాన్ని దర్శింపజేస్తాడు. మూర్తి సంపూర్ణంగా ప్రకటమౌతుంది. ఆచార్యులు మూర్తి అందానికి ముగ్ధులైనారు.

తిరునారాయణపురంలో స్వామి చిన్నబాలుడిగా దర్శన మిస్తారని శ్రీకరస్వామి చెబుతారు. కృష్ణావతారంలో ప్రకటమైన బాలుడిగా బొద్దుగా, ముద్దుగారుతూ కనిపిస్తాడు. భగవద్రా మానుజుల పుట్టిల్లు కాంచీపురమని, అత్తవారిల్లు శ్రీరంగమని, తిరునారాయణపురం ఆయన మాతృత్వం పొందిన స్థానమని శ్రీకరస్వామి వర్ణిస్తారు. ఇక్కడ ఆచార్యులదే ప్రథమ స్థానమని, ఉత్సవాలలో కూడా వారినే ముందు తీసుకువెళతారని, తల్లి వెనుక పిల్లవాడిలాగా సెల్వనారాయణుడు ఆచార్యులను అను సరిస్తాడని చెబుతారు. 12 సంవత్సరాలు ఇట్టే గడిచిపోయాయి. ఆచార్యులు పన్నెండు వేల మంది శ్రీ వైష్ణవులను మేల్కోటేకు తీసుకువచ్చారు. విష్ణువర్ధనరాజు సహాయంతో ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించి, ఆలయ పూజావిధానాన్ని స్థిరపర చారు. అన్ని ఉత్సవాలు జరుగుతున్నా కానీ వారి ఉత్సవ విగ్రహం లేదు. పురాణాలు ఇక్కడ రామప్రియ అనే ఉత్సవ మూర్తి ఉన్నాడని చెబుతున్నాయి. *(ఇంకా ఉంది)*

# హనుమ ద్వారా మనం నేర్చుకోవాల్సినవి

- శ్రీ సురేశ్ కుమార్ రెడ్డి, 99858 31828

**01) ఎవరిని / దేనిని ఆశ్రయించావు?**

ధర్మం తెలిసిన బ్రాహ్మణుడు రావణుడు. అపారమైన శివభక్తుడు. అయినా పరకాంతలయందు పరుల సొమ్ము నందు వాంఛను చంపుకోలేకపోయాడు. చివరకు రాముని ఒక్క బాణంతో పదితలలు కూలి మట్టిలో కలిసిపోయాడు. ధర్మమూర్తి అయిన శ్రీరాముని పాదాలను పట్టి ఆశ్రయించి, ఆయన బాటయందు నడిచిన "స్వామి హనుమ" చిరంజీవిగా మిగిలిపోయారు. చరిత్రలో నిలిచిపోయారు.

"జీవితంలో ఏదైనా సాధించాలి అని అనుకున్నప్పుడు దేన్ని పట్టుకోవాలో, దేన్ని విడిచిపెట్టాలో తెలియాలి. సరైన మార్గాన్ని తెలుసుకోవాలి. తెలియడం కాదు, పాటించే దమ్ము కూడా ఉండాలి."

**2. మైత్రి యొక్క విలువ!**

వంచనతో బలంతో భార్యను, భూమిని, బలగాన్ని తనవైపు తిప్పుకున్న వాలికి మంత్రిగా హనుమ ఒక్క నాటికి లేరు. తన దారి తానూ చూసుకోలేదు. న్యాయం వైపుగా సుగ్రీవుడి పక్షాన్నే నిలిచి ఉన్నారు.

"జీవితంలో కష్టాలు సుఖాలు రెండూ పంచుకునే మంచి మిత్రులు దొరకడం చాలా కష్టం.నిజంగా అలాంటి వాళ్ళు దొరికినప్పుడు వాళ్ళని ఎన్ని కష్టాలొచ్చినా విడిచి పెట్టకండి."

**3) అహం బ్రహ్మాస్మి- నేనే గొప్ప అని అనకు!**

నాదేం లేదు... అని అనగలిగే గొప్ప స్వభావం కలిగి ఉండాలి! లంకకు వెళ్ళే ముందు హనుమ ఇలా అంటారు..!

"నేను తలచుకుంటే నా శరీరాన్ని అమాంతం పెంచి వంగి ఒక్క చేత్తో అవతలి లంకా తీరాన్ని అందుకోగలను, అంత బలం ఉంది. కాని నేను ఎలా వెళ్తానో తెలుసా? నా స్వామి రామచంద్రమూర్తి యొక్క కుడిచేత్తో తన భుజం వెనుకనున్న అక్షయ బాణ తూణీరంలో నుండి తీసిన బాణాన్ని తన ఎడమ చేతిలో నున్న బంగారు వింటినారికి సంధించి ఆకర్ణాంతం లాగి విడిచి పెడితే ఆ బాణం ఎలా వెళుతుందో అలా దూసుకెళతాను. అది నా శక్తి కాదు! రాముడిచే విడవబడితే



రాముడిశక్తి ఆ బాణంలో కెళ్ళి బాణం వెళుతుంది! అటువంటి రామబాణంలా వెళతాను!" నేను, నా బలం వల్ల, ఇదంతా నేనే చేశాను - అని హనుమ ఒక్కసారి కూడా అనలేదు.

### 4) నీ మీద నమ్మకం ఉండేలా బ్రతుకు!

కొన్ని లక్షల వానరసేన! నూరు యోజనముల సముద్రం! జాంబవంతుడు సహా ఎందరో అతిరథ మహా రథులు! తలచుకుంటే కాని పని కాదు! కాని రాముడు నమ్మింది... అందరూ సూచించింది "హనుమనే"! "నిన్ను నమ్మి పని అప్పగించి.. గుండెలపై చెయ్యేసుకుని హాయిగా నిద్ర పోయేలా బ్రతుకు!"

### 5) మోసం చేసేవాళ్ళు ఉంటారు. నువ్వు మోసపోకు.. ఆగిపోకు.. ముందుకు మరో అడుగేసి సాగిపో!

హనుమ సముద్రం దాటుతూ ఉండగా, ఒక అందమైన బంగారుపర్వతం పైకి లేచింది! "స్వామి! మీరు చాలా దూరం ప్రయాణం చేసి అలసి ఉన్నట్లు కనబడు తున్నారు..! కాసేపు నా ఈ పర్వతం పై కూర్చుని విశ్రాంతి తీసుకుని, ఇక్కడ ఉన్న పళ్ళు కాయలు తిని వెళ్ళండి" అని అంటుంది. హనుమ "సముద్రంలో బంగారు పర్వతమా? మాయలా ఉంది? ఇది నాకు విఘ్నమని" ఆలోచిస్తుండగా, అది మైనాక పర్వతంగా గుర్తించి, ఆ పర్వతాన్ని చేత్తో ప్రేమగా తాకి, లంకానగరం వైపుగా వెళ్ళిపోయారు. "చేసే పనిలో



**శ్రీవారిఆలయంలో స్వామిని మనసులో 'గోవింద..! గోవింద..!!' అని స్మరిస్తూ దర్శించాలి.**

గమ్యాన్ని చేరుకోవడంలో ఎలాంటి అడ్డంకులున్నా ప్రయాణం ఆపకూడదని హనుమ చేసుకున్న ప్రమాణం."

### 6) లక్ష్యం తప్ప మరేదీ కనబడకూడదు

హనుమ, లంకలో సీతమ్మకోసం వెతుక్కుంటూ రావణాసురుని అంతఃపురంలోనికి ప్రవేశించగా కొన్ని వందల మంది స్త్రీలు వివస్త్రలుగా, సురాపానం చేసి మత్తులో ఒకరిపై ఒకరు పడి అడ్డదిడ్డంగా పడి ఉన్నారు. లెక్కలేనన్ని పళ్ళు, మధురపానీయాలు, నేలపై పడి పారుతూ ఉన్నాయి. వారి ఒంటిమీద బంగారునగలు నేలంతా పడి ఉన్నాయి.

ఇవన్నీ చూస్తున్నా, హనుమ ఒక్కింత కూడా చలించ లేదు. ఆతని మనసులో ఉన్నది ఒక్కటే! నా తల్లి సీతమ్మ ఎక్కడ ఉందో? ఎన్ని కష్టాలుపడుతోందో అని వేదన చెందాడు. వెంటనే ఆ స్థలాన్ని దాటి సీతమ్మను వెతుక్కుంటూ వెళ్లారు హనుమ.

"లక్ష్యం సాధించడంలో గురి... చేసే పనిలో పట్టుదల, పడే శ్రమలో తపన ఉంటె, మన చుట్టూ ఏమున్నా కనపడవు."

### 7)పెద్దరికాన్ని గౌరవించు

రావణుడు హనుమను బంధించి తీసుకు రమ్మన్నపుడు రాక్షసులు ఎన్నో విధాలుగా ప్రయత్నించగా, చివరకు ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తాడు.

నిజానికి బ్రహ్మాస్త్రం హనుమను ఆపలేదు. హనుమ బ్రహ్మాస్త్రాన్ని గౌరవించి కట్టుబడ్డారు! రావణసభలో అంతే సులువుగా ఆ తాళ్లను విడిపించుకున్నారు. "పెద్దలకు నువ్విచ్చే గౌరవం నలుగురిలో నీ గౌరవాన్నే పెంచుతుంది".

హనుమ కథలో వెతుక్కుంటూపోతే మన జీవితానికి కావల్సిన పాఠాలు ఎన్నో దొరుకుతాయి. ప్రతి ఊరి పొలిమేరల్లో గద పట్టుకుని నిలబడి "ఏం భయం లేదు రా! నీకు తోడుగా నేనున్నానులే! పద!!"..అని తెలిపే ఆంజనేయ విగ్రహాలే...

*॥ జై హనుమాన్ ॥*

### 2026, జనవరి నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 01 | ఆంగ్ల సంవత్సరాది |
| 07-13 | శ్రీఆండాళ్ నీరాట్టోత్సవం |
| 14 | భోగిపండుగ |
| 15 | సంక్రాంతి పండుగ |
| 16 | కనుమ, గోదాదేవి పరిణయోత్సవం |
| 23 | వసంతపంచమి |
| 25 | రథసప్తమి |

# భగవద్గీత-యువత

- డా॥ కె.అరవిందరావ్, ఐ.పి.ఎస్.(రిటైర్డ్)

'భగవద్గీత-యువత' అనే శీర్షిక చాలా మందికి ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. భగవద్గీతకు యువతతో ఏం సంబంధం ఉన్నది? భగవద్గీతను వినేదంతా రిటైర్డ్ అయిన వాళ్లే కదా! అనే భావన మన మనసులో ఉంటుంది. ఒక విద్యార్థి చేతిలో భగవద్గీత ఉంటే- "ఇప్పటి నుండి భగవద్గీత ఎందుకు? దానికి ఇంకా చాలా సమయం ఉంది" అని చెప్పే తల్లిదండ్రులే ఉన్నారు. మామూలుగా భగవద్గీతను సన్యాసులు స్వామీజీలు చెపుతుంటారు. కాబట్టి మన మనసులో వెంటనే ఇలాంటి భావన వస్తుంది. కానీ భగవద్గీతను ఎవరు ఎవరికి చెప్పారు? ఏ సందర్భంగా చెప్పారు? అన్న విషయాన్ని మనం మర్చిపోతాం. భగవద్గీతను ఒకానొక యోధుడు మరొక యోధుడికి యుద్ధరంగంలో చెప్పాడు. అతని ధర్మాన్ని గురించి చెప్పాడు. ధైర్యంగా తన ధర్మాన్ని ఆచరించమని చెప్పాడు. ధర్మయుద్ధం చేయమని చెప్పాడు.

దానిపై యోధుడైన అర్జునుడికి అనేకసందేహాలు రావడం వల్ల, ధర్మం అంటే ఏమిటి? అనే ఒక విశాల నేపథ్యంలో శ్రీకృష్ణుడు దాన్ని వివరించి చెప్పాడు. మనిషి అంటే ఏమిటి? ధర్మం అంటే ఏమిటి? అంటూ ఒక పెద్ద దృశ్యాన్ని అర్జునుడి ముందు ఉంచాడు. ఇది భగవద్గీత సందర్భం. జీవితంలో విజయాన్నో లేక పరాజయాన్నో పొందిన ముసలి వాళ్లను ఉద్దేశించి చెప్పింది కాదు ఈ భగవద్గీత. జీవితంలోని సంఘర్షణలని ఎదుర్కొనిపోరాడుతున్న యువతకు ఈనాడు అన్నిటికన్నా ఎక్కువ అవసరం ఈ గ్రంథం.



ప్రస్తుత సమయంలో సామాజిక మాధ్యమం విజృంభించడం వల్ల వివిధ సంప్రదాయాల వారు తమ తమ సంప్రదాయాల గొప్పదనాన్ని ప్రచారం చేసుకుంటూ హిందూసంప్రదాయాన్ని అనేక విధాలుగా కించపరచడం జరుగుతోంది. హిందూ సంప్రదాయం గురించి ఇలాంటి అవగాహన మన యువతకు లేదు. తల్లిదండ్రులు ఏదైనా గుడికి వెళ్ళినప్పుడు వారితో పాటు వెళ్లడం, ఏదో కోరిక కోరుకుని రావడం తప్ప వీరికి సంప్రదాయం యొక్క మూలసిద్ధాంతాల గురించి ఎలాంటి అవగాహన లేదు.

అయితే, హిందూసంప్రదాయం యొక్క మూలసిద్ధాంతాన్ని తెలుసుకోవడం ఎలా? మనకు 'వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు' మొదలైన అనేక గ్రంథాలున్నాయి. వాటిలో దేన్ని చదవాలి? సమాజంలో అనేక సంప్రదాయా లున్నాయి. ప్రతి ఒక్కరూ తమ సంప్రదాయాన్ని గొప్ప అని చెప్పుకుంటుంటారు. అలాంటప్పుడు ఏది సత్యం అని తెలుసుకోవాలంటే మన సంస్కృతికి మూలగ్రంథాలైన ఉపనిషత్తులు, వేదాలని చదవాలి. వాటిని మనం చదివి అర్థం

చేసుకోవడానికి జీవితకాలం పడుతుంది. వాటన్నిటి సారం అన్నట్టుగా కురుక్షేత్ర యుద్ధ సమయంలో శ్రీకృష్ణుడు అర్జునుడికి కొన్ని విషయాల్ని బోధించాడు. దాన్నే **"భగవద్గీత"** అంటున్నాం. దానిలో మనిషి అంటే ఏమిటి? ప్రపంచంలో మనం చేసే అనేకపనుల్లో పుణ్యము, పాపం అంటే ఏమిటి? సృష్టి ఎలా జరిగింది? భగవంతుడు అనే ఒక వ్యక్తి ఉన్నాడా లేదా? అది ఒకానొక చైతన్య స్వరూపమా? భగవంతునికి మనిషికి ఉన్న సంబంధం ఏమిటి? మొదలైన ప్రశ్నలన్నింటికీ సమాధానం అందులో దొరుకుతుంది.

మొట్టమొదటగా దేవుడు అంటే ఏమి? అని శాస్త్రీయంగా ఆలోచించి చెప్పింది భారతీయ సంప్రదాయం ఒక్కటే. దేవుడు అనే ఒక వ్యక్తి ఆకాశంలో స్వర్గం అనే ఒకానొక చోట ఉంటాడని, ఆయన మనల్ని పరిపాలిస్తుంటాడని అనుకోవడం చాలా ప్రాథమిక స్థాయిలోని ఆలోచన. ఐదవ క్లాసు విద్యార్థి చేయవలసిన ఆలోచన ఇది. అలా కాకుండా ఉపనిషత్తులు చాలా శాస్త్రీయంగా ఆలోచించి అన్నింటికీ మూలమైన తత్త్వం ఒకే శుద్ధ చైతన్య తత్త్వం అని వివరిస్తాయి. దీన్ని ఒక వ్యాసంలో చెప్పడం కుదరదు. దీనికి మనం భగవద్గీతను అవశ్యం చదవాల్సి ఉంటుంది.

విశ్వమంతా వ్యాపించి ఉన్న ఒకే ఒక తత్త్వం ఇది. ఈ తత్త్వంలో మనం ఏ రూపంలో, ఏ పేరుతో భగవంతుని భావించుకున్నా పరమాత్మతత్త్వం ఆ రూపంలో మనల్ని అనుగ్రహిస్తుంది అని ఉపనిషత్తులు చెప్పడం ఒక గొప్ప ఆశ్చర్యకరమైన సిద్ధాంతం. మనకు అనేక దేవుళ్లు ఉండడానికి కారణం మనం ఆయా సంప్రదాయాలని నాశనం చేయక పోవడమే. అంతేగాక శ్రీకృష్ణుడు ఇంకా ఒక అడుగు ముందుకు వేసి నీవు మిగతా ఏ దేవుళ్లను పూజించినా నన్ను పూజించినట్లే అని అంటాడు. ఇది మరింత ఆశ్చర్యకరమైన సిద్ధాంతం. మరొక ఆశ్చర్యకరమైన విషయం ప్రపంచంలో ప్రతి ప్రాణిలో కూడా పరమాత్మతత్త్వం ఉంది అని చెప్పడం. మనలో ఉన్న పరమాత్మతత్త్వాన్ని మనం తెలుసుకోవడానికి కృషి చేయాలి అని భగవద్గీత చెబుతుంది. ఇంత గొప్ప విషయాలు మన సిద్ధాంతంలో ఉన్నట్లు మనలో ఎంతమందికి తెలుసు?

సందర్భానుసారంగా గీతలో సంఘవ్యవస్థ అనేదాన్ని గురించి కూడా వివరించబడింది. ఈనాడు మనస్తత్వవేత్తలు మనుషుల మనస్తత్వాన్ని పరిశీలించినట్లుగానే మన పూర్వీకులు కూడా మనిషి స్వభావాన్ని విశ్లేషించారు.

ఈ స్వభావం మూడు విధాలుగా ఉంటుంది. ఒకడు సంతృప్తిగా ఉంటూ జ్ఞానాన్ని పొందడంలో ఆసక్తి కలిగి ఉంటాడు. ధర్మాన్ని ఆచరిస్తూ ఉంటాడు. ఇంకొకడు జీవితంలో ఎప్పుడూ ఏదో సాధించాలని కోరడం, లేదా ఇంకా ఇంకా సంపాదించాలని కోరడం చేస్తుంటాడు. మరొకడు కేవలం ఇతరులు చెప్పిన పనుల్ని చేసే స్థితిలోనే ఉంటూ సొంతంగా ఆలోచించలేని స్థితిలో ఉంటాడు. ఈ మూడురకాల స్వభావాలను **'సత్త్వగుణం'**, **'రజోగుణం'**, **'తమోగుణం'** అని వివరించారు.

ఈ మూడు గుణాల ఆధారంగా సంఘంలోని వ్యవస్థలను మాత్రమే చెప్పారు. కానీ మనం ఈనాడు చూస్తున్నట్టుగా సమాజంలో ఉన్న వేలకొద్దీ ఉన్న సంఘవ్యవస్థలను ఏ దేవుడూ సృష్టించలేదు, శ్రీకృష్ణుడూ సృష్టించలేదు, ఏ ఋషీ కూడా సృష్టించలేదు. హిందూసంప్రదాయం సంఘవ్యవస్థలను సృష్టించింది ఇతర దేశస్థుల పాలన సమయంలో వారు చేసిన ప్రచారాన్ని మనం నమ్ముతున్నాము గాని, మన పుస్తకాల్లో ఏముందో తెలుసుకోవడం లేదు.

మన సమాజంలో అనేక సంఘర్షణలకు కారణమైన ఈ విషయాన్ని అనేకమంది ఆచార్యులు తమ ప్రవచనాల్లో చెబుతూనే ఉన్నారు. సంఘవ్యవస్థ అనేది వివిధ సందర్భాల్లో సామాజిక పరిస్థితిని అవసరాలను బట్టి ఏర్పడిందని మనం గ్రహించడం లేదు.

ఏ వ్యక్తి అయినా, ఏ సమాజమైనా ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. భారతీయ సమాజం ముఖ్యంగా హిందూసంప్రదాయం ఆత్మవిశ్వాసంతో గర్వంగా ప్రపంచంలో నిలబడాలంటే "భగవద్గీత"లోని విజ్ఞానం చాలా అవసరం. అది ముఖ్యంగా యువతకు అవసరం.

*"కృష్ణం వందే జగద్గురుమ్"*



# 'సత్సంగ' ఉద్దేశ్యం

బాలనీతి

- శ్రీ మణికంఠసాయి

ఒక వ్యక్తి పట్టణంలో జరుగుతున్న సత్సంగానికి ప్రతి రోజు వెళ్ళుతుండేవాడు. ఆ వ్యక్తి ఒక చిలుకను పంజరములో ఉంచి పోషించేవాడు. ఒక రోజు చిలుక తన యజమానిని అడిగింది, 'మీరు ఎక్కడకు రోజు వెళ్తున్నారు' అని?

అతను ఇలా అన్నాడు, "మంచి విషయాలు తెలుసుకోవడానికి నేను రోజూ సత్సంగానికి వెళతాను."

"మీరు నాకు ఒక సహాయం చేయగలరా?" అని అడిగింది ఆ చిట్టిచిలుక ఆ యజమానిని. "నేను ఎప్పుడు స్వేచ్ఛ పొందగలను అని మీ గురువు గారిని అడిగి చెప్పండి" అని.

మరుసటి రోజు, యజమాని సత్సంగానికి వెళ్ళాడు. సత్సంగం ముగిసిన తర్వాత, అతను గురువు దగ్గరకు వెళ్లి, "గురువుగారూ! నా ఇంటిలో ఒక చిలుక ఉంది, అది స్వేచ్ఛ ఎప్పుడు పొందగలదో మిమ్మలను అడిగి తెలుసుకోమని ప్రాధేయపడింది" అని. అది విన్న వెంటనే, గురువుగారు అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయారు. ఇది చూసిన చిలుక యజమాని భయపడి, నిశ్శబ్దంగా అక్కడ నుండి వెళ్ళిపోయాడు.




అతను ఇంటికి చేరుకొన్నాడు. అతని చిలుక అతనిని అడిగింది, 'మీరు నా ప్రశ్నను గురువుగారిని అడిగారా?' అని.

యజమాని బదులిచ్చాడు– 'నేను అడిగాను కానీ నీ అదృష్టం బాగాలేదు. నేను నీ ప్రశ్న అడిగిన వెంటనే, గురువు గారు అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయారు' అని. "సరే! సరే!! నేను అర్థం చేసుకున్నాను" అన్నది ఆ చిలుక.

మరుసటి రోజు సత్సంగానికి వెళ్తూ, యజమాని పంజరంలో ఉన్న చిలుక అపస్మారకస్థితిలో ఉండడాన్ని చూశాడు. యజమాని పరీక్షగా చూసి చిలుక చనిపోయిందనుకుని బయటకు తీసాడు. దానిని నేలమీద ఉంచాడు. వెంటనే ఆ చిలుక రివ్వుమంటూ ఎగిరిపోయింది. చేసేది లేక సత్సంగం కోసం మామూలుగా వెళ్లాడు ఆ యజమాని.

గురువు అతనిని చూసి, దగ్గరకు పిలిచి, "నీ చిలుక ఎక్కడ ఉంది?" అని అడిగాడు.

"నేను ఉదయం సత్సంగానికి వచ్చేటప్పుడు, నా చిలుక అపస్మారకస్థితికి గురై, పంజరంలో పడి ఉంది. దాని ఆరోగ్యం తనిఖీ చేయడానికి నేను పంజరం తెరిచి దానిని నేలమీద ఉంచినప్పుడు, అది పారిపోయింది" అని దిగులుగా చెప్పాడు.

గురువు నవ్వి, "మీ చిట్టిచిలుక మీ కన్నా ఎక్కువ తెలివిగలది. అది నేను ఇచ్చిన చిన్న సూచన అర్థం చేసుకుని ఆచరణలో పెట్టి స్వేచ్ఛను పొందగలిగింది. కానీ, మీరు చాలా రోజుల పాటు సత్సంగానికి వస్తూ కూడా సాధన చేయక, ఈ ప్రపంచంలోనే 'భ్రమ' అనే పంజరంలో చిక్కుకొని ఉన్నారు." అని అన్నాడు.

యజమాని సిగ్గుతో తలదించుకొన్నాడు. దూరం నుంచి చిలుక గురువుకు కృతజ్ఞతలు తెలుపుకుంది.

**నీతి:** **సత్సంగం యొక్క ఉద్దేశ్యం కేవలం భక్తికోసం కాదు, కాలక్షేపం కోసం కానే కాదు. అజ్ఞానం నుండి, అంధకారం నుండి, భ్రమ నుండి మనం బయటపడి స్వేచ్ఛగా విముక్తులమై దైవానికి చేరువకావడం కోసం అని గ్రహించాలి.**

**చిత్ర కథ**

# తిరుమంగై ఆళ్వార్

కథ- శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- శ్రీ కె.ద్వారకనాథ్

ద్రవిడదేశంలోని తిరుకురైయలూర్ అనే చిన్న గ్రామంలో తిరుమంగై రాజ్యానికి రాజుగా జన్మించాడు. కార్తికమాసం కృత్తికా నక్షత్రంలో పుట్టిన ఆయన అసలు పేరు నీలన్. రాజైన తిరుమంగై కుముదవల్లిని అనురాగంతో చూస్తూ ఆమెతో....






సర్వే జనాః సుఖినో భవన్తు

## విశ్వదాభిరామం      వేమన పద్యసూక్తి



# లోభిని యాచించగూడదు

గొడ్డుటావు బితుక కుండ గొంపోయిన,
పండ్ల నూడ దన్ను; పాల నీదు;
లోభివాని నడుగ లాభంబు లేదయా!
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** పితుకు= పిండు; కొంపోయిన= తీసుకొని పోయిన; లోభి= పిసినిగొట్టు; లాభంబు= ప్రయోజనం.

**భావం:** పాలు పితుక్కుందామని, గొడ్డుటావువద్దకు పోతే, అది పాలు ఇవ్వదు సరికదా, పండ్లు రాలేటట్లు తంతుంది. ఆ విధంగానే లోభివాడిని ఎంత అడుక్కున్నా ప్రయోజనం ఉండదు.

**వివరణ:** సంతానం లేని ఆవు పాలివ్వదు. పైగా తంతుంది. ఆ విషయం గ్రహించి, పాలకోసం దానిదగ్గరకు పోగూడదు. అలాగే దానం చేసే గుణం లేదని తెలిసి, వాడిదగ్గరకు వెళ్లి దానం అడగగూడదు. దానం చేసేగుణం లేనివాడిని అడిగితే వాడు ఎందుకు చేస్తాడు. పైగా, తిట్టి పంపిస్తాడు.

ఏ కార్యం అయినా, అది చేయగలిగిన సమర్థుడిని ఆశ్రయించాలి. చేతకానివాడిని ఆశ్రయించినందువలన ప్రయోజనం ఉండదు. అన్నివిషయాలలోనూ ఈపద్ధతిని అనుసరించాలి.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

## భాస్కరశతకం

# సామర్థ్యం లేని వాని ఇంట్లో సంపద నిలవదు

ఉ. దక్షుఁడు లేని యింటికిఁ బదార్థము వేఱొకచోట నుండి వే
లక్షలు వచ్చు చుండినఁ బ లాయనమై చనుఁ గల్లగాదు ప్ర
త్యక్షము వాఁగులున్ వఱద లన్నియు వచ్చిన నీరు నిల్చునే
యక్షయమైన గండి తెగి నట్టి తటాకములోన భాస్కరా!



**తాత్పర్యం**

భాస్కరా! గండి పడిన చెరువులోకి ఎన్ని వాగులు, వరదలు వచ్చి చేరినను నీరు నిలువవుండదు. కుటుంబ బాధ్యత సమర్థతగా నిర్వహించు యజమాని లేని ఇంటికి వేరొక చోటు నుండి ధనము లక్షలకొలది వచ్చినా నిలవ ఉండదు. ప్రయోజనం లేదు.

– వ్యాఖ్యాత: శ్రీ పి.వి.కే.ప్రసాదరావు

## అక్టోబరు నెల క్విజ్ – 39 సమాధానాలు

| | |
|---|---|
| 01) భక్తమార్కండేయుడు | 09) అయోధ్యుడు |
| 02) పరమశివుడు | 10) అర్జునుడు |
| 03) శ్రీరామానుజాచార్యులు | 11) మన్మథుడు |
| 04) కైలాసగిరి | 12) సత్యభామ |
| 05) బమ్మెర పోతనామాత్యుడు | 13) బ్రహ్మ |
| 06) ప్రాచీనధర్మం | 14) అగ్నిహోత్రం |
| 07) 84 లక్షలు | 15) సూర్యభగవానుడు |
| 08) చంద్రగ్రహం | |

**సరైన సమాధానాలు వ్రాసినవారు–**

1)మేడపాటి కీర్తిక, కుతుకులూరు 2)జి.అతులిత్ రెడ్డి, హైదరాబాదు 3)తేతలగీతిక, కుతుకులూరు 4)జి.వి.ఎస్.ప్రసాద్, యానాం 5)యామర్తి శ్రీనివాస సత్కృత్, బెంగుళూరు 6)ఎం.వి.లాలస అనన్యశర్మ, కడప 7)కె.పూజిత, విజయవాడ 8) కొల్లూరి శరవణకేదారేశ్వరి, పెద్దాపురం 9)జ్యాగంటి చాధివిక్, ధర్మవరం 10)చారుకొండ హిషికప్రియ, అనంతపురం 11)భువన శెట్లం, కర్నూలు 12)జె.లక్ష్మణవీర్, కుప్పం 13)కాండూరి శ్రీచరణ్, కోదాడ 14)వై.సాయివాణి, బెంగళూరు 15)సుంకరి మణిదీప్, మెదక్ 16)పైడి లక్ష్మిశ్రీ అన్విత, విశాఖపట్నం 17)గొలివి కౌండిన్య క్రిష్ణం నాయుడు, పూడివలస 18)బి.షణ్ముఖవిరాట్ శర్మ, బెంగుళూరు 19)భట్టిప్రోలు సూర్యక్రిష్ణ విరాజశర్మ, బెంగుళూరు.

# క్విజ్ 41

01) పుష్కరిణి ఒడ్డున ఉండే భవనాలు? జ).................................

02) భారతీయ సంస్కృతిలో దేని స్థానం ప్రధానమైనది? జ).................................

03) పరమాత్మ తత్త్వాన్ని ప్రతీకలుగా తెలియజెప్పే గ్రంథం? జ).................................

04) ఆత్మసౌందర్యంతో వ్రతం చేసింది ఎవరు? జ).................................

05) అజ్ఞానతిమిరాలను తరిమే శక్తి దేనికుంది? జ).................................

06) జీవితం యొక్క నిజమైన ప్రయోజనం దేన్ని పొందడానికి? జ).................................

07) శ్రీపాణయోగి జన్మనక్షత్రం? జ).................................

08) స్వర్ణరథంలోని స్వామిని దర్శిస్తే ఏమి తీరుతాయి? జ).................................

09) భగవంతుడు అన్ని ప్రాణుల్లో ఏ విధంగా ఉన్నాడు? జ).................................

10) ఎవరి ఉదరం నుండి కృష్ణుడు గురుపుత్రుణ్ణి బయటకు తెచ్చాడు ? జ).................................

11) రామాయణద్రష్ట ఎవరు? జ).................................

12) కృత్సమదమహర్షి ఎవరి భక్తుడు? జ).................................

13) శాస్త్రీయంగా దేవుడంటే ఏమిటని ఏ సంప్రదాయం చెప్పింది? జ).................................

14) శ్రీకృష్ణునికి కులనాశనం కావాలని శపించినదెవరు? జ).................................

15) ఎవరి దగ్గర దానం అడుగరాదు? జ).................................

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది **25-12-2025**.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: ................................. వయస్సు: ..................

పాఠశాల: ................................. తరగతి: ..................

పేరు: .................................................................

చిరునామా: .................................................................

.................................................................

.................................................................

................................. పిన్‌కోడ్: ..................

ఫోన్ సంఖ్య: .................................................................

### జవాబులు చేరాల్సిన చిరునామా

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

# బాలవినోదం

## తెలుగు పదాలతో ఆట...!



1) నెపము - సా☐
2) పోలిక - సా☐☐
3) సముద్రము - సా☐☐☐
4) చక్రవర్తి - సా☐☐☐☐
5) ధైర్యంతో చేసే పని - సా☐☐☐☐☐
6) సమభావము - సా☐☐☐☐
7) పనిముట్టు - సా☐☐☐
8) నానుడి - సా☐☐
9) సంవత్సరము - సా☐



జవాబులు: 1)సాకు 2)సామ్యము 3)సాగరము4)సార్వభౌముడు 5)సాహసకృత్యము 6)సామరస్యము 7)సాధనము 8)సామెత 9)సాలు

## 'గో' అనే అక్షరంతో అర్థవంతమైన పదాలను కూర్చండి!

1) ఆవు - గో☐
2) ఓ నది - గో☐☐☐
3) మొర - గో☐
4) నఖం - గో☐
5) ఒక రాష్ట్రం - గో☐
6) కుడ్యము - గో☐
7) కృష్ణుడి చెలులు - గో☐☐☐



జవాబులు: 1)గోవు 2)గోదావరి 3)గోడు 4)గోరు 5)గోవా 6)గోడ 7)గోపికలు

## మహాభారతంపై ప్రశ్నలు



1) మహాభారతం ఏ యుగంలో జరిగింది?
2) లక్క ఇంటిలో పాండవులు చనిపోకుండా కాపాడిన దెవరు?
3) మహాభారతంలో 'ప్రగల్భాలరాజు' ఎవరు?
4) భీమసేనుడు మొదట చంపిన వ్యక్తి ఎవరు?
5) పాండవులు అజ్ఞాతవాసంలో విరాటరాజు కొలువులో ఏయే పేర్లతో, ఏయే వృత్తిలో కాలం గడిపారు?

| | పేరు | వృత్తి |
|---|---|---|
| అ) ధర్మరాజు | .................. | .................. |
| ఆ) భీముడు | .................. | .................. |
| ఇ) అర్జునుడు | .................. | .................. |
| ఈ) నకులుడు | .................. | .................. |
| ఉ) సహదేవుడు | .................. | .................. |
| ఊ) ద్రౌపది | .................. | .................. |

జవాబులు: 1)ద్వాపరయుగం 2)విదురుడు 3)ఉత్తరకుమారుడు 4)బకాసురుడు 5)అ)కంకుభట్టు, మహారాజుతో జూదం ఆ)వలలుడు, వంటవాడు ఇ)బృహన్నల, నాట్యాచార్యుడు ఈ)తామగ్రంథి, అశ్వరక్షణ ఉ)తంత్రీపాలుడు, గోరక్షణ ఊ)సైరంధ్రి, మహారాణికి కేశాలంకరణ



గడులలో ఉన్న అస్తవ్యస్త అక్షరాలను సరైన వరుసలో పదాలుగా అమర్చి, వృత్తాల నడుమ ఇచ్చిన అక్షరాలతో వచ్చే అర్థవంతమైన పదమేమిటో కనుక్కోండి

1) (శ్వ) (రం) హా (వి) వి - ☐
2) (రూ) (సా) ప్య త - ☐
3) (త్కా) ఆ లం (ప) - ☐
4) (క్షా) జ ధి ర ల - ☐



పదం: (వి) (శ్వ) (రూ) (ప) (సా) (క్షా) (త్కా) (రం)

జవాబులు: 1)విశ్వవిహారం 2)సారూప్యత 3)ఆపత్కాలం 4)క్షారజలధి

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి

**మేషం–** వృత్తివ్యాపారాలలో ప్రతికూల పరిస్థితులు ఉన్ననూ అనుకూలంగా మార్చుకోగల్గుతారు. ఇతరులకు ఆకర్షణగా, అందగా నిలుస్తారు. సమాజం కుటుంబం, అధికారం వంటి విషయాలకు ప్రాధాన్యత ఇస్తారు.

**వృషభం–** ఆనందమయమైన వైవాహిక జీవితాన్ని అనుభవిస్తారు. ఒకరి పై మరొకరు పరస్పర గౌరవం కలిగియుండటం ఒకరి అభిప్రాయములను మరొకరు గౌరవించడం వలన జీవనం సాఫల్యమవుతుంది.

**మిథునం–** విద్యార్థులు పోటీ పరీక్షలలో రాణిస్తారు. అన్ని ప్రయత్నాలలో విజయం పొందుతారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. సంతోషంగా ఉంటూ సమాజంలో గౌరవాన్ని పొందుతారు.

**కర్కాటకం–**శారీరకదృఢత్వంకోసం యోగాభ్యాసం వ్యాయామంవంటి క్రమశిక్షణను పెంపొందించే ఆరోగ్యకరమైన నియమాలను అనుసరించండి. స్పెక్యులేషన్ మరియు పెట్టుబడులు లాభాలను అందిస్తాయి. అదృష్టం కలసివచ్చే కాలం.

**సింహం–** విద్యావ్యాసంగాలలో, వక్తృత్వపు పోటీలలో పాల్గొని బహుమతులు గెల్చుకుంటారు. అందరి ప్రశంసలను పొందుతారు. ప్రజాప్రయోజనం కోసం దాతృత్వంతో ఆకట్టుకుంటారు. అధికార పదవి వరిస్తుంది.

**కన్య–** ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. అనుకున్న పనులలో ఆలస్యం. ఆభరణ లాభం. సౌభాగ్యసిద్ధి కలుగుతుంది. విష్ణు ఆరాధన మంచిది.

**తుల–** ధనప్రాప్తి, మంచి మాటకారితనం, కుటుంబ అభివృద్ధి, మానసిక చింతన, దుస్వప్నముల వలన భయం, అన్ని పనులలో జయం కల్గుతుంది. శివారాధనం చేయడం వలన మంచి జరుగుతుంది.

**వృశ్చికం–** వాస్తవాలను భిన్న కోణాలనుంచి రాబట్టి సత్యాన్వేషణ చేస్తారు. నేర్చుకోవాలనే తపన తీవ్రంగా ఉంటుంది. ఇతర దేశప్రయాణాలు కలసివస్తాయి. ఆరోగ్యం అనుకూలిస్తుంది. శీతల ప్రాంతాలను సందర్శిస్తారు.

**ధనుస్సు–** స్వయం సమృద్ధి. ధన విషయాలలో లోటులేక, స్వచ్ఛమైన మేధస్సు ఆరోగ్యం కల్గియుంటారు. భావవ్యక్తీకరణ కలిగి ఉంటారు.

**మకరం–** పనిచేసే సంస్థలో జవాబుదారీతనానికి నిజాయితికి మారుపేరుగా మిమ్మల్ని అందరూ భావిస్తారు. మీ నాయకత్వం పట్ల ప్రజలు సంతుష్టులుగా ఉంటారు. ఆనందమయమైన జీవనం గడుపుతారు.

**కుంభం–** మానసిక అశాంతితో ప్రతి చిన్న దానికి అసంతృప్తికి లోనవడం, అస్థిమితం పెరుగుతుంది. బంధన యోగం కలిగే అవకాశం ఉంది. శత్రువుల బలాన్ని అంచనా వేయగల్గుతారు.

**మీనం–** వృత్తి ఉద్యోగ విద్యావిషయాల్లో సృజనాత్మకతతో ప్రతీపనిని సులువుగా చేయగల్గుతారు. ఇతరులకు ఆకర్షణగా నిలుస్తారు. మనోవికాసం కల్గుతుంది.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)



## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

........................................................ తేది :..................

ప్రదేశం :

తేది :

చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# శ్రీపదకేళి

119



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

**అడ్డం**

1)కొంగ(3); 3)డిసెంబరు 16 నుండి జనవరి 14వ తేదీ వరకు గల 30 రోజుల్ని ఈ మాసం అని పిలుస్తారు(4); 8)పాండురాజు భార్య(2); 9)కన్ను(3); 10)బ్రహ్మ(2); 13)మేనాహిమవంతుల పుత్రిక(4); 11)పరీక్షిత్తును కాటేసిన సర్పము(4); 16)కనికరము(2); 17)మార్గశిర కృష్ణఏకాదశి(3); 18)'కదంత్రొక్కు'- అనుపదంలో మేఘము(2); 22)కవిత్వం చెప్పేవాడు(2) 23)శిశుపాలుని తమ్ముడు(5)

**నిలువు**

2)'శాంకరి' పదంలో ఏనుగు(2); 4)స్తోత్రము(2); 5)బృహస్పతి సోదరుడు(5); 6)'ముక్కోటి'ని ఈ విధంగా పిలుస్తారు(7); 7)పుష్యమాస శుద్ధఏకాదశి(3); 11)ఎంతటివాడికైనా ఈ దుర్గుణం పనికిరాదు(3); 12)మార్గశీర్షమాసంలో వచ్చే శుక్ల పక్ష ఏకాదశి(3); 15)గీతాచార్యుడు ఈ వేదంలో ఉంటానని చెప్పాడు(4); 19)విప్రజిత్తు కుమారుడు(3) 20)సూర్యుడు(2) 21)మరదలకు అక్క భర్త(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



Printed by Sri R.V.Vijaya Kumar, B.A., B.Ed., and Published by Dr.V.G.Chokkalingam, M.A., Ph.D. on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.









తిరుమల
శ్రీవారి ఆలయంలో
అధ్యయనోత్సవాలు
19-12-2025 నుండి
12-01-2026 వరకు
జరుగుతాయి

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams Printing on 25-11-2025 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 1st of Every Month.

